తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 16.12.2025 | సంపుటి :12 సంచిక : 147 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## మూడో విడత పోలింగ్‌కు
# సర్వం సిద్ధం

**ముగిసిన ఆఖరి విడత ప్రచారం.. రేపు పోలింగ్**

**ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఓటింగ్**

**మధ్యాహ్నం నుంచి ఫలితాల ప్రకటన**




**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. సోమవారం సాయంత్రంతో ప్రచారం ముగియగా, బుధవారం ఎన్నికలు జరుగనున్నాయి. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎన్నికలు డిసెంబర్ 17న జరగనున్నాయి. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. ఇన్ని రోజులు గ్రామాల్లో హోరెత్తించిన మైకులు మూగబోయ్యాయి. డిసెంబర్ 17న 182 మండలాలు 4157 గ్రామ పంచాయతీలు,28, 406 వార్డుల్లో పోలింగ్ జరగనుంది. తుది విడతలో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకో నున్నారు. ఇందులో 26 లక్షల 1861 పురుష ఓటర్లు, 27 లక్షల 4 వేల 394 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలానే146 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల కోసం 36 వేల 483 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఎన్నికలు జరుగనున్న గ్రామాల్లో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. 2గంటల నుంచి కౌంటింగ్ జరిగిప ఫలితాలు ప్రకటిస్తారు. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ దుమ్మురేపింది. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామ, నిర్మల్ జిల్లాల మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలి విడత మాదిరిగానే రెండో విడతలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మద్దతు దారులకు నిర్మల్ జిల్లాలో మిగతా 2లో..



## జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన
# హైకోర్టుకు

- సవాల్ చేస్తూ రాంనగర్ వాసి పిటిషన్
- నేడు విచారణ జరపనున్న ధర్మాసనం




**హైదరాబాద్(జనంసాక్షి):**జీహెచ్ఎంసీలో డివిజన్ల పెంపును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైదరాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన వినయ్ కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీన్ని అత్యవసరంగా విచారించాలని న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. డివిజన్ల మిగతా 2లో..

## ఏ ప్రాతిపదికన పునర్విభజన చేశారు?

జీహెచ్ఎంసీ మేయర్‌తో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల భేటీ 2లో..

# రూపాయి మరింత పతనం



- డాలర్‌తో పోలిస్తే ఆల్‌టైమ్ కనిష్ఠానికి విలువ
- మరో 26 పైసలు పతనమై రూ.90.75కు చేరిక


**ముంబయి(జనంసాక్షి):**రూపాయి పతనం కొనసాగుతోంది. అంతర్జాతీయ విపణిలో డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి చేరింది. సోమవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూపాయి విలువ మరో 26 పైసలు పతనమై రూ. 90.75 వద్దకు చేరుకుంది. రూపాయికి ఇప్పటివరకు ఇదే కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాకపోవడం, విదేశీ మదుపర్ల అమ్మకాలు రూపాయిపై ఒత్తిడి పెంచుతున్నాయి.భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఆలస్యం వల్ల ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడంతో రూపాయిపై ప్రతికూల ప్రభావం పడుతోందని అనలిస్టులు చెబుతున్నారు. మార్కెట్ ఒడుదొడుకులు, మిగతా 2లో..



# మరో వివాదంలో నితీశ్

- మహిళ హిజాబ్ లాగిన బీహార్ సీఎం
- సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఘటన
- ఇది ఆయన మానసిక చర్యను తెలియజేస్తోంది:కాంగ్రెస్,ఆర్జేడీ విమర్శలు

**పట్నా(జనంసాక్షి):** బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. పట్నాలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ఓ మహిళ హిజాబ్‌ను లాగారు. దీనికి సంబంధించి వీడియో ప్రస్తుతం సామాజిక మిగతా 2లో..



## పల్లెల్లో
# వాడిన కమలం

**3911 స్థానాల్లో గెలిచింది 6.5 శాతమే..**

- కేవలం 236 స్థానాల్లోనే విజయం
- రెండు, మూడు జిల్లాల్లోనే ప్రభావం
- తక్కువ స్థానాలతో పార్టీకి ఘోర పరాభవం

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ పంచాయతీ పోరులో కమలం వాడిపోయింది. తెలంగాణలో 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపిలు ఉన్న బిజెపి పల్లెల్లో మాత్రం పట్టుకోల్పోయింది. గ్రామ పంచాయతీలకు జరిగిన రెండు విడతల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన సీట్లలో కనీసం సగం కూడా సాధించలేక ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నది. తొలి విడతలో దారుణంగా ఓటమిపాలైన బిజెపి కేవలం 189 పంచాయతీల్లో గెలుపొందింది. రెండో విడతలోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికలు జరిగిన 3,911 స్థానాల్లో కేవలం 236 స్థానాల్లో మిగతా 2లో..

# ప్రజాపాలనకే పల్లెల ఓటు

**కాంగ్రెస్ పాలనకు గ్రామీణ ప్రజలు పట్టం కడుతున్నారు**

- భారీగా నమోదవుతున్న ఓటింగే అందుకు నిదర్శనం
- ప్రజాస్వామ్యయుతంగా పంచాయతీ ఎన్నికలు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**హుజూర్‌నగర్(జనంసాక్షి):** స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు నిర్వహించిన రెండు విడతల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని రాష్ట్ర పౌర సరఫరాల, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం మార్నింగ్ వాక్ లో ప్రజలను కలిసి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం కాబట్టే సానుకూల స్పందన వస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. ప్రజలందరూ గమనించాలి. గతంలో మాదిరిగా కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు పాల్పడలేదు. పారదర్శకంగా , స్వేచ్ఛగా పంచాయతీ ఎన్నికలు నడుస్తున్నాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం బెదిరింపులు కక్ష సాధింపు రాజకీయం చేసింది. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కు తేడా అంటే కాంగ్రెస్ హయాంలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నడుస్తుంది. స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు కరెంటు ఫ్రీ, సంక్షేమం ఒకవైపు చేస్తూ, రాష్ట్రాన్ని ఎవరు ఊహించని విధంగా నెక్స్ట్ డెవలప్మెంట్ కు తీసుకెళుతున్నాం. అన్ని విధాలుగా ప్రణాళికలు జరుగుతున్నాయి. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తే మీ గ్రామం బాగుపడింది. మీ సమస్యలు పరిష్కారం అవుతాయి, ఆలోచన చేసి ప్రజలు ఓటేయాలన్నారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఎవరు కనీవిని ఎరుగని రీతిలో లిఫ్టు ఇరిగేషన్లు కొత్తవి నిర్మాణం చేస్తున్నాం, పాతవి పూర్తిస్థాయిలో మరమత్తులు చేస్తున్నాం. అన్ని రిజర్వాయర్లు ప్రతి మిగతా 2లో..



# ఉత్తరాది గజగజ

**పెరిగిన చలి.. ఢిల్లీలో తీవ్ర పొగమంచు**

- ప్రధాని మూడు దేశాల పర్యటనలో జాప్యం
- పలు విమాన సర్వీసుల్లో అంతరాయం..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఉత్తర భారతదేశాన్ని చలి గడ గడలాడిస్తుంది. రాజధాని ఢిల్లీని పొగమంచు కప్పేసింది. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఢిల్లీ సహా పంజాబ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోవడంతో విపరీతమైన పొంగ మంచు కమ్ముకోవడంతో చలి తీవ్రత పెరిగిపోయింది. ఉదయం పూట హైవే పై దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని. దీంతో వాహనదారులు ఎంతో ఇబ్బందిపడుతున్నారు. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో పొగమంచి విపరీతంగా కమ్మేసింది. దీంతో విమాన, రైలు రాకపోకలపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఒకేసారి 100 కు పైగా విమానాలను మిగతా 9లో..



# రెండోవిడతలోనూ సత్తాచాటాం

- పంచాయితీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం
- ప్రభుత్వ మోసాలతో ప్రజలు విసుగెత్తారు
- రేవంత్ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టం
- శ్రేణులకు అభినందనలు తెలిపిన కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):**రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంద న్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజక వర్గాల్లోనూ సత్తా చాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. సీఎం రేవంత్ రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకు తోడు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే, కాంగ్రెస్ కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో మిగతా 2లో..

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తా

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు 2లో..

## కొత్త సర్పంచ్‌లకు అండగా ప్రతి జిల్లాలో ప్రత్యేక న్యాయ విభాగం

నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కేటీఆర్ 12లో..

# 'వెట్టింగ్' వెతల వేళ 'రద్దు' పిడుగు

- వీసాదారులపై మరో బాంబు పేల్చిన అమెరికా
- భారీగా హెచ్-1బీ, హెచ్-4 వీసాల రద్దు
- మొదలైన వెట్టింగ్ ప్రక్రియ




**న్యూయార్క్(జనంసాక్షి):** హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులపై 'వెట్టింగ్'ను ప్రారంభించిన అమెరికా ప్రభుత్వం మరో బాంబు పేల్చింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీఎత్తున హెచ్-1బీ, హెచ్-4 వీసాలను 'ప్రుడెన్షియల్ రద్దు' చేసింది. ఈ మేరకు వర్కింగ్ వీసాలు రద్దయినట్లు ప్రభావిత వీసాదారులకు కాన్సులేట్ నుంచి ఈమెయిల్స్ వచ్చినట్లు తెలుస్తోంది. హెచ్-1బీ హెచ్4 వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే ఈ ప్రుడెన్షియల్ రద్దు తాత్కాలికమేనని తెలుస్తోంది. ఇది శాశ్వత వీసా మిగతా 2లో..

# ఉపాధి రద్దు



**ఆ స్థానంలో కొత్త చట్టం..**

**వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ బిల్లు తీసుకురానున్న కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీని స్థానంలో గ్రామీణులకు ఉపాధి కోసం కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన బిల్లు ప్రతులను సోమవారం లోక్‌సభ సభ్యులకు అందించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 2005లో తీసుకొచ్చారు. ఇప్పుడు దాన్ని రద్దు చేసి కొత్తగా.. వికసిత్ భారత్-గ్యారెంటీ మిగతా 2లో..

## దేవుడికి విశ్రాంతి ఇవ్వరా?



ఆలయంలో దర్శన వేళల్లో మార్పులపై సుప్రీం కోర్టు ఆగ్రహం 2లో..

బోండీబీచ్ కాల్పుల ఘటన..

## నిందితులు తండ్రీ కొడుకులే..

వారికి ఐసిస్‌తో సంబంధాలు

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
16.12.2025



## ప్రజాపాలనకే పల్లెల ఓటు

పంటకు పంటలు పండుతున్నాయి. ప్రతి ఎకరానికి నీళ్లు వస్తున్నాయి. ప్రజలందరూ ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జునరావు, గెల్లి రవి, గూడెపు శ్రీనివాస్, దొంత గాని శ్రీనివాస్ గౌడ్, కోలపూడి యోహాన్, కోడి ఉపేందర్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### 'వెట్టింగ్' వెతల వేళ..

## 'రద్దు' పిడుగు

తిరస్కరణ కిందకు రాదని ఇమిగ్రేషన్ అటార్నీ ఎమిలీ నాయ్‌మెన్ వెల్లడించారు. "ఈ తాత్కాలిక వీసా రద్దు వీసాదారుల చట్టబద్ధ నివాస హక్కును ప్రభావితం చేయదు. కానీ, తదుపరి వీసా అపాయింట్‌మెంట్ సమయంలో దీన్ని పరిగణనలోకి తీసుకుని వారి దరఖాస్తులను మరింత క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉంది" అని ఎమిలీ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

ఏంటీ ప్రుడెన్షియల్ రద్దు..

వీసాదారుల చట్టబద్ధ నివాస అర్హతలో ఏదైనా సమస్య ఉందని ప్రభుత్వం అనుమానించిన సమయంలో విదేశాంగ శాఖ వివేకవంతంగా వీసా రద్దుపై నిర్ణయం తీసుకుంటుంది. దీన్నే ప్రుడెన్షియల్ వీసా రివోకేషన్‌గా పిలుస్తారు. అయితే, ఇలా తాత్కాలికంగా రద్దు చేసినప్పటికీ.. వీసాదారులు తమ గడువు పూర్తయ్యేవరకు అమెరికాలో నివాసం కొనసాగించొచ్చు. అయితే, ఒకసారి అగ్రరాజ్యం నుంచి బయటకు వెళ్తే.. వీసా గడువు ఉన్నప్పటికీ మళ్లీ అమెరికాలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. తాత్కాలిక రద్దు సమయంలో వీసాల స్టాంప్ చెల్లుబాటు కాదు.

మొదలైన వెట్టింగ్..

ఇదిలాఉండగా.. హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారుల ఆన్‌లైన్ ఉనికిని సమీక్షించే వెట్టింగ్ ప్రక్రియ నేటినుంచి ప్రారంభమైంది. హెచ్1బీ, హెచ్4, ఎఫ్, ఎం, జే వీసాలకు దరఖాస్తు చేసినవారంతా వెట్టింగ్‌కు వీలుగా తమ సోషల్‌మీడియా సెట్టింగ్‌లను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనల వల్ల ఇప్పటికే భారతీయులు సహా అనేక మంది హెచ్1బీ వీసాల ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి.

## పల్లెలో వాడిన కమలం

(6.5 శాతం) మాత్రమే బిజెపి మద్దతుదారులు విజయం సాధించగలిగారు .ఆదిలాబాద్, మంచిర్యాల మినహా మిగిలిన ఏ జిల్లాలోనూ బిజెపి కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. రెండు విడతల్లో ఆ పార్టీ కేవలం 435 స్థానాలతో సరిపెట్టుకున్నది. రెండు విడతల్లో స్వతంత్ర అభ్యర్థులు 1,161 స్థానాల్లో గెలుపొందారు. అందులో సగం కూడా బిజెపి కి రాకపోవడం కమలనాథుల దయనీయస్థితికి అద్దంపడుతున్నది. కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గమైన కరీంనగర్‌తోపాటు ఎంపి ఈటల గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్‌లోనూ బిజెపి మద్దతుదారులు ఓటమిపాలవడం చర్చనీయాంశమైంది. మరో ఎంపి రఘునందన్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లో కనీసపోటీ ఇవ్వక పోవడంతో బిజెపి ఉనికి ప్రశ్నార్థకమైంది. బిఆర్‌ఎస్ పని అయిపోయిందని, ప్రత్యామ్నాయం తామేనని ఊదరగొట్టే బిజెపి రాష్ట్ర నేతల మాటలు కేవలం వట్టివేనని రెండు విడతల పంచాయతీ ఎన్నికల ఫలితాలతో ఖరారయిపోయింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థికి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి 30 శాతానికిపైగా ఓట్లు సాధించడం, 8 సీట్లలో గెలుపొందడం గాలివాటమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మున్ముందు తెలంగాణలో ఆ పార్టీ ప్రభావం నామమాత్రమేనని పేర్కొంటున్నారు.

### జీహెచ్‌ఎంసీలో డివిజన్ల పునర్విభజన

## హైకోర్టుకు..

పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని వినయ్‌కుమార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. రాంనగర్ డివిజన్‌పై తన అభ్యంతరాలను పరి గణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణను జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం మంగలశారం వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. జీహెచ్‌ఎంసీ డివిజన్ల విభజన అశాస్త్రీయంగా జరిగిందని ఆరోపిస్తూ కమిషనర్‌కు బీఆర్‌ఎస్ వినతి పత్రం అందజేశారు. వార్డుల విభజనను పునఃపరిశీలించాలని కోరారు. జీహెచ్‌ఎంసీలో డివిజన్ల పునర్విభజనకు ఆదేశాలిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నగరాన్ని 300 డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్లకు హద్దులను ప్రకటిస్తూ కొన్నిరోజుల క్రితం ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది. గతంలోని డివిజన్లతో పోలిస్తే పాత జీహెచ్‌ఎంసీలోని డివిజన్ల సంఖ్య దాదాపు రెట్టింపయ్యింది. దీంతో జీహెచ్‌ఎంసీలో పునర్విభజన పక్రియపై అభ్యంతరాలు పోటెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతల నుంచి విపక్షాలు, కాలనీ సంఘాలు, స్థానికులు ఇలా అన్ని వర్గాలు తీవ్రంగా సర్కారును తీరును ఎండగడుతున్నాయి. వార్డులోని ఓటర్ల సంఖ్య, భౌగోళిక స్వరూపం, సరిహద్దులను సమన్వయం చేసుకుని చేపట్టాల్సిన వార్డుల విభజనలో శాస్త్రీయత ఏ మాత్రం పాటించలేదంటూ భగ్గుమంటున్నాయి. 300 వార్డులను విభజించిన అధికారులు గందరగోళ పరిస్థితుల్లోకి తీసుకువచ్చారని, ఇంత హడావుడిగా విలీనం, వికేంద్రీకరణ పక్రియను చేపట్టాల్సిన అవసరం ఏం వచ్చిందంటూ మండిపడుతున్నారు. ఈ నేపథ్యం లోనే డీలిమిటేషన్ పై అభ్యంతరాలు, సలహాల స్వీకరణ వారం వ్యవధి గడువు తుది దశకు చేరింది. బీఆర్‌ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, బీజేపీ కార్పొరేటర్లు పెద్ద ఎత్తున పునర్విభజన జరుగుతున్న తీరుపై విమర్శించారు. రెండు రోజుల్లో అభ్యంత రాల గడువు ముగియనున్నది. ఇప్పటి వరకు 1328 మంది అభ్యంతరాలను వ్యక్తం చేశారు.




ప్రధానంగా అభ్యంతరాలను 25 వేల ఓటర్లకు మించకుండా వార్డులను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న వార్డుల పేర్లను మార్చాలని అభ్యంతరాలను వ్యక్తం చేస్తుండడం గమనార్హం. జీహెచ్‌ఎంసీలోకి 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం, వార్డుల డీలిమిటేషన్ పై ఈ నెల 16న జరగనున్న కౌన్సిల్‌లో బలంగా గళం విన్పించేందుకు బీఆర్‌ఎస్, బీజేపీ కార్పొరేటర్లు సిద్ధమయ్యారు.. వార్డుల పునర్విభజనపై జీహెచ్‌ఎంసీ అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తుండగా, ఇప్పటికే పలువురు మేయర్‌ను కలిసి పునర్విభజన అశాస్త్రీయంగా, ఒక వర్గానికి రాజకీయ ప్రయోజనాన్ని చేకూర్చేలా జరుగుతున్నదని ఆరోపించారు. ఈ క్రమంలోనే కౌన్సిల్ సమావేశంలో కూడా పునర్విభజనపై నిరసనలు చేపట్టేందుకు సిద్ధమైన వేళ మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## రూపాయి మరింత పతనం

డాలర్‌కు డిమాండ్ పెరగడం వంటివి కారణాలుగా పేర్కొంటున్నారు. గురువారం రూ.90.49 వద్ద ముగిసిన రూపాయి విలువ సోమవారం ఉదయం రూ.90.53 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 26 పైసలు నష్టపోయి రూ.90.75 వద్ద కనిష్ఠాన్ని తాకింది.అయితే, 90.80 స్థాయులు వద్ద మద్దతు ఉందని, ఒకవేళ అదీ దాటితే రూ.91 మార్కు కూడా దాటి రూ.92కు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. రూపాయి విలువను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్‌కే వదిలేసిందని, తీవ్ర ఒడుదొడుకులు ఎదురైనప్పుడు మాత్రం జోక్యం చేసుకునే అవకాశం ఉందని ఫిన్రెక్స్ ట్రెజరీ అడ్వైజర్ ఎల్‌ఎల్‌పీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ భన్సాలీ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్‌లో డాలరు ఇండెక్స్ 98.37 వద్ద ట్రేడవుతుండగా.. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.36 వద్ద కొనసాగుతోంది. శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషన్‌లో విదేశీ మదుపర్లు 1,114.22 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు.

## మరో వివాదంలో నితీశ్

మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇది ఆయన మానసిక చర్యను తెలియజేస్తోందంటూ కాంగ్రెస్, ఆర్జేడీ విమర్శలు గుప్పిస్తున్నాయి. పట్నాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఓ వైద్యురాలికి ఆయుష్ సర్టిఫికెట్‌ను నీతీశ్ తన చేతులమీదుగా అందజేశారు. సర్టిఫికెట్‌ను చేతికిచ్చిన ఆయన.. డాక్టర్ ముఖంపై ఉన్న హిజాబ్‌ను కొంతమేర తొలగించారు. సీఎం చర్యకు మహిళ స్పందించనప్పటికీ.. నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయారు. అదే స్టేజీపై ఉన్న కొందరు నవ్వుతూ కనిపించారు. అక్కడే ఉన్న డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరి మాత్రం సీఎంను ఆపే ప్రయత్నం చేయడం వీడియోలో కనిపించింది. సీఎం చర్యను కాంగ్రెస్ తీవ్రస్థాయిలో దుయ్యబట్టింది. నీతీశ్‌కు పూర్తిగా మతిభ్రమించినట్లు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మహిళల పట్ల జేడీయూ- భాజపా సంకీర్ణ ప్రభుత్వ వైఖరి ఏంటో ఈ ఉదంతం తెలియజేస్తోందంటూ ఆర్జేడీ అధికార ప్రతినిధి ఎజాజ్ అహ్మద్ పేర్కొన్నారు. బిహార్ ఎన్నికల సమయంలోనూ నీతీశ్ ఇలానే.. ఓ మహిళ మెడలో పూలదండ వేయడం వివాదాస్పదమైంది. దీంతో ఆయన మానసిక పరిస్థితి సరిగా లేదంటూ విమర్శలు ఎక్కుపెట్టాయి.

## ఏ ప్రాతిపదికన పునర్విభజన చేశారు?

### జీహెచ్‌ఎంసీ మేయర్‌తో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల భేటీ

**హైదరాబాద్(జనంసాక్షి):** జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో నగరానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలిసి కార్పొరేటర్లు మేయర్‌ను కలిశారు. జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజనపై ఆమెతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ డివిజన్ల సరిహద్దులపై మార్కింగ్ చేసి వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఏ ప్రాతిపదికన డివిజన్ల పునర్విభజన చేశారో చెప్పాలని కోరామన్నారు.బృహత్ హైదరాబాద్‌లో డివిజన్ల పునర్విభజనకు ఆదేశాలిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో నగరాన్ని 300 డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్లకు హద్దులను ప్రకటిస్తూ కొన్నిరోజుల క్రితం ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది. గతంలోని డివిజన్లతో పోలిస్తే పాత జీహెచ్‌ఎంసీలోని డివిజన్ల సంఖ్య దాదాపు రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల హద్దులు, కొత్త డివిజన్లపై జీహెచ్‌ఎంసీకి అభ్యంతరాలు, ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ మేయర్‌ను కలిశారు.

**జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజన సరికాదు: తలసాని**

జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజన ముసాయిదాపై భారత రాష్ట్ర సమితి అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కొత్త డివిజన్ల ఏర్పాటు, వార్డుల విభజన ముసాయిదాలో లోపాలు ఉన్నాయంటూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో పలువురు పార్టీ నేతలు జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వెళ్లి.. కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ల పునర్విభజనలో తప్పిదాలను సరి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తలసాని మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ డివిజన్ల విభజన గందరగోళంగా చేశారని విమర్శించారు. డివిజన్ల పునర్విభజనలో తొందరపాటు ఎందుకని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా డివిజన్లు విభజించడం తప్పు అని అన్నారు.

**అభ్యంతరాల వెల్లువ..**

జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజనపై భారీగా అభ్యం తరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల శివారు ప్రాంతాలను విలీనం చేయడంతో 300 వార్డులు ఏర్పాడ్డాయి. అయితే దీనిపై అభ్యంతరాల స్వీకరణ సోమవారంతో పూర్తి అయ్యింది. ఈ క్రమంలో మంగళవారం బల్దియా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ కౌన్సిల్‌లో కార్పొరేటర్ల అభిప్రాయాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తీసుకోను న్నారు. తద్వారా వార్డులు పనుర్విభజన ఏమైనా ఉంటే చేస్తారు. ఇప్పటి వరకు 1,328 అభ్యం తరాలు వచ్చాయి. ఆదివారం ఒక్కరోజే 227 అభ్యం తరాలు స్వీకరించారు అధికారులు. జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ ఆఫీసుల్లో అభ్యం తరాలు స్వీకరిస్తున్నారు జీహెచ్‌ఎంసీ అధికారులు. 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించ నున్నారు. ఈ నేపథ్యంలోనే వార్డుల విభజనపై అభ్యంతరాలు తెలపడానికి జీహెచ్‌ఎంసీకి క్యూ కట్టారు నగర ఎమ్మెల్యేలు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కార్పొరేటర్లతో మేయర్ గద్వాల విజయలక్ష్మి సమావేశం అయ్యారు. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా చేయాలంటూ మేయర్‌కు వినతిపత్రం ఇచ్చారు కాంగ్రెస్ కార్పొరేటర్లు. ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలవనున్నారు.

## 2029 ఎన్నికల్లో పోటీ చేస్తా

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. 2029 ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఆస్క్ కవిత పేరుతో ఎక్స్ వేదికగా నెటిజన్లతో ఆమె ముచ్చటించారు. ఈ సందర్భంగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. పలు సామాజిక అంశాలపై పలువురు ప్రశ్నించగా.. వాటికి ఆమె సమాధానాలు చెప్పారు.

## మూడో విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం

మెజారిటీ స్థానాలు వచ్చాయి. మూడో విడతలో మొత్తం 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఇప్పటి వరకు జరిగిన రెండు విడతల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. రెండో స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయాలు సాధిస్తుండగా.. మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతున్నారు. అంతేకాకుండా.. కొన్ని కొన్ని చోట్ల ఓట్లు సమంగా రావడంతో అభ్యర్థులు చివరకు టాస్ తో విజయం సాధిస్తున్నారు.



## 'ఉపాధి' రద్దు?

ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025ను తీసుకురానున్నట్లు సమాచారం. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధిని సాధించే దిశగా ఈ కొత్త పథకాన్ని రూపొందించినట్లు బిల్లులో పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సంవత్సరంలో 125 రోజుల పాటు వేతనంతో కూడిన ఉపాధికి హామీని ఇవ్వడంతో పాటు సంపన్న, సుస్థిర గ్రామీణ భారత్‌ను సాధించడం వంటి లక్ష్యాలను కొత్త చట్టంలో ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఇటీవలే గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును.. పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్చిన సంగతి తెలిసిందే. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్‌ఆర్‌ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు.

పహల్గాం ఉగ్రదాడి కేసు..

## జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పహల్గాం ఉగ్రదాడి కేసులో దర్యాప్తు చేస్తున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ సోమవారంనాడు జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. దాడి ప్రధాన సూత్రధారిగా పాకిస్థాన్ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తొయిబా కమాండర్ జాజిద్ జాట్ ను పేర్కొంది. హహల్గాం దాడి కేసులో లష్కరే తొయిబా, దాని ఫ్రంట్ ఆర్గనైజేషన్ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'తో సహా ఏడుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జిషీటు నమోదు చేసింది. హహల్గాం దాడిలో పాకిస్థాన్ కుట్ర, నిందితుల పాత్ర, వాటిని బలపరచే సాక్ష్యాలను ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. నిషేధిత ఎల్ఈటీ/టీఆర్ఎఫ్ సంస్థ ఈ కుట్రకు ప్రణాళిక రచించి దాన్ని అమలు చేసినట్టు తెలిపింది. మతం పేరు అడిగిమరీ పాక్ స్పాన్సర్డ్ ఉగ్రవాదులు ఈ దారుణానికి పాల్పడ్డారని, ఒక పౌరుడు సహా 25 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకున్నారని పేర్కొంది. ఈ మేరకు 1,597 పేజీల ఛార్జిషీటును ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ సమర్పించింది. ఉగ్రదాడి అనంతరం జులైలో చేపట్టిన ఆపరేషన్ మహదేవ్‌లో భారత బలగాలు మట్టుబెట్టిన ముగ్గురు పాక్ ఉగ్రవాదుల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఈ ఉగ్రవాదులను ఫైసల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్గానిగా పేర్కొంది. ఈ ముగ్గురితో పాటు సాజిద్ జాట్, ఎల్ఈటీ/టీఆర్ఎఫ్‌పై వివిధ సెక్షన్ల కింద అభియోగాలను మోపింది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారనే కారణంగా జూన్ 22న అరెస్టు చేసిన మరో ఇద్దరు నిందితులు పర్వెజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌ల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఇంటరాగేషన్‌లో ఈ ఇద్దరూ దాడిలో ప్రమేయమున్న మరో ముగ్గురు సాయుధ ఉగ్రవాదుల వివరాలను వెల్లడించారు. ఈ ముగ్గురూ ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా పనిచేసిన పాక్ ఉగ్రవాదులని అంగీకరించారు.పాక్‌కు చెందిన మోస్ట్ వాంటెండ్ టెర్రరిస్టు సాజిద్ జాట్. ఇతనిపై ఎన్ఐఏ రూ.10 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. అతని అసలు పేరు హబీబుల్లా మాలిక్. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని కసూర్ జిల్లావాసి. సైఫుల్లా, నోమి, నూమన్, లంగ్డా, అలీ సాజిద్, ఉస్మాన్ హబీబ్, షాని అనే పేర్లు కూడా ఇతనికి ఉన్నాయి. టీఆర్ఎఫ్ టాప్ కమాండర్‌గా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ప్రధాన ఉగ్రదాడుల్లో ఇతని ప్రమేయం ఉంది. 2022 అక్టోబర్‌లో యూఏపీఏ కింద అధికారికంగా వాంటెడ్ టెర్రరిస్టుగా ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో ఎల్ఈటీ ప్రధాన కార్యాలయం నుంచి ఇతను భారత్‌లో ఉగ్రవాదాన్ని నడిపించే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాడని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. భారత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారంటూ సాజిత్ జాట్‌పై పలు ఛార్జిషీటు సైతం ఎన్ఐఏ నమోదు చేసింది. కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత టెర్రర్ నెట్‌వర్క్‌ను నడుపుతున్న అత్యత ప్రమాదకరమైన వ్యక్తుల్లో ఒకరిగా సాజిద్‌ను భద్రతా సంస్థలు చెబుతున్నాయి.


## దేవుడికి విశ్రాంతినివ్వరా!

### ఆలయంలో దర్శన వేళల్లో మార్పులపై సుప్రీం కోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌లోని ఓ ఆలయంలో దర్శన వేళల్లో మార్పు కేసు విచారణలో భాగంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది బృందావన్‌లో గల బాంకీ బిహారీజీ ఆలయం లో దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. దేవుని విశ్రాంతి వేళల్లో ప్రత్యేక పూజలు చేయడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నత స్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బిహారీజీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా.. పలు మతపరమైన పూజా విధానాల్లోను మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని.. కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేవతలకు విశ్రాంతిని వ్వకుండా ప్రత్యేక పూజలు చేయాల్సిన అవసరమేంటని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఆచారం ప్రకారం వస్తున్న పవిత్రమైన ఆలయ నియమాలను, సమయాలను పాటించాలని ఆలయ అధికారులను ఆదేశించింది. ఆలయ నిర్వహణ కమిటీతో సహా సంబంధిత పార్టీలకు నోటీసులు ఇవ్వాలని దర్యాప్తు కమిటీని ఆదేశించింది. ఈ కేసు విచారణను జనవరి మొదటి వారానికి వాయిదా వేసింది.ఆలయ నిర్వహణ కమిటీ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## రెండోవిడతలోనూ సత్తాచాటాం

పెకిలిస్తున్నాయని కేటీఆర్ తెలిపారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని వ్యాఖ్యానించారు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రంచేస్తున్న రేవంత్ రెడ్డికి పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివని అన్నారు. నాడు బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతమని అన్నారు.కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిన నేపథ్యంలో ఇక సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై అనునిత్యం బీఆర్‌ఎస్ సాగిస్తున్న సమరాన్ని గుండెల నిండా ఆశీర్వదిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు తెలిపారు.గుండెల నిండా ఆశీర్వదిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబందహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసానిచ్చారు. నాడు బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం అన్నారు. కష్టకాలంలో బీఆర్‌ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంది' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



బోండీబీచ్ కాల్పుల ఘటన..

## నిందితులు తండ్రీ కొడుకులే..

- వారికి ఐసిస్‌తో సంబంధాలు
- ఉగ్రదాడిలో గాయపడి కోలుకుంటున్న సాహసి అహ్మద్ అల్ అహ్మద్

**సిడ్నీ(జనంసాక్షి):**ఆస్ట్రేలియాలోని బోండీబీచ్‌లో యూ దుల హనూకా వేడుకలపై దాడి చేసిన ఇద్దరు సాయు ధులను తండ్రీకొడుకులుగా దర్యాప్తు బృందం గుర్తించింది. వీరిని నవీద్ అక్రమ్ (24), సాజిద్ అక్రమ్ (50) అని పేర్కొన్నారు. ఈ నిందితులిద్దరూ పాకిస్థాన్ నుంచి వచ్చినట్లు న్యూసౌత్‌వేల్స్ పోలీసులు వెల్లడిం చారు. భద్రతాదళాలు జరిపిన ఎదురుదాడిలో సాజిద్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సాజిద్ పేరిట 2015 నుంచి తుపాకీ లైసెన్స్ ఉన్నట్లు న్యూసౌత్ వేల్స్ పోలీసులు వెల్లడించారు. అతడు ఓ హంటింగ్ క్లబ్‌లో కూడా సభ్యుడని తెలిపారు. సాజిద్ వద్ద ఆరు ఆయుధాలు ఉన్నాయి. వీటిని అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. నిందితుల్లో ఒకరు ఆస్ట్రేలియా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ నిఘా రాడార్‌లో ఉన్నాడు. అయినా తక్షణమే అతడి నుంచి ముప్పు లేకపోవడంతో సీరియస్‌గా తీసుకోలేదని తెలుస్తోంది.

**కోలుకుంటున్న సాహసి..**

బోండీ బీచ్‌లో సాజిద్ అక్రమ్ అనే దుండగుడితో పోరాడి తుపాకీ లాక్కొన్న అహ్మద్ అల్ అహ్మద్ అనే వ్యక్తి పెనుగులాటలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని సెయింట్ జార్జి ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు చెబుతున్నారు. అతడి సాహసాన్ని అభినందిస్తూ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ బిల్ అక్మాన్ రివార్డ్‌ను ప్రకటించారు.

**ఐసిస్‌తో సంబంధాలు**

ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో యూదులపై దాడి ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో నిందితులైన తండ్రీకొడుకులు నవీద్ అక్రమ్ (24), సాజిద్ అక్రమ్ (50)లకు ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియాతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల కారులో రెండు ఐసిస్ జెండాలు, ఘటనా స్థలం నుంచి రెండు ఐఈడీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆస్ట్రేలియాలో ఉగ్రదాడికి ప్రణాళిక చేసినందుకు 2019లో అక్కడి ప్రభుత్వం అరెస్టు చేసిన ఇస్లామిక్ స్టేట్ సభ్యుడితో నవీద్ అక్రమ్‌కు సన్నిహిత సంబంధాలున్నట్లు పేర్కొన్నారు. కొంతకాలం అతడు ఆస్ట్రేలియా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ నిఘా రాడార్‌లో ఉన్నాడని.. అయితే తక్షణమే అతడి నుంచి ముప్పు లేకపోవడంతో సీరియస్‌గా తీసుకోలేదని అధికారులు పేర్కొన్నారు. సిడ్నీ ఉగ్ర కాల్పుల ఘటనలో 16 మంది మరణించడంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం అప్రమత్తమయ్యింది. ఇటువంటి ఘటనలు నివారించాలంటే దేశంలో తుపాకీ చట్టాలను కఠినతరం చేయాలని ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రతిపాదించారు. ఇందులోభాగంగా లైసెన్స్ పొందిన వారి వద్ద ఉండే తుపాకుల సంఖ్యను పరిమితం చేయడం సహా పలు ఆంక్షలను విధించనున్నట్లు తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించే ఎటువంటి చర్యలు తీసుకోవడానికైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# ‘ఉపాధి’ని చంపే కుట్ర

- పేదల పొట్ట కొట్టడమే కేంద్ర ఉద్దేశం
- అందుకే పథకం పేరులోనూ, అమలు విధానంలోనూ మార్పులు
- పేదలను, రాష్ట్రాలను శిక్షించేలా నూతన బిల్లు
- కేంద్రం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి
- మంత్రి సీతక్క డిమాండ్



హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మను, అమలు విధానాన్నీ మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా ఉన్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆక్షేపించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును “వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) : వీబీ–జీ రామ్ జీ’గా మార్చే బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన నేపథ్యంలో, ఆ బిల్లును మంత్రి సీతక్క తీవ్రంగా తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడం వంటి గొప్ప లక్ష్యాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందని ఆమె మండిపడ్డారు. గతంలో వంద శాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. పథకం పేరులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని ఆమె అన్నారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు తెరలేపుతోందని ఆరోపించారు. చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించాల్సి ఉన్నప్పటికీ, బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఏ సంవత్సరంలోనూ 42 రోజులకన్నా ఎక్కువ పనిదినాలు కల్పించలేదని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇది చట్ట ఉల్లంఘనకు సమానమని ఆమె వ్యాఖ్యానించారు. ఈ పథకానికి ప్రతి ఏడాది నిధుల్లో భారీ కోత విధిస్తూ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాలరాస్తోందని ఆమె మండిపడ్డారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా తెలంగాణను పేర్కొంటూ, గత ఏడాది రాష్ట్రంలో 12.5 కోట్ల పని దినాలు కల్పించగా, ఈ ఏడాది కేవలం 7.5 కోట్ల పని దినాలకే పరిమితం చేశారని వెల్లడించారు. రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన న్యాయమైన నిధుల వాటాను కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీల పేరుతో కబళిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. ఇదే సమయంలో ఉపాధి హామీ పథకంలోనూ 40 శాతం భారం రాష్ట్రాలపై మోపడం పూర్తిగా అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ పేదల ఉపాధి హక్కును కాపాడాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులతో, బాధ్యతాయుతంగా కేంద్ర ప్రభుత్వమే అమలు చేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# ఇష్టారాజ్యంగా డీ లిమిటేషన్

- డివిజన్‌ల ఏర్పాటు తప్పిదాలను సవరించండి
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు వినతి



హైదరాబాద్ (జనంసాక్షి) : ఒక స్పష్టమైన విధానం లేకుండా డీ లిమిటేషన్ పేరుతో జీహెచ్ఎంసీలో డివిజన్ లను ఇష్టమొచ్చినట్లుగా ఏర్పాటు చేశారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ ల ఏర్పాటు లో జరిగిన తప్పిదాలపై తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ లతో కలిసి జీహెచ్ఎంసీ కార్యాలయంలో కమిషనర్ కర్ణన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ ఏర్పాటు మొత్తం గందరగోళంగా ఉందని ఆయన కమిషనర్ కు వివరించారు. కార్పొరేటర్ ల అభిప్రాయాలు, సూచనలను తెలుసుకోవడానికే మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వివరించారు. అనంతరం మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ అంత హరిబరిగా ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీ లు, కార్పొరేషన్ లను జీహెచ్ఎంసీలో విలీనం చేసి 150 ఉన్న డివిజన్ లను 300 కు పెంచాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. రాజకీయ పార్టీలను, ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఆఫీసులలో కూర్చొని వారికి తోచినట్లు డివిజన్ లను ఏర్పాటు చేశారని అన్నారు. డివిజన్ ల సరిహద్దులలో కూడా పారదర్శకత లేదన్నారు. మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశం లో ఈ అంశంపై గట్టిగా మాట్లాడతామని చెప్పారు. ఇప్పుడున్న 150.డివిజన్లకు సరియైన అధికారులు, మ్యాన్ పవర్. లేని పరిస్థితుల్లో నూతనంగా మరో150 డివిజన్ లను ఏ విధంగా పెంచారని ప్రశ్నించారు. డివిజన్ కు 2 కోట్ల రూపాయలు చొప్పున నిధులు ఇస్తామని చెప్పి హడావిడి చేసి ఇంచార్జి మంత్రులకు అప్పగించడం ఎంత వరకు సబబు అన్నారు. నగరంలో ని వివిధ సందర్భాల్లో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీ లలో కూడా కేవలం తమ పార్టీకి చెందినవి మాత్రమే తొలగిస్తున్నారని అన్నారు. తొలగిస్తే అన్ని ఫ్లెక్సీ లను తొలగించాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ లో ఈ అంశంపై కూడా నిలదీస్తామని హెచ్చరించారు. కమిషనర్ దృష్టికి కూడా ఈ విషయాలను తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు.

# పర్యావరణ పరిరక్షణ హైడ్రాతోనే సాధ్యం

- ఖాళీ స్థలాల్లో పార్కులభివృద్ధికి విన్నపాలు
- హైడ్రా ప్రజావాణికి 46 ఫిర్యాదులు



**హైదరాబాద్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడి.. పర్యావరణానికి ఊతమివ్వడం హైడ్రాతోనే సాధ్యమని పలువురు పేర్కొన్నారు. చెరువులు, నాలాలను పరిరక్షించి అనుసంధానం చేయాలని అప్పుడే వరదలు లేని నగరం చూడగలమన్నారు. ఈ క్రమంలో చెరువులను పరిరక్షిస్తున్న హైడ్రా.. పార్కులను కూడా చేపట్టాలని పలువురు కోరారు. లే ఔట్లలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసి ప్రాణవాయువును అందించాలని పలువురు హైడ్రా ప్రజావాణిలో కోరారు. నివాసాల మధ్య కొద్ది మొత్తంలో ఉన్న ప్రభుత్వ స్థలాలకు కంచె వేసి.. పార్కులుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నిజాంపేటలోని తుర్క చెరువు కింద ఉన్న ప్రభుత్వ స్థలాలకు కంచెవేసి పార్కులుగా తీర్చిదిద్దాలని కోరారు. మేడ్చల్ జిల్లా కాప్రా మండలం చిన్న చెర్లపల్లిలోని వెంకట రెడ్డి కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని వెంటనే హైడ్రా జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 46 ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి, పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

# అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్
- రేతిఫైల్ బస్టాండ్ నుంచి చిలకలగూడ బస్టాప్ వరకు ఆందోళన



హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్ చేసింది. దండకారణ్యం లోని ఖనిజ సంపద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతున్నా సిపిఐ (మావోయిస్టు), ఆదివాసులపై ఆపరేషన్ కగార్ పేర జరుగుతున్న నరమేధానికి నిరసనగా సికింద్రాబాద్ లోని రేతి ఫైల్ బస్సు స్టాండ్ నుండి చిలకలగూడా బస్సు స్టాప్ వరకు ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక కన్వీనర్స్ వంగల సంతోష్,పల్స యాదగిరి, రైతుకూలీ సంఘం (ఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెల్తురు సదానందం, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు టి.రత్నకుమార్, వై.మల్లేష్, మాతంగి రాయమల్లు, పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్, కె.మహేష్, పీవోడబ్ల్యూ స్త్రీవిముక్తి నాయకురాలు గంగా, ఎస్.లావణ్య రాజేశ్వరి, రమ అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, కళాకారులు రాకేష్, అరుంధతి, సౌజన్య, మౌనిక, హారిక, ఏఐఎఫ్‌టీయూ నాయకులు, రాజేశ్వరి, జి.రాములు, ఎం.పోచమల్లు, కుర్తె లింగం, వెంకట లక్ష్మి, అనసూర్య, రైతుకూలీ సంఘం నాయకులు బొమ్మకంటి కొమురయ్య, యుగేందర్, చిత్తరి స్వామి, తదితరులతోపాటు 79మంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగ పరిధినిమించి కేంద్ర హోం మినిస్టర్ అమిత్ షా ను కేంద్రం నుండి బర్తరఫ్ చేయాలి. లొంగండి లేదా చావండి అంటూ తేదీలు నిర్ణయించడం జీవించే హక్కును హరించడమే. కేంద్ర హోం మంత్రి అమిత్ షా వాఖ్యానాలను సుమోటో గా తీసుకోని బీఎన్ఎస్ 103ప్రకారం అరెస్ట్ చేసివిచారించి శిక్షించాలన్నారు. చతీష్గడ్, ఝార్కండ్, బీహార్, ఈశన్యా రాష్ట్రాల్లో, కాశ్మీర్‌లలో జరుగుతున్నఅణిచివేత, సామ్రాజ్యవాదుల సంపద పెంచడానికే. భారతదేశం లో ని ఖనిజసంపద ను వేదాంత్, జిందాల్, ఎస్‌ఆర్, మిట్టల్, డీ బీర్, అదాని, అంబాని లాంటి కార్పొరేట్ సంస్థలకు అప్పజేప్పే కుట్రలను వక్తలు ఖండించారు. ఆపరేషన్ కగార్ ను నిలిపివేసి, అడవుల్లోని సాయుధ పోలీస్ బలగాలను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ నియంత్రత్వంగా వ్యవహరిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను భర్తరఫ్ చేసేంత వరకు ప్రజాస్వామికవాదులు, పిడిత ప్రజలు ఆందోళన పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు.


# ఎన్నికల అధికారిపై గ్రామస్తుల ఆగ్రహం

### గదిలో బంధించడంతో పోలీసుల జోక్యం

**సూర్యాపేట, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల హడవుడి నడుస్తుంది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం.. సీతారామపురం గ్రామంలో ఎన్నికల అధికారి నాగరాజును గ్రామస్థులు ఓ గదిలో బంధించారు. ఎన్నికల అధికారి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని.. ఉపసర్పంచ్ పదవిని ముందుగానే ప్రకటించారని గ్రామస్థులు ఆరోపిస్తునున్నారు. నాగరాజు వ్యవహారంపై గ్రాస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని గదిలో బంధించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయమై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు సంబరాలు చేసుకుంటే.. ఓడిన అభ్యర్థులు కొన్నిచోట్ల ఆందోళన చేస్తున్నారు. తమ వద్ద డబ్బు తీసుకొని వేరే వాళ్లను గెలిపించారని ఆరోపిస్తూ.. తిరిగి డబ్బు చెల్లించాల్సిందిగా ఓటర్లను ఒత్తిడి చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గెలిచిన అభ్యర్థులపై ఓడిన అభ్యర్థులు దాడులకు పాల్పడుతున్నారు. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు.

# మధు యాష్కీ గౌడ్‌కు ఉప్పల జన్మదిన శుభాకాంక్షలు





హైదరాబాద్ (జనంసాక్షి) : క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ (టీపీసీసీ) మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కీ గౌడ్‌కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా హయత్ నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ప్రజా సేవలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# ఓట్ చోరీ వ్యవహారం కాంగ్రెస్‌దే

### కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** ఓట్ల చోరీ ఆరోపణలతో విపక్ష పార్టీలు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దీన్ని ప్రధాన అస్త్రంగా మలచుకున్నారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోని ఎన్‌సీ నేత, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల చోరీ అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తుతోందని, దీనికి 'ఇండియా' కూటమికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆరోపిస్తున్న ఓట్ల చోరీ, ఎన్నికల్లో అక్రమాలపై సీఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. ఇండియా కూటమికి ఈ వ్యవహారంతో ఎటువంటి సంబంధం లేదు. ప్రతి పార్టీకి తన సొంత అజెండాను నిర్దేశిరచుకునే స్వేచ్ఛ ఉంది. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లను హస్తం పార్టీ తన ప్రధాన అంశాలుగా చేసుకుంది. ఏం చేయాలో వాళ్లకి మనం చెప్పలేం కదా అని అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ దిల్లీలో 'ఓట్ చోర్... గద్దీ ఛోడ్' బహిరంగ సభ నిర్వహించిన మరుసటి రోజే ఆయన ఈమేరకు స్పందించారు.

# కన్హా శాంతివనం సందర్శించిన చంద్రబాబు

- రెయిన్ ఫారెస్ట్..వృక్షశాస్త్ర పరిశోధనలపై ప్రశంసలు



**రంగారెడ్డి, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** ఆధ్యాత్మికత ద్వారానే విశ్వ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం హైదరాబాద్ శివారులోని కన్హా శాంతి వన ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కన్హా శాంతి వనం నిర్వాహకులు, శ్రీరామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజీతో సమావేశమయ్యారు. శాంతివనంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం ఉంది. అలాగే వెల్‌నెస్ సెంటర్, యోగా చేసుకునేందుకు సౌకర్యం, హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్, పుల్లెల గోపీచంద్ స్టేడియం వంటివి ఉన్నాయి. వీటిని దాజీతో కలిసి సీఎం చంద్రబాబు సందర్శించారు. కన్హా శాంతి వనం స్వర్గాన్ని తలపించేలా ఉందని, పర్యావరణాన్ని కాపాడుతూ శాంతి వనాన్ని తీర్చిదిద్దిన తీరు అద్భుతమని వ్యాఖ్యానించారు. రేపటి తరం నాయకులను తీర్చిదిద్దేలా హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ నడుపుతున్నారని సీఎం ప్రశంసించారు. అలాగే శాంతివనంలో జరుగుతోన్న శాస్త్రీయ, వృక్షశాస్త్ర పరిశోధనల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. జీవ వైవిధ్యం, పర్యావరణ కార్యక్రమాలను వీక్షిస్తూ సీఎం చంద్రబాబు రెయిన్ ఫారెస్ట్‌ను సందర్శించారు. రెయిన్ ఫారెస్ట్ రూపకల్పన, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సీఎంకు దాజీ వివరించారు. అలాగే ధ్యాన మందిరం వెలుపల ఉన్న వర్షపు నీటి సంరక్షణ ప్రాంతమైన బాబూజీ వనాన్ని సీఎం సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్ అకాడమీని, ప్రపంచ స్థాయి శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..కన్హా శాంతి వనంలో ఆధ్యాత్మికత ఉట్టిపడే వాతావరణం ఉందన్నారు. విద్యా రంగంలో కొత్త ప్రమాణాలు పాటిస్తూ హార్ట్‌ఫుల్‌నెస్ ఇంటర్నేషనల్ స్కూల్ చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. ఏపీ ముఖ్యమంత్రి శాంతివనాన్ని సందర్శించడం సంతోషాన్నిస్తోందని శ్రీరామ చంద్ర మిషన్ ప్రెసిడెంట్ దాజీ అన్నారు.


# రోడ్డు దాటుతుండగా కారు ఢీ

### వైద్య విద్యార్థిని దుర్మణం

**హైదరాబాద్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** నగరంలోని హయత్‌నగర్ పీఎస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనలో ఎంబీబీఎస్ విద్యార్థిని ఐశ్వర్య మృతిచెందారు. ఆర్టీసీ కాలనీ వద్ద తన తండ్రి పాండుతో కలిసి రోడ్డు దాటుతుండగా అతివేగంతో వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన ఐశ్వర్య, పాండును ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఐశ్వర్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం పాండును వేరే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఐశ్వర్య మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# వార్డు మెంబర్‌గా గెలుపు..

### గుండెపోటుతో అర్ధరాత్రి మృతి



**నాగర్ కర్నూల్, డిసెంబరు15 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన ఓ వ్యక్తి హఠాత్తుగా మృత్యువాత పడటం స్థానికంగా విషాదం నింపింది. ఈ విషాదకర సంఘటన బిజినపల్లి మండలం వెంకటాపూర్‌లో గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రెండో విడుత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామానికి చెందిన జుర్రు మహేష్ యాదవ్ (34) వార్డు మెంబర్ గా పోటీ చేసి ఆదివారం విజయం సాధించాడు. అయితూ అనూహ్యంగా అర్ధరాత్రి నిద్రలోనే గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య లావణ్య తో పాటు ఇద్దరు సంతానం ఉన్నారు. మహేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


# రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాగిరి

- సోమార్‌పేట్ గ్రామ ఘటనపై కెటిఆర్ ఆగ్రహం
- తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు



**హైదరాబాద్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ఆ పార్టీ నాయకుల గూండాగిరి రోజురోజుకూ శృతి మించుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన అమానుష ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు తెగబడటం పిరికిపంద చర్య అని మండిపడ్డారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సోమార్‌పేట్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలో బీఆర్ఎస్ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన బిట్ల బాలరాజు, ఫలితాల తర్వాత తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ఇంటి ముందు కూర్చుని ఉన్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి స్థానిక మండల అధ్యక్షుడు సాయిబాబా ట్రాక్టర్‌తో అక్కడకు వచ్చి బీభత్సం సృష్టించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. నన్ను ఎవరూ ఏం చేయలేరు అంటూ విర్రవీగుతూ.. నిల్చున్న వారిపైకి ట్రాక్టర్ ఎక్కించి ఢీకొట్టారు. ఈ దాడిలో బీఆర్ఎస్ అభ్యర్థి బాలరాజుతో పాటు ఆయన అనుచరులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే కేటీఆర్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. పార్టీ వారికి అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. అనంతరం కామారెడ్డి జిల్లా ఎస్పీకి కేటీఆర్ స్వయంగా ఫోన్ చేశారు. సోమార్‌పేట్ ఘటనను వివరించి, బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం ఉంది కదా అని కాంగ్రెస్ నేతలు హత్యాయత్నాలకు పాల్పడుతుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని, ప్రజలు, కార్యకర్తలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని కేటీఆర్ హెచ్చరించారు. అదే జరిగితే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. గాడి తప్పిన కాంగ్రెస్ నేతలను కట్టడి చేయాల్సిన బాధ్యత పోలీసులదే అని ఆయన తేల్చిచెప్పారు.

# ప్రపంచ కార్మికుల పోరాటం భారత్ ఒక ప్రతిధ్వని




కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తుందని ప్రకటించిన సందర్భంలో, భారత కార్మిక వర్గం ఫిబ్రవరిలో జాతీయ సమ్మె ప్రకటించింది. ఇది ఒక విడిగా సంభవించిన సంఘటన కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా కార్మికులపై సాగుతున్న నియంత్రణ విముక్త, వేతన-సంకోచ విధానాలకు వ్యతిరేకంగా రగిలిన అగ్ని పర్వతం విస్ఫోటనాల్లో భారతం కూడా ఒక అధ్యాయం మాత్రమే. పోర్చుగల్, ఇటలీ, ఫ్రాన్స్, గ్రీస్ వంటి దేశాల్లో ఇటీవలే జరిగిన భారీ సమ్మెలు, ఆందోళనలు ఈ విషయానికి స్పష్టమైన నిదర్శనాలు.

ఈ దేశాలలోని ప్రతిఘటనలు భారత్ లోని సన్నాహాలు, వివిధ భౌగోళిక, రాజకీయ సరిహద్దులను దాటి ఒకే ఒక వ్యవస్థాపక విధానానికి వ్యతిరేకంగా ఉన్నాయి. అంటే, 'ప్రపంచీకరణ' పేరుతో సాగుతున్న కార్పొరేట్ ఆదరణ, కార్మిక బలహీనీకరణ విధానాలు.

**ఒకే నమూనా, ఒకే దాడి:**

వివిధ దేశాల్లో జరిగిన ఆందోళనల్లో కీలకమైన డిమాండ్లు చాలా ఏక రూపంగానే ఉన్నాయి. కార్మిక చట్టాలను సడలించి, శాశ్వత ఉద్యోగాలకు బదులు తాత్కాలిక, భద్రతా రహిత ఉద్యోగాలను ప్రోత్సహించడంబీ పని గంటలను పెంచడంబీ జీవనాధార వేతనాలు లేకుండా చేయడం లేదా వాటిని నిష్క్రియాత్మకంగా ఉంచడంబీ సామూహిక ఒప్పందాల హక్కుపై నిర్బంధాలు విధించడంబీ ప్రజాసంక్షేమం, విద్య, వైద్య రంగాలపై ఖర్చు తగ్గించి, రక్షణ పరిశ్రమకు,పెద్ద వ్యాపారాలకు పన్ను రాయితీలు, సబ్సిడీలు ఇవ్వడం - ఇవన్నీ ఈ దాడి యొక్క ముఖ్య అంశాలు.

పోర్చుగల్‌లో, ప్రసూతి సెలవులు తగ్గించి, సంఘాల ఏర్పాటుపై ఆంక్షలు విధించే ప్రతిపాదనలకు వ్యతిరేకంగా లక్షలమంది వీధుల్లోకి వచ్చారు. ఇటలీలో, వేతన పెరుగుదలపై నిషేధం,సేవా రంగాల కోతలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సమ్మె జరిగింది. గ్రీస్ లో, పని గంటలను 13 కి పెంచే ప్రయత్నాన్ని కార్మికులు తీవ్రంగా ఎదిరించారు. ఫ్రాన్స్ లో, పెన్షన్ సదుపాయాలపై దాడి, పన్ను న్యాయం లేమికి వ్యతిరేకంగా మహా సమ్మెలు రగిలాయి, ఇవి దేశాన్ని ముట్టడించాయి.

**ప్రపంచీకరణ పేరుతో కార్పొరేట్ ఆధిపత్యం**

ఈ దాడికి మూలం. సోవియట్ యూనియన్ పతనం తర్వాత రూపుదిద్దుకున్న ఏక ధృవ ప్రపంచ వ్యవస్థ. ఈ వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థలోని సంక్షోభాన్ని దాటడానికి, కార్పొరేట్ లాభాలను పరిరక్షించు కోవడానికి , కార్మిక హక్కులు, సామాజిక భద్రతా చట్రాల ను క్రమంగా నశింపచేయడానికి పనిచేస్తుంది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ' వంటి భావనలు ఈ విధానానికి సైద్ధాంతిక రూపు కల్పించాయి. దీని ఫలితంగా, ప్రభుత్వాలు సహజ వనరుల నియంత్రణను కార్పొరేట్‌లకు అప్పగిస్తూ, పన్ను భారాన్ని సాధారణ ప్రజలపై మోపుతూ, కార్మికులను మరింత అసహాయ స్థితికి నెట్టడం జరుగుతోంది.

**భారతదేశంలో అనుభవాలు :**

ఈ పరంపరలో భాగం గానే భారత్ లో కూడా కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను అణచివేసే క్రమంలో
నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకువచ్చింది. ఈ ప్రపంచవ్యాప్త అణచివేసే పథకంలో భారత అధ్యాయం. ఇవి కార్మికులను 'ఫ్లెక్సిబిలిటీ' పేరుతో ఎలాంటి సామాజిక భద్రత లేకుండా మార్కెట్ శక్తుల ఊచకోతకు గురిచేస్తాయి. అంతర్జాతీయ నివేదికలు, గణాంకాలు , అనేక పరిశ్రమలలో ఇప్పటికే కార్మికుల వాటా తగ్గుతూ, ఆదాయ అసమానతలు పెరుగుతున్న సమయంలో ఈ చట్టాలు వచ్చాయి. ప్రపంచ బ్యాంకు లేదా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఓ.) డేటా కూడా అనేక దేశాల్లో కార్మిక హక్కులు మరియు ఆదాయ వితరణ సవాళ్ళను ఎదుర్కొంటున్నట్లు సూచిస్తుంది.

**ప్రతిఘటన ఉద్యమాలు:**

కార్మిక శక్తిలో ఏకీభావం మాత్రమే మార్గం. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన సమ్మెలు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతున్నాయి. సంఘటితమైన, ఏకీభావంతో కూడిన ప్రతిఘటన ఉద్యమాలు మాత్రమే ఈ దాడిని తిప్పికొట్టగలదు. పోర్చుగల్ లో, వివిధ ట్రేడ్ యూనియన్ల మధ్య ఐక్యత దేశాన్ని స్తంభింప చేసే సమ్మెకు దారితీసింది. ఇటలీ, గ్రీస్ లోని కార్మికులు వివిధ రంగాలను ఏకం చేసింది. అవి ప్రభుత్వాలను వణికి పోయేలా చేశాయి. అందువల్ల, ఫిబ్రవరిలో భారతదేశంలో ప్రతిపాదించ బడిన జాతీయ సమ్మెను కేవలం ఒక సంఘర్షణగా చూడకూడదు. ఇది ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై సాగుతున్న యుద్ధంలో ఒక ముఖ్యమైన యుద్ధ భూమికగా మాత్రమే చూడాలి. ఇందులో విజయం సాధించాలంటే, కేవలం కేంద్ర కార్మిక సంఘాలు మాత్రమే కాకుండా, ప్రతి రంగం, ప్రతి కర్మాగారం, ప్రతి కార్మికుడు ఈ దాడి యొక్క పరిమాణాన్ని మరియు ప్రపంచ స్వభావాన్ని అర్థం చేసుకోవడం అత్యవసరం.

ప్రచారం విస్తృతంగా, ప్రతి కార్మికుని దగ్గరకు చేర్చేలా ఉండాలి. రవాణా రంగం ఇందులో కీలక పాత్ర పోషించాలి ప్రతి కార్మికుడూ తన హక్కు కోసం మాత్రమే కాకుండా, తరువాతి తరానికి గట్టి అస్తవ్యస్తమైన శ్రమ చట్రాన్ని అందించకుండా నిరోధించడానికి పోరాడుతున్నాడు.


కార్ల్ మార్క్స్ చెప్పినట్లుగా, "ప్రపంచ కార్మికులారా, ఏకంగా ఐక్యమవండి!" ఈ నినాదం ఈ రోజు అన్ని దేశాల కార్మికుల పోరాటంలో సజీవ వాస్తవమైంది. భారత కార్మిక వర్గం తన సాంప్రదాయిక విభజనలను మించి, ప్రపంచమంతటి తోటి కార్మికుల పోరాటం నుండి స్ఫూర్తి తీసుకుని, ఐక్యంగా నిలవడమే ఈ ప్రతిఘటన యొక్క విజయానికి బాటలు వేసే రహస్యం. లేబర్ కోడ్స్ దాడి కేవలం చట్టపరమైన మార్పు కాదు. ఇది కార్మికుని గౌరవం, భద్రత, వారి భవిష్యత్తుపై దాడి. దీనికి ప్రతిస్పందన కూడా సాధారణ సమ్మెలా కాకుండా, మన సామూహిక భవిష్యత్తు కోసం ఒక సమగ్రమైన, సంఘటిత పోరాటంగా ఉండాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## విశ్వవిద్యాలయ అధ్యాపకులకు ఆర్థిక భరోసానే

# కొండంత అండ!





అధ్యాపక సమాజం ఎదుర్కొంటున్న సంక్షోభం కేవలం వేతన సమస్యగా మాత్రమే చూడదగినది కాదు. ఇది తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థ నైతికతను, పాలనా బాధ్యతను, సామాజిక న్యాయాన్ని కొలిచే అద్దంలా నిలుస్తోంది. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రంలోని పన్నెండు విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులు నిరంతరంగా బోధన చేస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. శాశ్వత అధ్యాపకుల కొరతను భర్తీ చేస్తూ తరగతులు ఆగిపోకుండా నడిపిస్తున్న ఈ వర్గం జీవన భద్రత లేని పరిస్థితుల్లో పనిచేస్తున్నా విద్యా వ్యవస్థ పట్ల తమ నిబద్ధతను ఎక్కడా తగ్గించలేదు. ఈ వాస్తవం పాలకులకు తెలిసినప్పటికీ వ్యవస్థలోని కొన్ని లోపాల వల్ల న్యాయం ఇప్పటికీ పూర్తిగా అందకపోవడం దురదృష్టకరం.

ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ రాష్ట్రంలోని పన్నెండు విశ్వవిద్యాలయాలలో ప్రస్తుతం సుమారు 1350 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు, 900 మంది పార్ట్ టైం అధ్యాపకులు తమ జీవితాలను విద్యారంగానికి అంకితం చేస్తూ నిశ్శబ్దంగా సేవలందిస్తున్నారు. వీరి శ్రమపైనే ఉన్నత విద్యా వ్యవస్థ ఒక స్థిరత్వాన్ని కొనసాగిస్తోంది. అటువంటి పరిస్థితిలో వీరికి న్యాయం చేయాల్సిన నైతిక బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పట్ల సున్నితంగా స్పందించే నాయకుడిగా ఇప్పటికే విస్తృత విశ్వాసాన్ని సంపాదించారు. సామాన్యుల కష్టాలను స్వయంగా తెలుసుకుని నిర్ణయాలు తీసుకునే ఆయన పని తీరు అధ్యాపక సమాజంలో కూడా గాఢమైన ఆశను రేకెత్తిస్తోంది.

గత రెండు సంవత్సరాలుగా అధ్యాపక సంఘాలు ఉద్యమాలు, లాబీయింగ్, చర్చల ద్వారా యు జి సి పే స్కేల్స్ అమలుకు శాంతియుతంగా పోరాడాయి. ఈ పోరాటాలకు ప్రభుత్వం స్థాయిలో సానుకూల స్పందన రావడం ఒక ముఖ్యమైన మలుపు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్ట్ అధ్యాపకుల కష్టాన్ని అర్థం చేసుకుని యు జి సి వేతనాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేసిన విషయం అందరికీ తెలిసిన సత్యమే. నోటిఫికేషన్ ముప్పు వాయిదా పడటం, కాంట్రాక్ట్ పోస్టులను ప్రక్కకు పెట్టటం, సమ్మె కాలానికి కూడా వేతనాలు చెల్లించటం వంటి నిర్ణయాలు ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనంగా నిలిచాయి. ఇవన్నీ ఉద్యమాల ప్రభావాన్ని మాత్రమే కాదు ముఖ్యమంత్రి సంకల్పాన్ని కూడా స్పష్టంగా చాటిచెప్పాయి.

అయితే సమస్య ఇక్కడితో ముగియలేదు. కొంతమంది ఉపకులపతులు, కొంతమంది బ్యూరోక్రాట్లు స్వార్థపూరిత దృష్టితో వ్యవహరిస్తూ ముఖ్యమంత్రికి పూర్తిస్థాయి వాస్తవాలు చేరకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే భావన అధ్యాపకుల్లో బలంగా ఉంది. ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయాల్సిన యంత్రాంగమే అడ్డంకులుగా మారినప్పుడు ప్రజాస్వామ్య పాలనలో తీవ్రమైన విరోధాభాసం స్పష్టంగా కనిపిస్తుంది. విధాన నిర్ణయాలు ఒక వైపు నిలిచిపోతే అమలు మరో వైపు నిలిచిపోవడం వల్ల ప్రత్యక్షంగా నష్టపోయేది విద్యారంగంలో నిబద్ధతతో పనిచేస్తున్న అధ్యాపకులే. వీరి జీవనాధారాన్ని దెబ్బతీసేలా వ్యవస్థలోని కొన్ని శక్తులు పనిచేస్తున్నాయనే ఆరోపణలు నిరాధారమైనవిగా భావించలేం.

ఈ పరిస్థితుల్లో ఐక్యత అత్యంత కీలకమైన అంశంగా మారింది. గత నలభై రోజులుగా కాంట్రాక్ట్ అధ్యాపకులలో ఉన్న రెండు గ్రూపులను ఒక్కటిగా కలపాలనే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఐక్య కార్యాచరణ లేకపోతే ప్రభుత్వంపై ప్రభావం తగ్గుతుందనే అవగాహన ఈ ప్రయత్నాలకు బలం ఇచ్చింది. వ్యక్తిగత భేదాలు, నాయకత్వ గర్వాలు, చిన్నచిన్న అపోహలు పెద్ద లక్ష్యాన్ని దెబ్బతీయకూడదనే ఆలోచన ఇప్పుడు మరింత బలపడాలి. విద్యా హక్కుల పోరాటంలో విభజన శక్తి కాదు బలహీనత అనే సత్యం ఈ దశలో మరింత స్పష్టంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. బేసిక్, డిఏ, మూడు శాతం ఇంక్రిమెంట్ తో కూడిన యుజిసి పే స్కేల్స్ లక్ష్యంగా సమిష్టి పోరాటమే ముందుకు సాగే సరైన మార్గం.

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పాత్ర అత్యంత కీలకంగా మారుతుంది. ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ మధ్యస్థ వ్యవస్థల వల్ల న్యాయం ఆలస్యం కావడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. ముప్పై సంవత్సరాలుగా నిరవధికంగా సేవలందిస్తున్న అధ్యాపకుల బాధను ప్రత్యక్షంగా పరిశీలించే అధికారం, సామర్థ్యం ముఖ్యమంత్రికే ఉంది. ఎవరి మాటల ప్రభావంలో పడకుండా వాస్తవాలను స్వయంగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే విశ్వాసం అధ్యాపక సమాజంలో ఉంది. ఉన్నత విద్యా రంగం బలపడాలంటే బోధకులకు ఆర్థిక భద్రత తప్పనిసరి. అది కేవలం వేతన పెంపు మాత్రమే కాదు, గౌరవం, గుర్తింపు, వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరించే గొప్ప అడుగు.

తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో మరింత ముందుకు సాగాలంటే కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకుల సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఇది రాజకీయ లాభనష్టాల ప్రశ్న కాదు. ఇది ప్రభుత్వానికి ఉన్న నైతిక బాధ్యత. విద్యార్థుల భవిష్యత్తు, విశ్వవిద్యాలయాల నాణ్యత, రాష్ట్ర అభివృద్ధి అన్నీ ఈ నిర్ణయంపైనే ఆధారపడి ఉన్నాయి. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన విశాల హృదయంతో, మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి సమగ్ర విచారణ చేసి యు జి సి పే స్కేల్స్ అమలు చేయించే దిశగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తారని అధ్యాపక సమాజం గట్టిగా నమ్ముతోంది. ఆ నిర్ణయం అమలయ్యే రోజున తెలంగాణ ఉన్నత విద్యా చరిత్రలో అది ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# స్వశక్తితో బహుజన ఉద్యమాన్ని నిర్మిద్దాం



స్వాతంత్ర భారతదేశంలో పరిపాలన సౌలభ్యం కోసం అధికార వికేంద్రీకరణలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో ప్రతి సామాన్యుడికి ప్రభుత్వ ఫలాలు అందడం కోసం 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా 1976బి78 దశకంలో మూడంచల పాలన వ్యవస్థ తీసుకురావడం జరిగింది. అందులో భాగంగానే జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, మండల స్థాయిలో మండల పరిషత్, గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీరాజ్ వ్యవస్థని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అయితే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల మాదిరిగానే గ్రామాల్లో కూడా బలమైన పరిపాలన వ్యవస్థ ఉండటం కోసం ఐదు సంవత్సరాలకు ఒకసారి గ్రామ పంచాయతీరాజ్ వ్యవస్థకు ఎన్నికలు జరుగుతాయి. అందులో భాగంగానే నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చాక రెండవసారి పంచాయతీరాజ్ వ్యవస్థకి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు దశలు అయిపోయి మూడో దశ ఎన్నికలు 17.12.2025 న జరగనున్నాయి. నాడు భారతదేశ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో ప్రజలకి ప్రభుత్వాల ద్వారా మేలు జరగడానికి గ్రామ స్వరాజ్యమే మేలు అని, పల్లెలే పట్టుకొమ్మలని గాంధీ నినాదిస్తే, అసలు గ్రామీణ వ్యవస్థలోనే బలమైన సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక దోపిడీ జరుగుతున్నదని అంబేద్కర్ నినాదించాడు. ఎందుకంటే గ్రామాల్లో ఉన్న అగ్రకుల రెడ్డి,రావు,కమ్మ భూస్వామ్య దొరల, పెట్టుబడిదారులైన బ్రాహ్మణ, వైశ్య వ్యాపారస్తులు రాజ్యాంగం రావడానికి ముందు రెండు వేల సంవత్సరాలుగా గ్రామీణ వ్యవస్థని పునాదిగా చేసుకొని అగ్రకులాలు అణగారిన వర్గాలని అన్ని రకాలుగా అణచివేస్తూ, మానవ విలువలని పాతరేశారని అంబేద్కర్ భావన. నేటికి కూడా స్వాతంత్రం, గణతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న అగ్రకులాల దోపిడి రూపాన్ని మార్చుకున్నదే తప్ప, గుణాన్ని మార్చుకోలేదని నిరూపణ కబడుతున్నది. అది ఎలా అంటే భారతదేశానికి ప్రత్యేక రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకునే క్రమంలో భాగంగా బడుగు బలహీన వర్గాలకు విద్య లేకపోవడం, భూమి లేకపోవడం, శిస్తుకట్టే శక్తి లేకపోవడం అనే అంశాలని అడ్డుపెట్టి అగ్రకులాలకు మాత్రమే అనగా విద్యావంతులైన, భూమి ఉన్న, ప్రభుత్వానికి పన్ను కట్టే అగ్ర కులాలే ఓటు హక్కు పొందేలా నాటి అగ్రకుల నాయకులు కోరుకుంటే, ఒక్క అంబేద్కర్ మాత్రమే ప్రతి మనిషికి కులం మతం ప్రాంతం లింగం వర్ణం తారతమ్యాలు చూడకుండా ప్రతి తలకి ఓటు హక్కు ఉండాలని, ఒక వ్యక్తికి ఒక ఓటు ఒకే విలువ ఉండాలంటూ, అగ్రవర్ణాలైనా ధనికులైన పాలకవర్గాలని తన జ్ఞానంతో ఓడించి మెప్పించడం మూలంగా అగ్రవర్ణాలతో పాటు సమానంగా అణగారిన వర్గాలకి కూడా ఓటు హక్కు వచ్చింది. తద్వారా తరతరాలుగా అగ్రవర్ణాల చేత పీడితులైన ఎస్సీ ఎస్టీలు తమ ఓట్లు తమ వేసుకొని గ్రామస్థాయి నుండి పార్లమెంటు వరకు పరిపాలకులుగా ఉంటారని అంబేద్కర్ భావించాడు. కానీ ఆనాడు అంబేద్కర్ పార్లమెంటు నుండి బయటకు వస్తున్న క్రమంలో అగ్రవర్ణ నాయకుడైన సోషలిస్ట్ పార్టీ నేత ఐన ఆచార్య కృపాలని అంబేద్కర్ ఇలా అంటాడు,నీవు ఎంతో కృషి చేసి అణగారిన వర్గాలకి ఓటు హక్కును సాధించి పెట్టావు కానీ దానిని మేము మందు, మాంసం, డబ్బులతో కొనిపడేసి నీ పిడిత సమాజాన్ని ప్రలోభలకి గురిచేసి మళ్లీ మేము పాలకులమవుతామని చెప్పారు. కానీ అప్పుడు అంబేద్కర్ ఇలా జవాబు ఇస్తారు, మీరు కుల బలంతో,ఆర్థిక బలంతో పిడిత సమాజాన్ని కొన్ని సంవత్సరాలు పాటు మందు, మాంసం, డబ్బులతో మభ్య పెట్టి ఓట్లు కొని అగ్ర కులాలు పాలకులు అవుతారేమో, కానీ ఏదో ఒక రోజు అగ్ర కులాల చేత పీడితులైన బీసీ ఎస్సీ ఎస్టీలు ఓటు విలువని తెలుసుకుంటారు, అప్పుడు అగ్రకుల నాయకులు ఓట్లు అడుక్కునే బిక్షగాళ్ళుగా మారతరని చెప్పాడు. ఏలాంటి మందు మాంసం డబ్బు ప్రలోభలకి గురి కాకుండా, అగ్రకుల నాయకులకు దీటుగా తమ ఓట్లు తాము వేసుకొని గ్రామస్థాయి నుండి పార్లమెంట్ వరకు అణగారిన వర్గాలు పాలకులుగా ఎదుగుతారని అంబేద్కర్ బలంగా విశ్వసించారు.

అందుచేతనే అగ్రవర్ణాలతో పాటు సమానంగా అణగారిన వర్గాలు విద్యను అభ్యసించి తరతరాలుగా సబ్బండ కులాలని సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా దోపిడీ చేసిన వారు ఎవరో తాము నేర్చుకున్న విద్య ద్వారా శత్రువులు ఎవరో మిత్రులు ఎవరో పసిగట్టి తమ జాతులని అగ్రవర్ణాల కబంధ హస్తాల నుండి అగ్రవర్ణాలు అణగారిన వర్గాలకు వేసిన మానసిక బానిస సంకెళ్ల నుండి విముక్తులను చేసి పీడిత కులాల మేలు కోసం పాటుపడాలని అణగారిన వర్గాల విద్యావంతులకి వారసత్వ లక్ష్యాన్ని అంబేద్కర్ ముందు ఉంచారు. కానీ నేడు అదే అంబేద్కర్ కృషి, త్యాగం మూలంగా విద్యావంతులైన అణగారిన వర్గాలు వ్యక్తులు నిరక్షరాసులైన బీసీ ఎస్సీ ఎస్టీల కంటే అక్షరాసులైన విద్యావంతులే ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి తమ సామాజిక వర్గ ఓట్లను తాకట్టుపెట్టేలా దళారీలుగా, చెంచాలుగా వ్యవహరిస్తున్నారు. మరోపక్క నిరక్షరాస్యులైన సబ్బండ కులాల తల్లిదండ్రులకి అగ్రవర్ణాలు వేసిన మానసిక బానిస సంకెళ్ల నుండి విముక్తులను చేయకుండా, తమ పూర్వికులు ఆయా అగ్రకుల పార్టీలకి తరతరాలుగా ఓట్లు వేస్తున్న అలాంటి నీచపు వారసత్వ రాజకీయ బానిసత్వాన్ని ఉన్నత విద్యను అభ్యసించిన బీసీ,ఎస్సి,ఎస్టీ విద్యావంతులు కూడా అగ్ర కులాలు ఇచ్చే మందు,మాంసం,డబ్బు ప్రలోభాలకు గురి అవుతున్నారు. అంటే ఇక తాము చదువుకున్న విద్యకి అర్థం ఏముంది..? అగ్రకుల నాయకుల మందు మాంసం డబ్బులకు ప్రలోభాలకు గురై ఓట్లు అమ్ముకోవడం అంటే తమ వ్యక్తిత్వాన్ని అమ్ముకోవడమే కదా, అంటే తమకు తాముగా గుణం లేదని క్రమశిక్షణ, చైతన్యం లేదని రుజువు చేసుకున్నట్లే కదా.! ఒక అగ్రకుల నాయకుడి ప్రలోభాలకు గురి అయ్యి ఓట్లు అమ్ముకోవడం అంటే అణగారిన వర్గాల మెదళ్ళని ఆక్రమించుకుంటున్నారంటే శరీరం మాత్రమే తమది, అణగారిన వర్గాల మెదళ్ళు అగ్రకుల నాయకుల ఆధీనంలో ఉన్నాయని నిరూపణ అవుతున్నది కదా.! ఒక్కసారి సబ్బండ కులాల విద్యావంతులు, ఉద్యోగస్తులు స్వశక్తిగా స్వధర్మంతో తమ స్వరాజ్యం కోసం ఆలోచించాలి.!

అగ్రకుల నాయకులు తమ రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించడం కోసం అణగారిన వర్గాలకి చేసిన చిన్న చిన్న మేలుని గుర్తు పెట్టుకొని నేటికి అదే అగ్రకుల నాయకులకి సబ్బండ కులాల తల్లిదండ్రులు, విద్యావంతులైన వారి బిడ్డలు కృతజ్ఞులై ఉంటూ ఇంకా అగ్రకుల నాయకుల్ని గ్రామస్థాయి సర్పంచ్ పీఠం నుండి పార్లమెంట్ వరకు ప్రోత్సహిస్తున్నారంటే మరి అదే అంబేద్కర్ కృషి,త్యాగం లేకుంటే అసలు అగ్రవర్ణాలతో పాటు సమానంగా అణగారిన వర్గాలకి ఓటు హక్కు వచ్చి ఉండేది కాదు కదా..! మరి ఓటు హక్కు లేకుంటే బీసీ,ఎస్సి, ఎస్టీల గడప దగ్గరికి ఏ అగ్రకుల నాయకుడు వచ్చి ఓటు కోసం బేరసాలలు చేయరు కదా..! ఈ యొక్క చారిత్రక సత్యాన్ని విద్యావంతులైన బీసీ ఎస్సీ ఎస్టీ యువకులు విచక్షణ జ్ఞానంతో ఆలోచించాలి..? చిన్న చిన్న సహాయం చేసిన అగ్రకుల నాయకులకి తమ జీవితాంతం ఓట్లు అదే పాలకవర్గాలకి వేస్తూ పాళితులగా ఉంటే, మరి మనిషిగా గుర్తింపు లేని బీసీ,ఎస్సీ,ఎస్టీలకు మనిషిగా గుర్తింపుని, సామాజిక గౌరవాన్ని, సర్వహక్కులిచ్చిన అంబేద్కర్ ఉద్యమానికి రుణపడి ఉండి అంబేద్కర్ ఉద్యమం ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాన సైనికులుగా బీసీ ఎస్సీ ఎస్టీ విద్యావంతులైన యువకులు ముందు ఉండాలి కదా, అలా కాకుండా అణగారిన వర్గాలకు హక్కులు సాధించే క్రమంలో అడుగు అడుగున అడ్డుపడిన అగ్రకుల నాయకులకి, అగ్రకుల పార్టీలకి చెంచాలుగా, దళారీలుగా, బ్రోకర్లుగా ఉండడమంటే తండ్రిని చంపిన వారి వెనకే మద్దతుగా ఉండడం అంటే వారసత్వ శత్రువుని కనిపెట్టడంలో బీసీ ఎస్సీ ఎస్టీ విద్యావంతులైన యువకులు విఫలమవుతున్నట్టే కదా..! కాబట్టి ఇక్కడ బీసీ ఎస్సీ ఎస్టీలకి సైద్ధాంతిక భావజాల తండ్రి సమానులు అంబేద్కర్ ఐతే, సైద్ధాంతిక వారసత్వ రాజకీయ శత్రువులు అణగారిన వర్గాలకి అగ్రకులాలైన భూస్వామ్య రెడ్డి,వెలమ,కమ్మ మరియు వ్యాపారులైన బ్రాహ్మణ,వైశ్య సామాజిక వర్గమే కదా.! అగ్రకులాలు నాయకులు గ్రామస్థాయి సర్పంచ్ ఎన్నికలు మొదలుకొని పార్లమెంటు స్థాయి వరకు లక్షల, కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ రాజకీయ ఆధిపత్యాన్ని బీసీ ఎస్సి ఎస్టీ వర్గాలపై చూయిస్తున్నారంటే అసలు ఈ అగ్రకుల నాయకుల లక్ష్యం నిజమైన ప్రజాసేవ అయినప్పుడు ఒక్క ఎన్నికల సమయంలో మాత్రమే బలమైన ఓటు బ్యాంకు కలిగిన బహుజన కులాల విద్యావంతులని సామాన్యులని మందు,మాంసం, డబ్బులతో మభ్యపెట్టి ఓట్లు కొనే బదులు రాజకీయంగా ఓడిన, గెలిచిన మిగతా సమయంలో కూడా ఎందుకు తమ ఆస్తులని మొత్తం అమ్మి ప్రజాసేవ కోసం ఖర్చు చేయారు..? అగ్రకుల నాయకులు ఇచ్చే మందు,మాంసం,డబ్బులు తీసుకొని ఓట్లు వేయకుంటే పాపంగా అణగారిన వర్గాలు భావిస్తే అసలు రాజ్యాంగానికి ముందు రెండు వేల సంవత్సరాలు,రాజ్యాంగం అమలు అనంతరం కూడా అదే అగ్రకుల నాయకులు 90% బీసీ ఎస్సి ఎస్టీ లపై సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని చేలాయించడం పాపం కదా..? తెలంగాణలోని వేల గ్రామాల్లో అగ్రకుల నాయకులే తమ రాజకీయ ఉనికి కోసం పవర్ లో ఉండే పార్టీలు మారుతూ మరొక పీడిత కులాల వ్యక్తులకి ఆయా గ్రామాల్లో నాయకత్వం ఇవ్వకుండా, తమ కబంద హస్తాల్లో గ్రామీణ వ్యవస్థను పెట్టుకోవడం అంటే భారత రాజ్యాంగ విరుద్ధం కదా, ప్రజాస్వామ్యాన్ని కూని చేయడం కదా, మానవతా నైతిక విలువలకి వ్యతిరేకం కదా..!

75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో పార్టీలకతీతంగా అగ్రకుల నాయకులే పాలకులు అయ్యారు. కానీ ఏ గ్రామాల్లో కూడా ప్రజలకి అవసరమైన ప్రధాన మౌలిక సదుపాయాలైన నాణ్యమైన విద్యను, వైద్యాన్ని, ఉపాధిని, ఇల్లు, భూమిని కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారు. మరి ఈ అగ్రకుల నాయకులు చేసిన ఈ పాపలకి అణగారిన వర్గాలు రాజకీయంగా శిక్ష వేసి, ధర్మ బద్ద రాజకీయాలు విద్యావంతమైన బీసీ ఎస్సీ ఎస్టీ యువకులు ఎందుకు చేయకూడదు.! ఈ యొక్క సత్యాన్ని పాలితులైన బీసీ ఎస్సీ ఎస్టీలు గ్రహించాలి. నేడు తెలంగాణ గ్రామాల్లో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా అగ్రకుల నాయకులు మద్యాన్ని ఏరులై పారిస్తూ,టన్నుల కొద్ది మాంసం పంచుతూ, లక్షలుబికోట్ల రూపాయలు పంపిణీ చేస్తుంటే వాటిని అరికట్టడంలో రాష్ట్ర ఎన్నికల సంస్థ, రాష్ట్ర పోలీసు విభాగం ఘోరంగా విఫలమవుతున్నట్టుగా నిరూపణ అవుతుంది. అంటే అగ్రకుల పాలకవర్గాలు తమ స్వార్ధ రాజకీయాల కోసం రాజ్యాంగ వ్యవస్థలని సైతం నిర్వీర్యం చేయడం గమనార్హం. ఒకపక్క తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ లకు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు చట్టం చేసి ఇస్తామని ఘోరంగా విఫలం అవ్వగా, మరోపక్క పార్టీ పరంగా 42% రిజర్వేషన్లను అమలు చేస్తామని అందులో విఫలమై 56% పైగా ఉన్న బీసీ లను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేయగా, ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బిజెపి కూడా బీసీల పక్షాన 42% రిజర్వేషన్స్ సాధించడం కోసం నిబద్ధతతో ఎలాంటి పోరాటం చేయడం లేదంటే అగ్రకుల పార్టీల నైజం బీసీలను రాజకీయంగా మోసం చేస్తున్నాయని సుస్పష్టంగా నిరూపణ అవుతుంది కదా. మరి అలాంటప్పుడు బీసీ లకు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ రాజకీయ శత్రుత్వ పార్టీలే కదా.! కాబట్టి ఇకనైనా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బలమైన బీసీ నాయకులు హైదరాబాద్ కేంద్రంగా ఉద్యమాలు చేస్తూ, ప్రెస్ మీట్ లకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో అగ్రకుల నాయకులకు దీటుగా బీసీ నాయకులు కూడా తయారయ్యేలా చిన్న, పెద్ద బీసీ సంఘం నాయకులు యుద్ధ ప్రాతిపదికన పనిచేసి బలమైన నిర్మాణం గ్రామ స్థాయిలో చేయాల్సిన చారిత్రక అవసరత ఉన్నది. అప్పుడు మాత్రమే గ్రామ స్థాయి నుండి పార్లమెంట్ వరకి జనాభా దామాషా ప్రకారం బీసీలు తమ రాజకీయ వాటాన్ని పొందగలరు. అంతే కాకుండా నేడు తెలంగాణలో బీసీలు అన్ని అగ్రకుల పార్టీలని ప్రశ్నిస్తూ తమ రాజకీయ వాటాన్ని అడుగుతున్నారంటే గతంలో ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు డా. విశారదన్ మహారాజ్ చేసిన 5000 కిలోమీటర్ల మహా పాదయాత్ర, 10,000 కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర, నేడు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ పేరుతో చేస్తున్న ఒక లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర ప్రతిఫలమే నేడు అనేక బీసీ కులాలు రాజ్యాన్ని ధిక్కరిస్తూ తమ కులాల రాజకీయ వాటాన్ని అడుగుతున్నాయి. కాబట్టి బీసీలకి 42% స్థానిక సంస్థల రిజర్వేషన్లని సాధించడంలో ఉద్దేశపూర్వకంగా విఫలమైన కాంగ్రెస్,బిజెపి,బిఆర్ఎస్ పార్టీలని భూస్థాపితం చేస్తూ స్వీయ రాజకీయ వేదికగా స్వశక్తిగా స్వధర్మంతో స్వరాజ్యం కోసం బీసీ నాయకులు సహ బాధితులైన ఎస్సీ,ఎస్టీ నాయకులని కలుపుకుంటూ పని చేయాల్సిన చారిత్రక అవసరత నెలకొన్నది. అందులో భాగంగానే అగ్రకుల పార్టీ నాయకులకు అభిముఖంగా డా. విశారదన్ మహారాజ్ సారథ్యంలోని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ బలపరిచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులని అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించుకొని, సబ్బండ కులాలు తమ స్వశక్తిని స్వధర్మాన్ని చూయిస్తూ నిరూపించుకోవాల్సిన చారిత్రక అవసరత ఉన్నది. అంతిమంగా రాజకీయాలు అంటే అగ్రకులాలకి మాత్రమే సొంతం కాదు, ప్రతి సామాన్యుడు సింహాసనం మీద కూర్చునెలా ప్రభుత్వ పాలన వ్యవస్థ ఉండాలని భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అగ్రకులకు నాయకులకు దీటుగా అణగారిన వర్గాల నాయకులు కూడా ఎదగాలని స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలతో భారత రాజ్యాంగం ద్వారా అణగారిన వర్గాలకి బలమైన ఆయుధాలు ఇచ్చి అసమానత విలువలు కలిగిన భారతీయ కుల వ్యవస్థని ఢీ కొట్టడానికి ఓటు అనే వజ్ర ఆయుదాన్ని అణగారిన వర్గాల చేతుల్లో పెట్టాడు. ఆ ఓటుతో పోరాడి రాజులవుతారో అమ్ముకొని బానిసలవుతారో మీరే తేల్చుకోవాలని బీసీ ఎస్సీ ఎస్టీ లపై బలమైన లక్ష్యాన్ని అంబేద్కర్ పెట్టాడు. కాబట్టి అంబేద్కర్ కృషి,త్యాగం ద్వారా నేటి భౌతిక ప్రపంచంలో మనుగడ కొనసాగిస్తున్న అణగారిన వర్గాల ముందున్న ప్రధాన కర్తవ్యం. అగ్రకుల నాయకులకు దీటుగా స్వశక్తిగా స్వధర్మంతో స్వీయ రాజకీయ వేదికగా భారత రాజ్యాంగ బద్ధ, ప్రజాస్వామ్య రాజకీయాలు చేస్తూ శాంతియుతంగా సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన తీసుకొచ్చేలా కృషి చేయడమే నేడు అణగారిన వర్గాలపై, అగ్రకుల ప్రజాస్వామ్య వాదులపై ముందున్న ధర్మ బద్ధ బాధ్యత కాబట్టి ఇట్టి చారిత్రక సత్యాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలి.




పుల్లెంల గణేష్
(ధర్మ సమాజ్ పార్టీ బి స్టడీ, రీసెర్చ్ టీం రాష్ట్ర ఇంచార్జ్)
9553041549




## మానిషి

భజ గోవిదం
గుడిసొమ్ము గోవిందా
పుణ్య మానిసి
బారెడు గడ్డం
తలుపులతమకం
పుణ్య మానిషి
వడ్డి వ్యాపారం
హుండిలో నోట్లమూట
పుణ్య మానిసి
హత్యల దొర
అమ్మకు బలిదానం
పుణ్య మానిషి
ఓట్ల దోపిడి
సీటుపై మంత్రిస్థానం
పుణ్య మానిషి
మూఢ నమ్మకం
కర్మసిద్ధాంతవల
పాపం మానిషి

రేడియమ్
9291527757



## బద్మాషి భడవలే..

ఎన్నడో ఇయ్యాలిసినోళ్ళవి
ఇయ్యకుండా సంపుకుంట..
అంతోటి.. ఇంతోటి..ఎంతోటో..
జాలి..కరుణ.. కాకరకాయా...
లొట్టపీసు పొగడ్తల నడుమ
కార్చే.. కారే.. వొరదెత్తిన
కిలాడి సొల్లంతా...
దగుల్బాజీ తనమే...
పానాలు బోతున్న
వృద్ధులూ.. పెన్షనర్లూ..
దాచుకున్న దుడ్లు
అక్కరొచ్చే ఆపూటకందక...
సుడుగాడ్ల పాలయ్యి
పడుతున్న పడవాట్లు
పట్టించుకోని తీసుమారుఖాన్లు
ఎవడైనా బద్మాషి భడవలే...

డా. ఇక్బాల్ పాషా
9440775732

## గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- జైన్ హెరిటేజ్ స్కూల్ సీఈఓ చంద్రశేఖర్




**శామీర్‌పేట్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సెంట్రల్ సిలబస్ విద్యతో పాటు పోటీ పరీక్షలకు విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా జైన్ విద్య సంస్థ , ఆలేన్ హైదరాబాద్ గ్రూప్ తో ఒప్పందం చేసుకుందని జైన్ హెరిటేజ్ విద్యాసంస్థల సీఈవో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం శామీర్ పేట మండలం మజీద్ పూర్ లో గల జైన్ హెరిటేజ్ పాఠశాలలో నిర్వహించిన ఒప్పంద కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అలెన్ గ్రూప్ హైదరాబాద్ హెడ్ సౌరబ్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వచ్చే 2026 విద్యా సంవత్సరానికి గాను వందమంది విద్యార్థులతో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు హాస్టల్ వసతితోపాటు నాణ్యమైన బోధన సిబ్బందితో విద్యను అందిస్తామని అయన తెలిపారు.విద్యార్థులపై ఒత్తిడి లేకుండా దీర్ఘకాలిక విజయం లక్ష్యంగా ఈ విధానం రూపొందించ బడిందన్నారు.ఈ భాగస్వామ్యం ద్వారా ప్రతి విద్యార్థికి బలమైన పునాది, సరైన మార్గదర్శనం, ఆత్మ విశ్వాస భరితమైన భవిష్యత్తు అందించా లనే తన సంకల్పా న్ని మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమమ్ నాయర్, ఉపాధ్యాయులు, పిఈటిలు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా అవసరాలకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని వినతి



**నిజాంపేట్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ పరిధిలోని సర్వేనెంబర్ 191 లో ప్రభుత్వ స్థలాలను ఇటీవల హైడ్రా చేపట్టిన చర్యల లోని స్థలంలో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా అందులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సోమవారం ఆకుల సతీష్ నేతృత్వంలో ఆంజనేయులుతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి నందు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా సర్వేనెంబర్ 329 గాజులరామారం ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 454 బాచుపల్లి .. 80,82,83,91,95 బాచుపల్లి ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

## మణికొండను నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలి



**రాజేంద్రనగర్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ ప్రాంతాన్ని ఇటీవల జిహెచ్ఎంసి పరిధిలోకి విలీనం చేసి రెండు డివిజన్లుగా ఏర్పాటు చేసిన నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ మేరకు మణికొండను నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలి: కాంగ్రెస్ డిమాండ్ మణికొండ మున్సిపాలిటీ ప్రాంతాన్ని ఇటీవల జిహెచ్ఎంసి పరిధిలోకి విలీనం చేసి రెండు డివిజన్లుగా ఏర్పాటు చేసిన నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీరు జితేందర్ ఆధ్వర్యంలో మణికొండ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో అధికారులకు అభ్యంతర పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ, అతి తక్కువ ఓటర్లు, జనాభా కలిగిన నార్సింగి మున్సిపాలిటీకి మూడు డివిజన్లు ఏర్పాటు చేసి, 90 వేలకుపైగా ఓటర్లు, మూడు లక్షలకు పైగా జనాభా ఉన్న మణికొండను కేవలం రెండు డివిజన్లకే పరిమితం చేయడం అన్యాయమని అన్నారు. మణికొండను కనీసం నాలుగు డివిజన్లుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, బి.రాజు, ముత్యాలు, పురుషోత్తం, తాజుద్దీన్, ఏ.రాజు, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో సర్పంచులు ముందుండాలి



**తాండూరు, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** గ్రామ అభివృద్ధిలో సర్పంచులు కీలకంగా వివరించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాండూర్ నియోజకవర్గంలోని యాలాల మండలం తిమ్మాయిపల్లి సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి ఉప సర్పంచ్ కె నర్సింలు వార్డు సభ్యులు కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్బిఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల మాదిరిగానే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలి అన్నారు.

# గ్రామ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపు
- ఉద్యోగాన్ని సైతం వదులుకున్న వ్యక్తి రవీందర్
- అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపు

**యాచారం, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తెలగమల్ల రవీందర్ బ్యాట్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సేవకై ఉద్యోగానికి రాజీనామా చేసిన వ్యక్తి రవీందర్,కావున బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని అన్నారు.బడుగు బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేసిందని అన్నారు.నందివనపర్తి గ్రామంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపిస్తే గ్రామంలో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి రవీందర్ మాట్లాడుతూ..అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను గ్రామంలో అమలు చేస్తానని, పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. గ్రామం అభివృద్ధి లో మరింత ముందుకు సాగాలంటే తనకు సర్పంచ్ గా ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామ మహిళలకు ఉచిత టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ నిరుద్యోగ యువతీ, యువకులకు అవకాశాలు కల్పించామని తెలిపారు. అవకాశం ఇవ్వండి అభివృద్ధికి తోడ్పడండి, ఆలోచించండి ప్రజాసేవ చేసే తెలగమల్ల రవీందర్ కు ఓటర్లు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ



ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బిలకంటి శేఖర్ రెడ్డి, మూడేళ్ల వెంకటరెడ్డి, నేర్ర భాష,గ్రామ శాఖ అధ్యక్షుడు నేర్ర శ్రీశైలం, షాహిద్,,శేఖర్, కాంగ్రెస్ నాయకులు,మహిళలు,కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారంపై వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి స్వీకరించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 107 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు సమగ్రంగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి విశేష ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ప్రజలు అందజేసే ప్రతి వినతిపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. వినతులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఆన్లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే క్లియర్



చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలు అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమస్యలను పరిష్కరించాలని, అలాగే ముఖ్యమంత్రి కార్యాలయానికి సంబంధించిన ప్రజావాణి పెండింగ్ కేసులను కూడా వేగంగా పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- డీఎస్పీ నల్లపు లింగయ్య

**మక్తల్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా, ప్రజల్లో భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో మూడో విడత ఎన్నికల సందర్భంగా ఉట్కూర్ మండల కేంద్రంలో ఫ్లగ్ మార్చ్‌లి నిర్వహించడం జరిగిందన డీఎస్పీ నల్లపు



లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నిర్భయంగా ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం, ఓటు మన హక్కు అనే నినాదాలతో ఈ ఫ్లగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రామ్ లాల్, ఎస్సై లు రమేష్, భాగ్య లక్ష్మి రెడ్డి, %ాపీ% నవీద్, అశోక్ బాబు, రేవతి, ఆచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

- డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా

**మల్కాజిగిరి, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సర్కిల్ పరిధిలోని డివిజన్ ల పునర్విభజనలో అభ్యంతరాలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రజావాణిలో మొత్తం 8 ఫిర్యాదులు వచ్చాయని. వీటిలో అత్యధికంగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు అందగా, నరసింహారెడ్డి నగర్ లో ఓ వ్యక్తి అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు.వెటర్నరీ, ఎలక్ట్రికల్, ఓల్డ్ సఫిల్ గూడ మోడల్ సుధా నగర్ కాలనీలో చెట్ల కొమ్మలు తొలగించాలని హార్టికల్చర్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.ప్రజావాణి అనంతరం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా సంబంధిత




అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, గడువులోగా పరిష్కార మార్గాలను చూపించాలని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సర్కిల్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శాలు పాటించాలి




**శామీర్‌పేట్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** శామీర్ పేట్ లో సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని నాయకులతో కలిసి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు..ఉక్కు మనిషిగా పిలువ బడే సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత తొలి హోంమంత్రిగా, తొలి ఉప ప్రధానిగా భారతావనికి సేవలు చేశారని అన్నారు.ఆయన ఆదర్శాలను పాటించి భారతావని కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు ఉపాధ్యాయులు, నాయకులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, పసుపుల నర్సింహా, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**హయత్‌నగర్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** హయత్‌నగర్‌లోని పొదర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్లే గ్రౌండ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో కీలకమని వారు అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉత్సాహం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వారు తెలిపారు. చిన్న




వయస్సు నుంచే క్రీడలపై ఆసక్తి పెంచితే భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరచే అవకాశాలు ఉంటాయని వారు సూచించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇస్తూ మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని చెప్పారు. పిల్లలు మొబైల్ ఫోన్లు, డిజిటల్ వ్యసనాలకు దూరంగా ఉండి ఆటపాటల ద్వారా ఆరోగ్యంగా ఎదగాలని వారు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రతిక్ష జోహ్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## నర్కుడ గ్రామ సర్పంచ్‌కు భినందన వెల్లువ

**రాజేంద్రనగర్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** నర్కుడ గ్రామంలో నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన గడ్డం శేఖర్ యాదవ్కు



అభినందనల వెల్లువ కొనసాగుతోంది. గ్రామ ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయనను ఘనంగా సన్మానిస్తున్నారు. సోమవారం సీపీఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రా గిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. యాదగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అన్నెపు ప్రభు ముదిరాజ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలి

- తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

**తాండూరు, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాండూర్ మండల పర్యటనలో భాగంగా గౌతపూర్ సర్పంచ్ గా విజయం సాధించిన జెన్నె సృజన మహేష్ ను శాలువాతో సన్మానించారు. అదేవిధంగా వీరారెడ్డి పల్లి సర్పంచ్ విజయం సాధించిన పురుషోత్తం రెడ్డికీ శుభాకాంక్షలు తెలిపారు.పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో భారీ మెజార్టీతో సర్పంచ్ గా గెలిచిన యాలేటి భార్గవి శ్రీనివాస్, ఉపసర్పంచ్ గా ఎన్నికైన మహమ్మద్ మోహిత్ లు మాజీ ఎంపిటిసి యాలేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్నం మహేందర్ రెడ్డికి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శాలువాలతో మహేందర్ రెడ్డిని సన్మానించగా ఆయన సైతం సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించి గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజలతో మమేక మవ్వాలని అవసరమైన నిధులను తాను అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వం గ్రామాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి ఎన్ని నిధులైన ఇస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, రామచంద్ర రెడ్డి,గడ్డలి రవీందర్,మాజీ సర్పంచ్ కేశవ్,మల్లారెడ్డి, పాల రాములు, ప్రవీణ్, శ్రీనివాస్,శ్రీశైలం, మహేందర్ రెడ్డి, నాగప్ప, నారాయణ రెడ్డి, కొంపల్లి మల్లేష్, వెంకటేష్,బీదర్ రాజశేఖర్, బిర్కెట్ రఘు, భగవాన్, అగ్గనూర్ సంకేత్, వార్డు



సభ్యులు ధనరాజ్, జ్యోతి,శ్రీదేవి, స్వరూప అశోక్ మరియు నాయకులు అనంతయ్య, నవీన్, సత్తార్మియా,లాజర్, ఎల్లప్ప, పుల్యప్ప మరియు తదితరులు పాల్గొన్నారు.

# బీమా రంగంలో ఎఫ్‌డీఐ పెంపు అనవసరం

- ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు

**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** భీమా రంగంలో ఎఫ్‌డిఐలు పెంపు అవసరమని సోమవారము గద్వాల ఎల్ఐసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం 2025 డిసెంబర్ 12న ప్రో-క్యాపిటల్ ఆర్థిక సంస్కరణలకు ఆమోదం తెలిపిందనీ, వీటిలో భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచడం, భీమా చట్టాల బిల్లుకు ఆమోదం ఇవ్వడం కూడా ఉన్నాయనీ,1999లో ఐఆర్‌డీఏ బిల్లును ఆమోదించడం ద్వారా భీమా రంగాన్ని జాతీయాకరణ నుండి విముక్తం చేశారనీ, అప్పటి నుంచి విదేశీ భాగస్వాములతో కూడిన అనేక ప్రైవేట్ భీమా సంస్థలు జీవత భీమా,సాధారణ భీమా రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయనీ, ఈ సంస్థలకు వ్యాపారం నిర్వహించడానికి మూలధనం ఎప్పుడూ సమస్యగా లేదనీ, వాస్తవానికి, భీమా రంగంలో వినియోగిస్తున్న మొత్తం మూలధనంలో ఎఫ్‌డీఐ వాటా కేవలం సుమారు 32 శాతమేనాని, ఇలాంటి పరిస్థితుల్లో, భీమా రంగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 100 శాతానికి పెంచి విదేశీ మూలధనానికి సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వడం అనారోగ్యకరమైన నిర్ణయం. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకే కాకుండా దేశీయ భీమా సంస్థలకు కూడా తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపిస్తుందనీ, ఇప్పటికే ఉన్న భీమా సంస్థలను బలవంతంగా స్వాధీనం చేసుకునే అవకాశాలు



కూడా ఉన్నాయనీ, విదేశీ మూలధనానికి సంపూర్ణ స్వేచ్ఛ, అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల భీమా రంగం క్రమబద్ధంగా అభివృద్ధి చెందకుండా, లాభాలపై మాత్రమే దృష్టి కేంద్రీకృతమవుతుందని,ప్రజలకు, వ్యాపార రంగానికి అవసరమైన భద్రత అందించడంలో వెనుకబడుతుందని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గట్టిగా నమ్ముతోందనీ, ఇది భారత సమాజంలోని అణగారిన వర్గాల ప్రయోజనాలపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తుందనీ, అంతేకాకుండా, విదేశీ మూలధనం దేశీయ పొదుపులకు ప్రత్యామ్నాయంగా ఎప్పటికీ ఉండలేదు. అలాంటి పరిస్థితుల్లో, దేశీయ పొదుపులను విదేశీ మూలధనానికి అప్పగించడం ఆర్థికంగా గానీ, సామాజికంగా గానీ ఏ మాత్రం సమంజసం కాదనీ, సంక్షేమ రాష్ట్రంగా ఉన్న భారత్‌లో, అందరి పౌరులకు లాభం చేకూరే విధంగా ఆర్థిక అభివృద్ధి కోసం పొదుపులపై ప్రభుత్వ నియంత్రణ మరింత అవసరం అని, భీమా రంగంలో ప్రతిపాదించిన ఈ సవరణలు భీమా సంస్థలను భీమ్యాతర సంస్థలతో విలీనం చేయడానికి అనుమతి ఇవ్వడం, పార్లమెంటరీ పర్యవేక్షణను పక్కన పెట్టి ఐఆర్‌డీఏకు విస్తృత అధికారాలు కల్పించడం, మధ్యవర్తులకు ఒకసారి మాత్రమే నమోదు విధానం, విదేశీ రీ-ఇన్సూరర్లకు నెట్ ఓన్డ్ ఫండ్స్ పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు తగ్గించడం వంటి చర్యలు, 1956కు ముందు ఉన్న పరిస్థితులను మళ్లీ తీసుకువచ్చే ప్రమాదం ఉంది. అప్పట్లోనే జీవత భీమా వ్యాపారాన్ని జాతీయాకరించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏర్పడిందనీ,భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచాలనే నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తూ,ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోందనీ, బీమా చట్టాలు బీమా చట్టం, 1938 ఎల్ఐసీ చట్టం, 1956, ఐఆర్‌డిఏ చట్టం,1999 లను సవరించాలనే వెనుకబాటు ఆలోచనకు ప్రభుత్వం పూనుకోవద్దని హెచ్చరిస్తోందనీ, కార్పొరేట్ పక్షపాతంతో కూడిన ఆర్థిక విధానాల నుంచి ప్రజాకేంద్రీకృత విధానాల వైపు ప్రభుత్వం మళ్లాలని ఎఐఐఇఎ డిమాండ్ చేస్తోందనీ, కార్పొరేట్ రంగం లాభాల కంటే ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తుంది అని గద్వాల బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి రంగారావు అన్నారు. ఈ సమావేశంలో రాఘవేంద్ర,ఉదయ్ కుమార్,సూరజ్, లక్ష్మీకాంత్, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## మకర జ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయం భూమి పూజ



**కొమురవెల్లి, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** కొమురవెల్లి మండల కేంద్రంలో శ్రీమల్లికార్జున స్వామి దేవాలయం వద్ద శ్రీమకర జ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో హరిహర సుతుడు అయ్యప్ప స్వామి ఆలయంకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మకర జ్యోతి సేవా సమితి అధ్యక్షులు లింగంపల్లి లింగం మాట్లాడుతూ కొమురవెల్లి మండలంలోని అన్నీ గ్రామాల అయ్యప్పస్వాములు అందరము కలిసి శ్రీఅయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. అలాగే దొమ్మాట రమేష్ గౌడ్ మాట్లాడుతూ మేము ఈ అయ్యప్ప స్వామి ఆలయం నిర్మిద్దాం అని 5 సంవత్సరాలుగా అనుకుంటున్నామని కానీ ఈరోజు అది సాధ్యం అయిందని అలాగే ఈరోజు నుండి జనవరి 15 వరకు నిత్య అన్నదానం కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబడిపల్లి వీరేశం, పోతుగంటి బాలరాజు, కోటి, బూరుగు శ్రీనివాస్, కొండ శ్రీను, నవీన్, వినయ్, చరణ్ గౌడ్ స్వామి, సాయి స్వామి సందీప్ స్వామి రాజు స్వామి, నవీన్ స్వామి, చరణ్ స్వామి తదితర స్వాముల పాల్గొన్నారు.

## కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహణ



**కొమురవెల్లి, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన ఉత్సవాలు మంగళవాద్య సేవ, వేద స్వస్తి, మహాగణపతి పూజ, శ్రీ గౌరీ పూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం వంటి ఆచారాలతో కొనసాగాయి. అనంతరం జగద్గురు పంచాచార్యుల ఆధ్వర్యంలో పంచ కలశ స్థాపన, నాంధీ సమారాధన నిర్వహించారు. అలాగే ఆదిత్యాది నవగ్రహ, దిక్పాలక, సప్తమాతృక, ఏకాదశ రుద్ర, ప్రధాన రుద్ర కలశ స్థాపన ఉపచార పూజలు భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి శ్రీ స్వామివారికి పంచామృత, ఫల, రస పంచామృతాది వివిధ ద్రవ్యాలతో ఏకాదశవార రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆవాహిత మంటప దేవతల ఆరాధనలు నిర్వహించిన అనంతరం, శ్రీ స్వామివారికి పంచామృత, ఫల, రస పంచామృతాది సుగంధ విశేష ద్రవ్యాలతో మరోసారి ఏకాదశవార రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన చేశారు. చివరగా రాజోపచారములు, మహా మంగళహారతి, మహా మంత్రపుష్ప సమర్పణతో రెండవ రోజు బ్రహ్మోత్సవ కార్యక్రమాలు భక్తిమయ వాతావరణంలో ముగిశాయి. ఈ కార్యక్రమంలో వెంకటేశం ప్రధానార్చకులు మాధవి మల్లికార్జున్ శ్రీనివాస్ ధర్మకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## మాదారంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**జిన్నారం, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల్ గడ్డపోతారు మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం గ్రామంలో 10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న యుజిడి పనులకు సోమవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గ్రామ మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్, రాజు గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, డిఈ నరసింహ రాజు, సీనియర్ నాయకులు, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి



**వెల్దండ, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** ముదిరాజులు రాజకీయంగా అన్ని రంగాల్లో ముందుండాలని ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, మండలి వైస్ చైర్మన్ డా.బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. సోమవారం శ్రీశైలం నుంచి హైదరాబాద్ బయలుదేరిన క్రమంలో వెల్దండ మండల కేంద్రంలో కాసేపు ఆయన ఆగి ముదిరాజ్ లతో చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల స్థానిక ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన వెల్దండ ఉపసర్పంచ్ బస్న మోని శ్రీను, వార్డు సభ్యులు మిరియాల మంజుల శ్రీను, పిల్లి దేవేందర్, బాదేపల్లి రమేష్, చెరుకూరు గ్రామ వార్డు సభ్యులు పురుగుల లాలయ్య, పురుగుల రమేష్‌లను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర్ కర్నూల్ ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటయ్య ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, జిల్లా యువజన ముదిరాజ్ అధ్యక్షులు చందు, జిల్లా ఫిషరీస్ డైరెక్టర్ భూనుచందర్, వెల్దండ మండల అధ్యక్షుడు బాధేపల్లి మల్లేష్, యువజన అధ్యక్షుడు బొక్కల శ్రీనివాస్, అన్నేపు వెంకటేష్, మాసుల బాలరాజు,మొక్తల శ్రీనివాస్, కసారపు మల్లేష్, గంటల నరసింహ, మాసుల మల్లేష్, రంగరాతీ శ్రీశైలం, శివ, రమేష్ తదితర నాయకులు ఉన్నారు.

# అభ్యర్థులు డబ్బు ధారపోసి ఆగం కావొద్దు

- నిరంతరం ప్రజల మధ్యలో ఉండే విద్యావంతుని గెలిపించుకోండి
- డాక్టర్ రవీందర్ రెడ్డి డాక్టర్ల బృందం మక్తల్

**మక్తల్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు డబ్బులు ధారపోసి ఆగం కావద్దు అని మక్తల్ డాక్టర్ బృందం రవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మణికంఠ గౌడ్ సోమవారం మక్తల్ మండలంలోని మాద్వర్ గ్రామంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి కి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాను రానూ ఎన్నికల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిపోయిందని ప్రజలు డబ్బు ఆశ సూపి వ్యక్తులకు ఓటు వేయవద్దని అన్నారు. గ్రామాల అభివృద్ధి పనులు చేసి నిరంతరం గ్రామాల్లో ఉండే వ్యక్తికి ఓటు వేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలను కోరారు. గ్రామ అభివృద్ధికి అందుబాటులో ఉండే వ్యక్తిని గ్రామాభివృద్ధికి పాటుపడే వ్యక్తిని సర్పంచ్ గా ఎన్నుకోవాలని సూచించారు. డబ్బులు పెట్టీ గెలిచిన నాయకులకు గ్రామాలలో అభివృద్ధి పనులు ఏల చేయాలనే ఆలోచన



ఉండదనీ అన్నారు. శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి విద్యావంతుడు డాక్టర్ వృత్తి నిర్వహిస్తూ గ్రామంలో ఎంతోమంది ప్రజలకు సేవ చేసిన వ్యక్తి అలాంటి వ్యక్తిని గ్రామాల్లో సర్పంచ్ గా బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత గ్రామ ప్రజలపై ఉందని అన్నారు. మఖ్తల్ బిజెపి నాయకులు రాశేఖర్ రెడ్డి, బాయికాడి నరసింహారెడ్డి, కర్ని స్వామి, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా నేడు ప్రచార నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సంతోష రెడ్డి, మల్లేపల్లి ఆశప్ప, వడ్ల శ్రీనివాస్, ఆర్ఎంపీ డాక్టర్ మల్లేపల్లి ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

## మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల నడిగడ్డ, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ మూడవ విడత ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది కేటాయింపు కొరకు మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఎన్నికల సాధారణ పరిశీలకులు గంగాధర్‌తో కలిసి మూడవ విడత పోలింగ్ సిబ్బందికి సంబంధించి మూడవ ర్యాండమైజేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశామని,ఈనెల 17న ఎన్నికలు జరిగే జిల్లాలోని ఆలంపూర్, ఇటిక్యాల, మానవపాడు, ఉండవెల్లి, ఎర్రవల్లి మండలాల్లో మొత్తం 700 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఏకగ్రీవాల అనంతరం మిగిలిన 638 పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం



జరిగిందన్నారు. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 1,00,372 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధుల నిర్వహణ విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీకాంత్,ఈడియం శివ, ఎన్నికల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బందికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

- జడ్పి సీఈఓకు తపస్ వినతి

**కృష్ణ, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** మూడవ విడతలో పాల్గొనే ఎన్నికల సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కు, సోమవారం తపస్ నాయకులు వినతి పత్రం అందించారు.ఎన్నికలు ముగిసిన తర్వాత సిబ్బంది స్వంత గ్రామాలకు వెళ్లే విధంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన రెమ్యూనరేషన్ అందించాలని కోరారు.అలాగే పసి పిల్లలు ఉన్న తల్లులకు, అనారోగ్యంతో ఉన్న వారికి, అత్యవసర మున్న ఉపాధ్యాయులకు మినహాయింపు కోరారు.



మూడు విడతలు ఎన్నికలు కేటాయించబడ్డ మహిళా ఉపాధ్యాయులను మినాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ మండల గౌరవ అధ్యక్షులు నర్సింలు అధ్యక్ష కార్యదర్శులు రవీందర్, రాకేష్, మోహన్ రావు సత్యనారాయణ రెడ్డి రవీందర్ రెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని మరింత అభివృద్ధి కృషి

- ఆకునూర్ సర్పంచ్ అభ్యర్థి చీపురు రేఖ-మల్లేష్ యాదవ్



**చేర్యాల, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** గ్రామాన్ని అన్ని విధాల మరింత అభివృద్ధి చేస్తానని ఆశీర్వదించి సర్పంచ్‌గా గెలిపించగలరని ఆకునూరు గ్రామ సర్పంచ్ అభ్యర్థి చీపురు రేఖ-మల్లేష్ యాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని ఆకునూరు గ్రామంలో గ్రామస్తులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాల పాలనలో గ్రామంలో రోడ్డు వెడల్పు నిర్మాణం, సిసి రోడ్లు, మురికి కాలువలు వాటర్, ట్యాంకులు నిర్మాణాలు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించారు. గ్రామంలో యువతను చైతన్యం చేస్తూ మద్యానికి చెడు అలవాట్లకు బానిస కాకుండా, మరింత చైతన్యం పరిచారు. మరోసారి అవకాశం ఇస్తే గ్రామంలో పెండింగ్ ఉన్న పనులు పూర్తి చేస్తూ సస్యశ్యామలం చేస్తానని తెలిపారు. బీసీ బిడ్డగా ఆకునూరు సర్పంచ్ అభ్యర్థిగా చీపురు రేఖ మల్లేష్ యాదవ్ ముందుకు వస్తున్నామని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్లు తీసుకురావద్దు

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**కృష్ణ, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నారాయణపేట జిల్లాలోని , కృష్ణ, మండలంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అలాగే ఓటింగ్‌కి వచ్చే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సెల్ ఫోన్లు తీసుకురావద్దని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు అవసరమైన చోట అదనపు బలగాలను కూడా మోహరిస్తున్నట్లు వెల్లడించారు.పోలింగ్‌కు వచ్చే ఓటర్లు ఎట్టి పరిస్థితుల్లో సెల్ ఫోన్లు తీసుకురావద్దని జిల్లా ఎస్పీ స్పష్టంగా సూచించారు. మొదటి విడత, రెండో విడత, మూడో విడత పోలింగ్ ల సమయం లో ఓటర్లు సెల్ ఫోన్లు తీసుకురావడం వల్ల వాటిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించకపోవడంతో, అత్యవసరంగా బయట ఉన్న వ్యక్తులకు సెల్ ఫోన్లు అప్పగించడం జరిగిం దన్నారు. అయితే, ఓటు వేసి వచ్చేవరకు సెల్ ఫోన్ ఇచ్చిన వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో పలు చోట్ల మిస్సింగ్ కేసులు నమోదు కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు.ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు, మూడో విడత పోలింగ్‌కు వచ్చే ఓటర్లు పోలింగ్ కేంద్రాల పరిధిలోకి సెల్ ఫోన్లు, వాటర్ బాటిళ్లు, ఇంకు బాటిళ్లు తదితర నిషేధిత వస్తువులు తీసుకురావద్దని జిల్లా ఎస్పీ మరోసారి సూచించారు. అలాగే, ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు అధికారుల సూచనలను పాటిస్తూ, శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా, ఇన్సిడెంట్ ఫ్రీగా పోలింగ్ పూర్తి చేయడ మే జిల్లా పోలీసుల లక్ష్యమని తెలిపారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్

**జడ్చర్ల, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని జడ్చర్ల సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు జాతీయ మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగుతున్న సందర్భంగా కార్మికులందరూ మద్దతు తెలుపుతూ ప్రతి కార్మికుడు ఇంటిపైన, యూనియన్ ఆఫీస్, పనిచేసే కార్యాలయం ముందు జండా ఆవిష్కరణ చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో సోమవారం జడ్చర్ల మున్సిపల్ కార్మికులు తమ ఇంటి పైన జెండాలు ఎగురవేసి మున్సిపల్ కార్యాలయం, సిఐటియు కార్యాలయం పాటు పలు కార్యాలయాల ముందు జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, మోటార్ వాహనాల చట్టాన్ని సవరించి డ్రైవర్లకు అన్యాయం జరగకుండా చేయాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకటేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు సత్తయ్య, పట్టణ



కమిటీ అధ్యక్షురాలు ఇందిరమ్మ, కృష్ణ, యాదయ్య, మహేష్, కరీం, గణేష్, రాజు, రమేష్, యాదమ్మ, స్వరూప, శివమ్మ, నరేష్, కళమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# 3వ దశ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు బ్యూరో, డిసెంబర్ 15 (జనంసాక్షి):** 3వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పొరపాట్లకు తావు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. వెంకటాపురం, వాజేడు, ఎంపీడీవో కార్యాలయాల్లో కన్నాయిగూడెం రైతు వేదికలో వేరు వేరుగా మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మండల ప్రత్యేక అధికారి, తహసిల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ, జోనల్ ఆఫీసర్స్, ఆర్వోలు, మండల అధికారులు,పంచాయతీ కార్యదర్శులతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావుతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంలలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలను పకడ్బందీగా పారదర్శకంగా, నిబంధనలు పాటిస్తూ ఎన్నికల విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. అధికారుల ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి, పోలింగ్ డే రోజున ఎలాంటి లోపాలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎన్నికల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, అధికారులు విధులకు గైహాజరైతే చర్యలు తీసుకుంటామని,పోలింగ్ సిబ్బంది చెక్ లిస్ట్ ప్రకారం ఓటింగ్ మెటీరియల్ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని అన్నారు. సర్పంచ్,వార్డు మెంబర్ బ్యాలెట్ పేపర్స్ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు.ఎన్నికల నిర్వహణ కౌంటింగ్ పూర్తయిన వెంటనే సిబ్బంది జాగ్రత్తగా సీల్ వేసి సామాగ్రిని డిపాజిట్ చేయాల్సి ఉంటుం దని పేర్కొన్నారు.సమస్యాత్మకమైన ప్రాంతాల లో సిగ్నల్ అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పర్యవేక్షిస్తున్నామని, సిగ్నల్ అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రఫీ ద్వారా మైక్రో అబ్జర్వర్ పరిశీలనలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ఉదయం 10 గంటల వరకు పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ. కేంద్రాల్లో మెటీరియల్ తీసుకున్న సిబ్బంది కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 17వ తేదీన ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు. తదుపరి ఖచ్చితంగా మధ్యాహ్నం 2గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వీల్ చైర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 2 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓట్లు లెక్కింపు ఆలస్యం జరిగితే తెలియచేయాలని, ఆలస్యానికి కారణాలు తెలియచేస్తూ ఎన్నికల సంఘానికి తెలియ చేయాల్సి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన వెంటనే సాధారణ ఎన్నికల పరిశీలకుల అనుమతితో డిక్లర్ చేయాలని తెలిపారు.ప్రజలందరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా గ్రామా భివృద్ధి కోసం తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వాజేడు మండల కేంద్రం లోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లోని పోలింగ్ సామాగ్రిని పరిశీలిం చారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు ఎంపీడీవోలు, ఎంపీఓలు, జోనల్ ఆఫీసర్స్, ఆర్వోలు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో జిల్లా పోలీస్ బాస్ పర్యటన



**కాళేశ్వరం, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని కాళేశ్వరం పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ కాళేశ్వరం క్లస్టర్ పరిధి లోని పలు గ్రామాల పోలింగ్ బూత్ లను సందర్శించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీసు అధికారులకు సూచించారు.కాళేశ్వరం లోని అంతరాష్ట్ర వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పి ఏ సూర్యనారాయణ , మహాదేవ్ పూర్ సిఐ వెంకటేశ్వర్లు , కాళేశ్వరం ఎస్సై లు జి తమాషా రెడ్డి , కె భగవత్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు ఫ్లాగ్ మార్చ్



**మరిపెడ, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** ఈనెల 17న జరగనున్న మూడో విడత పంచాయతీ ఎలక్షన్స్ సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో మరిపెడ సీఐ సిరాజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని ఎల్లంపేట వీరారం గ్రామాలలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఒత్తిడి లేని ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మరిపెడ ఎస్సై ఈ వీరభద్రరావు,కోటేశ్వరరావు, పిట్టల ప్రవీణ్, పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే నాగయ్యపల్లి గ్రామాభివృద్ధి

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తాం
- డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి



**ఆత్మకూర్, డిసెంబర్ 15 (జనం సాక్షి):** రాష్ట్రంలో అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుండాల క్రాంతి ని నాగయ్యపల్లి గ్రామంలో సర్పంచ్ గా గెలిపించుకుంటే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి గ్రామ ప్రజలకు భరోసానిచ్చాడు. సోమవారం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుండాల క్రాంతి గెలుపు కొరకు ఇంటింటి ప్రచారం చేసి గ్రామ ప్రజలతో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో పది సంవత్సరాలలో కేవలం బి ఆర్ ఎస్ నాయకులు మాత్రమే ప్రభుత్వ పథకాలను మింగారని ఏ ఒక్క నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,ఇందిరమ్మ ఇండ్లు,సన్న బియ్యం, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,పావుల వడ్డీ రుణాలు అనేక సంక్షేమ పథకాలను పార్టీలకు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇకమీదట కూడా నాగయ్యపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుండాల క్రాంతిని గెలిపిస్తే పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు,వాడవాడనా సిసి రోడ్లు,గ్రామంలోనే రేషన్ బియ్యం ఇచ్చే విధంగా ఏర్పాటు, మినరల్ వాటర్ ప్లాంట్, బొడ్డు చింతలపల్లి నుండి నాగయ్యపల్లె వరకు డాంబర్ రోడ్డు,బస్సు గ్రామానికి వచ్చే విధంగా ఏర్పాటు తో పాటు అనేక సంక్షేమ పథకాలను నాగయ్యపల్లి గ్రామానికి తీసుకువచ్చి అన్ని విధాలుగా పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

# 'కుడా' లే అవుట్ లేకుండా ప్లాట్ల అమ్మకాలు!

- మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించిన ఎస్ఆర్ఆర్ తోట వాసులు



**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని 32 వ డివిజన్లో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ లేఅవుట్ లేకుండా అనుమతి లేకుండా ప్లాట్లు చేసి అమ్ముతున్నట్లు ఎస్ ఆర్ ఆర్ తోట వాసులు టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి చిలువేరు రవీందర్ తో పాటు ఆడెపు జగన్, పరదేశి రాజేష్ లు సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా కిలా వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. కొత్తగా సిరంగి రాజారాం తోట ప్రాంతంలో సుమారు 70 సంవత్సరాల క్రితం నుండి ఉన్న సీతారామాంజనేయ మిల్లును కొంతమంది బడా వ్యాపారస్తులు అనధికారికంగా ప్లాట్లు చేసి అమ్ముతున్నారు అని కమిషనర్ కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. నగరంలో నలు దిక్కుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేసుకుంటున్నారనీ, కూడా మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు 60 ఫీట్లు గా ఉన్నదనీ దీనిపై జిల్లా కలెక్టర్ , గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ , కిల వరంగల్ సబ్ రిజిస్టర్ చర్యలు తీసుకొని అనధికారికంగా ప్లాట్లు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. లేఅవుట్ లేకుండా ప్లాట్ చేసి అమ్మడం వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నట్లు వారు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారం కోసమే ప్రజావాణి

- ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించిన కమిషనర్



**వరంగల్ ఎంజీఎం, డిసెంబర్ 15(జనంసాక్షి):** ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు.సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్)కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమం లో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 63, ఇంజనీరింగ్ 41, రెవెన్యూ 4, హెల్త్ శానిటేషన్ 3, నీటి సరఫరా 5, హార్టికల్చర్1 మొత్తంగా 117 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్, టిఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎన్నికల ప్రచారం



**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 15 (జనం సాక్షి) :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా లో సోమవారంతో గ్రామ పంచాయతీలకు ఎన్నికల ప్రచారం మూసింది. జిల్లాలో మొత్తం 104 గ్రామపంచాయతీలో ఎన్నికల నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 938 పోలీస్ స్టేషన్ లలో 1079 పోలింగ్ అధికారులను ఎన్నికలు నిర్వహించేందుకు నియమించారు. జిల్లాలోని ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి, కాగజ్ నగర్ మండలాల్లో ఎన్నికలు ఈనెల 17వ తేదీన మూడో దఫా ఎన్నికలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే అధికారులు ఏర్పాటు చేశారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్, ఎస్పీ నితిక పంత్ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# సిఎం సహాయనిధి పేద కుటుంబాలకు వరం



**నిర్మల్ రూరల్, డిసెంబర్15 (జనంసాక్షి) :** పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తుందని కూచాడి శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో అనారోగ్యంతో ఉండి ఆసుపత్రిలో చికిత్స పొందిన 35 మంది లబ్ధిదారులకు రూ. 8 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సంప్రదిస్తే తప్పక సీఎం సహాయనిధి చెక్కులను మంజూరు చేస్తామన్నారు.

# గైర్హాజర్ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

- సిబ్బంది బాధ్యతాయుతంగా ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవని, ఇవి చట్టబద్ధమైన బాధ్యతలని 2వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల విధులకు గైర్హాజరు అయిన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. 2వ దశ జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల విధులకు గైర్హాజరు అయిన 73 మంది పిఓ, ఓపిఓలకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల విధులకు హాజరు కాకపోవడం తీవ్రంగా పరిగణించబడుతుందని ఆయన తెలిపారు. నిర్దేశిత గడువులోపు సరైన వివరణ ఇవ్వని పక్షంలో ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 17న జరుగనున్న 3వ దశ ఎన్నికలకు విధులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని, గైర్హాజరు అయితే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు.

**మూడో విడత ఎన్నికల కోసం ఏర్పాట్లు**

3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం నుండి 3వ విడత గ్రామ పంచాయతి ఎన్నికలు జరుగనున్న కాటారం, మల్హార్, మహదేవపూర్, మహా ముత్తారం మండలాల రెవెన్యూ, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ విడత నిర్వహణలో భాగంగా 16న పోలింగ్ మెటీరియల్ పంపిణీ, 17న పోలింగ్, 2 గంటల తదుపరి ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. మొదటి, రెండవ విడతల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించారని భాగస్వాములైన అధికారులను, సిబ్బందిని అభినందించారు. అదే స్ఫూర్తితో 3వ విడత జరుగనున్న ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విధులు కేటాయించిన సిబ్బంది 16న ఉదయం 10 గంటల వరకు మెటీరియల్ పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తదుపరి పరిశీలన అనంతరం కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 17న జరుగనున్న పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. 17న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కావాలని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, అన్ని పోలింగ్ కేంద్రాలలో వయోవృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యతకు వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి**

మూడవ విడత జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు విధులు కేటాయించిన సిబ్బందికి మూడవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాటారం, మల్హార్, మహదేవపూర్, మహాముత్తారం మండలాల్లో 3వ విడత జరుగనున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 17న ఎన్నికల విధులు నిర్వహించే పిఓ, ఓపిలకు సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మూడవ విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియలో మినహాయింపు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు, సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**కోటపల్లి డిసెంబర్ 15 (జనం సాక్షి) :** 3వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ నిర్వహణ కొరకు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జైపూర్ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోటపల్లి మండలం 3వ విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఆయా మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని, ఓటింగ్, కౌంటింగ్ కొరకు అవసరమైన సామాగ్రి పంపిణీ చేయడంతో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 16వ తేదీన అధికారులు నిర్దేశిత సమయానికి తమకు కేటాయించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో రిపోర్టు చేయాలని, ఆయా పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 3వ విడతలో భాగంగా ఈ నెల 17వ తేదీన జిల్లాలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్, పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ఎన్నికలు సమర్థ వంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకో వడం జరుగుతుందని తెలిపారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిం చడం జరుగుతుందని, ఈ నెల 17వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ నిర్భయంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించాలని, అధికారులు, మీడియా ప్రతినిధులు అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు జరిగేలా అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయు తంగా నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అంది స్తున్న సౌక ర్యాలపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. తాగునీరు, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, సౌచాలయాలు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న మధ్యా హ్న భోజనం నాణ్యత, రిజిస్టర్ లను పరిశీలిం చారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడంతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతి లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

# సమర్ధవంతమైన పాలన కోసం మార్పులు అవసరం

**మల్కాజిగిరి, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని డివిజన్ ల పునర్విభజన ప్రక్రియలో ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని న్యాయసమ్మతమైన మార్పులు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సీసీపీ శ్రీనివాస్ ను కలిసి ఇటీవల విడుదలైన డివిజన్ ల పునర్విభజన గెజిట్ నోటిఫికేషన్‌పై మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజల అభ్యంతరాలను వారి దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాన్ని అందజేశారు. డిలిమిటేషన్ ప్రక్రియలో ప్రజల అభిప్రాయాలు,జనాభా సాంద్రతలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సర్కిళ్లు, డివిజన్ల వారీగా ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్న అంశాలను వారికి వివరించారు. అల్వాల్ డివిజన్‌ను టెంపుల్ అల్వాల్ గా మార్చడాన్ని ఉపసంహరించి,అల్వాల్ గానే కొనసాగించాలి. రీట్రీట్ కాలనీ, బీహెచ్ఈఎల్ కాలనీ, తిరుమల ఎంక్లేవ్, వెంకట్ రమణ కాలనీ, చంద్రపురం కాలనీలను అల్వాల్ డివిజన్‌లోనే కొనసాగించాలి. వెంకటాపురం డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ,



బోరాహ కమ్యూనిటీ వంటి ప్రాంతాలను హస్మత్‌పేట్ డివిజన్‌లో కూకట్‌పల్లి సర్కిల్ లో కలపడం వల్ల స్థానికులకు పాలనాపరమైన అసౌకర్యాలు తలెత్తుతాయి. మల్కాజిగిరి సర్కిల్‌లో నీ నేరెడ్ మెట్ డివిజన్ పేరును డిఫెన్స్ కాలనీ డివిజన్ గా మార్చడంపై తిరిగి ఆలోచించాలి. వినాయక్ నగర్ డివిజన్‌ను కాకతీయ నగర్ డివిజన్ గా, సఫిల్ గూడ డివిజన్‌ను వినాయక్ నగర్ డివిజన్ గా మార్చాలి. మౌలాలి డివిజన్‌ను రెండుగా విభజించి, సంతోష్ నగర్, దీనదయాళ్ నగర్, డి మార్ట్ జంక్షన్, గీతానగర్, వెంకటేశ్వర నగర్ ఎక్స్‌టెన్షన్, ఆర్కేజీ కాలనీ వంటి ప్రాంతాలతో నూతన డివిజన్ ఏర్పాటు చేయాలి. పాలనా సౌలభ్యం కోసం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌ను రెండుగా విభజించాలి. మల్కాజిగిరి డివిజన్‌లోని బలరాం నగర్ డివిజన్‌కు నేరెడ్ మెట్ డివిజన్ గా పేరు మార్చాలని సూచించారు. మీర్జల్‌గూడ డివిజన్ పరిధిలో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న కాలనీలు ఒకే డివిజన్‌లో ఉండేలా చూడాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. డిలిమిటేషన్ అంశాలపై పూర్వ పరిశీలన చేసి తగిన నిర్ణయాలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, ఆకుల నర్సింగ్ రావు, అలాగే బిఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, రాము యాదవ్, అమీనుద్దీన్, డోలి రమేష్, సాయి గౌడ్, సంపత్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, వంశీ ముదిరాజ్, చిన్న యాదవ్, హేమంత్ పటేల్, ఢిల్లీ పరమేష్, శోభన్ బాబు, మోసీన్, పవన్, రేవంత్ రెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్‌లో రాణించిన కటకం హర్షవర్ధన్



**తుంగతుర్తి, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న మండల కేంద్రానికి చెందిన కటకం హర్షవర్ధన్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్లో అండర్ నైన్ విభాగంలో కాంస్య పథకం సాధించినట్లు కరాటే మాస్టర్ బొంకూరి అరుణ తెలిపారు, సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలో పాల్గొన్న ఎనిమిది మందిలో ముగ్గురు అర్హత సాధించారని అందులో కటకం హర్షవర్ధన్ తన నైపుణ్యాన్ని ఉపయోగించి తృతీయ బహుమతి పొందినట్లు తెలిపారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు



**నేరేడుచర్ల, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అందుకు ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై రవీందర్ నాయక్ అన్నారు. ఈనెల 17 న మూడో దశ పంచాయతీ ఎన్నికలు మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలకు 168 వార్డులకు ఎన్నికల నిబంధనలపై ఎన్నికల విధులను, పోలీసులకు పలు సూచనలను చేశారు. గ్రామాల్లో అల్లర్లు జరగకుండా జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. ఎన్నికల కేంద్రం వద్ద 200 మీటర్లు దూరం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, ఓటు హక్కుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచుల పాత్ర ఎంతో కీలకం



**మొయినాబాద్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు ఎంతో కీలకమని సర్పంచులు పాలకవర్గంతో గ్రామాలను అభివృద్ధి చేయవలసిందిగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు మోత్కుపల్లి రాములు అన్నారు సోమవారము మండల పరిధిలోని మోత్ పల్లి గ్రామంలో మోత్కుపల్లి చందనగర్ నూతన సర్పంచులను ఆయన ఘనంగా సన్మానించారు మోత్కుపల్లి నూతన సర్పంచ్ సంపూర్ణ రాములు. చందానగర్ సర్పంచ్ మురళి కృష్ణ లను ఆయన సన్మానించి ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలకు సర్పంచులు ఎంతో అవసరమని తెలిపారు అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు గ్రామాలను అభివృద్ధి చేసేందుకు సర్పంచులు పాలకవర్గంతో కలిసి కృషి చేయాలని సూచించారు తెలంగాణ రాష్ట్రంలో అన్ని గ్రామాలలో ఎక్కువగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందుతున్నారని పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే ఈ గెలుపుకు మలుపు అని అన్నారు గ్రామాలలో ఉన్న సమస్యలను గెలుపొందిన సర్పంచులు అభివృద్ధి చేసినప్పుడే ప్రజలు గుర్తించి ఆదర్శంగా అభినందిస్తారని పేర్కొన్నారు అభివృద్ధి పనులు చేసినప్పుడే సన్మానాలు అందుకుంటారని సూచించారు ఈ కార్యక్రమంలో చందానగర్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి పూజా రవి చారి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- **జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్**



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్ ఆదేశించారు. 3వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సాధారణ పరిశీలకులు రవి నాయక్ నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సోమవారం ర్యాండమైజేషన్ జరిపించారు. మూడవ విడత ఎన్నికలు జరిగే చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్ నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు,ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో మూడవ విడతలో మొత్తం 146 గ్రామ సర్పంచ్ లకు, 1333 వార్డ్ సభ్యుల స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవ్వగా 22 సర్పంచ్ లు, 157 వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంతో మిగిలిన 124 గ్రామ సర్పంచ్, 1176 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 30 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1538, ఓపీఓలు 2026 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జడ్పీ సిఈఓ వివి.అప్పారావు,డీపీఓ యాదగిరి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భగవద్గీతలో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా సన్మానం



**సూర్యాపేట, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** పట్టణానికి చెందిన భగవద్గీత గోల్డ్ మెడలిస్ట్ బోనగిరి నాగలక్ష్మిని ఆమె శిష్యులు తమకు చదువు చెప్పిన గురువును సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. సోమవారం శ్రీగీతా మందిరంలో శిష్యులు రాజేశ్వరి,కృష్ణవేణి,మాధవి ,రాజకుమారి,కృష్ణవేణి ,కిరణ్మయి భగవద్గీతలో గోల్డ్ మెడల్ సాధించి మైసూర్ సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ ప్రశంసపత్రం అందుకున్నారు. భగవద్గీత మందిరములో తన గురువు నాగలక్ష్మిని ఘనంగా సన్మానించుకున్నారు. సామూహికంగా భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.స్వప్న, వి.మాధవి,ఆర్.రజిని, సిహెచ్.స్వాతి,నూక ముత్యాలమ్మ, నీరజ, సుజాత, రాధిక, రాజేశ్వరి,మీలా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో శాంతి భద్రతలపై అవగాహన

- **పోలీస్ శాఖ ఆధ్వర్యంలోఫ్లాగ్ మార్చ్**



**హుజూర్‌నగర్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, అర్థవంతంగా జరిగేలా పోలీసు విభాగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలతో మాట్లాడి శాంతి భద్రతలపై అవగాహన కల్పించామని హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీఐ చరమంద రాజు అన్నారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో బూరగడ్డ, లింగగిరి, శ్రీనివాసపురం గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ / కవాతు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో మోటార్ రహితంగా నడిచి కవాతు నిర్వహిస్తూ, ఎలాంటి అపశృతి చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామనే సందేశం ప్రజలకు ఇచ్చారు. ఎన్నికల సమయంలో చట్టం చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని, మద్యం, డబ్బు పంపిణీ, బెదిరింపుల వంటి అక్రమ చర్యలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు గ్రామస్తులను కోరారు. ప్రజలు, పార్టీ నాయకులు, అభ్యర్థులు ఎన్నికల నియమాలను గౌరవించి శాంతి, సఖ్యతతో పోలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ద్వారా గ్రామంలో నిశ్చింత వాతావరణం నెలకొల్పడం, పోలీసులు ప్రజలతో కలిసి ఉన్నారనే నమ్మకాన్ని కల్పించడం లక్ష్యంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ ఎస్సై బి.మోహన్ బాబు, పోలీస్ స్టేషన్ సిబ్బంది సహా పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే అభివృద్ధి పనులలో ఆలస్యం

- **కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**హయత్ నగర్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్‌లోని మధుర నగర్ కాలనీవాసులు కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించేందుకు నేడు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మధుర నగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇప్పటికే మంజూరు అయ్యాయని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనుల్లో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. కాలనీలో మిగిలి ఉన్న వీధులలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ కు విజ్ఞప్తి చేశారు. స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో సమీక్షించి, కాలనీలో ఉన్న సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అమల్ నాయక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శ్రీశైలం, కృష్ణమూర్తి, యాదగిరి, మహేష్, శేఖర్ రెడ్డి, మన్నా నాయక్, తదితరులు పాల్గొన్నారు.


## బండ్లగూడ జాగీర్ డివిజన్ల విభజనపై బీజేపీ అభ్యంతరాలు



**రాజేంద్రనగర్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను నూతనంగా 121, 122, 123 అనే మూడు జీహెచ్ఎంసీ డివిజన్లుగా విభజించడంపై బీజేపీ నాయకులు అభ్యంతరాలు తెలిపారు. సోమవారం బీజేపీ అధ్యక్షుడు కొండ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శరత్ చంద్ర ని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ బౌండరీలు సరిగా లేవని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 1.10 లక్షల ఓటర్లు ఉన్న ప్రాంతాన్ని కేవలం మూడు డివిజన్లుగా విభజించడం అన్యాయమని పేర్కొన్నారు. కనీసం 5 నుంచి 6 డివిజన్లుగా చేయాలని, ప్రజాభిప్రాయం తీసుకోకుండా, ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహించకుండా విభజన జరపడం సరికాదని తెలిపారు. డివిజన్ పేరు ఒకటి, ఓట్లు మరో డివిజన్‌లో ఉండటం గందరగోళంగా ఉందని విమర్శించారు. ఈ విషయాలను పై అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండె మహేష్ యాదవ్, మహాలింగం గౌడ్, పీఎస్ మల్లారెడ్డి, శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన దోరేపల్లి గ్రామ సర్పంచ్ బక్క ఎల్లమ్మ

- **అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**కనగల్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** ఈ నెల 11న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మండలంలోని దోరేపల్లి గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన బక్క ఎల్లమ్మను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందించారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో ఆ గ్రామం ఎస్సి రిజర్వ్ కావడంతో కాంగ్రెస్ పార్టీలోనే ఆశావులు పెరిగి సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలవడంతో గ్రామపార్టీ నాయకులు బరిలో నిలిచిన అభ్యర్థులను ఎంత బుజ్జగించిన వినకపోవడంతో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లగా ఆ గ్రామ ప్రజలు ఓటర్ల రూపంలో బక్క ఎల్లమ్మ కు మంచి మెజార్టీ ఇచ్చి ఆశీర్వదించారు. సోమవారం హైదరాబాదులోని మంత్రి నివాసం వద్దకు వెళ్లి సర్పంచ్ ఎల్లమ్మను పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ దొరెపల్లి గ్రామానికి నిధులు మంజూరు చేయించి పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారని వారికి హామీ ఇచ్చారు. సర్పంచి తో పాటు మిగతా సభ్యులను సమన్వయం చేసుకొని , గ్రామంలో పార్టీ బలోపేతం అయ్యేవిధంగా చూడాలని నాయకులకు సూచించారు. మంత్రిని కలిసిన వారిలో గ్రామ పార్టీ అధ్యక్షులు మల్లెపల్లి వీరసేనారెడ్డి,ఏమి రెడ్డి రవీందర్ రెడ్డి, కదారి శంకర్, బక్క రాశేఖర్, మన్యం శ్రీనివాస్, బైరగోని దుర్గయ్య, మన్యం మల్లేష్, మాధ గోని సైదులు లు ఉన్నారు.

## విద్యతోపాటు అన్ని రంగాలలో పాల్గొనాలి



**మొయినాబాద్, డిసెంబర్ 15 (జనం సాక్షి) :** విద్యార్థులు ఉన్నత విద్యతోపాటు జాతీయస్థాయి కార్యక్రమాలలో పాల్గొనడం అభినందనీయమని సికింద్రాబాద్ రైజింగ్ కమాండింగ్ అధికారి కాల్నాల్ .. సుబేదార్ మేజర్ రాజు కుమార్లు.అన్నారు. సోమవారము మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూ పరిధిలో గల గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి ఎన్సిసి ఆర్మీ యూనిట్ స్థాపన కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్ కెఎం పాసిరుద్దీన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాల్ నాల్ పాల్గొని ఆయన ఎన్సిసి జెండాను ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్లోబల్ ఇంజనీరింగ్ విద్యా సంస్థకు ఎన్సిసి ఆర్మీ గుర్తింపు రావడం ఎంతో అభినందనీయమని తెలిపారు జాతీయస్థాయి కార్యక్రమాలు విద్యార్థులు నిర్వహించినప్పుడే ఆ కళాశాలలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు విద్యార్థులు నాయకత్వ లక్షణాలతో పాటు నైపుణ్యాలను క్రమశిక్షణ జట్టు కృషి ఎంతో అవసరం అన్నారు సామాజిక సేవలు జాతీయ బాధ్యత బలమైన భావాన్ని పెంపొందించుకోవడానికి విలువైన అవకాశాలు ఉంటాయని సూచించారు కళాశాల కార్యదర్శి సబియా ఫర్జానామాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు విద్యార్థులకు అన్ని విధాలుగా నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత విద్య నందిస్తూ వారి భవిష్యత్తు కోసం జాతీయ సేవా కార్యక్రమాలలో పాలుపంచుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు ఆర్మీ ఎన్సిసి ఇనీటిగా కళాశాలకు గుర్తింపు పొందడం ఎంతో గర్వకారణంగా ఉందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పసియోద్దీన్. రవీంద్ర తివారి ఎన్సిసి విద్యార్థులు ఆధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రిన్సిపాల్, లెక్చరర్‌లు చొరవ చూపాలి

- **ఐటీడీఏ పీవో బి. రాహుల్**




**భద్రాచలం, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** గిరిజన విద్యార్థులు చదువుతోపాటు కాంపిటేటివ్ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా సంబంధిత ప్రిన్సిపాల్, లెక్చరర్ లు చొరవ చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం తన చాంబర్లో ఖమ్మం గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులకు గ్రూప్స్ మెయిన్స్ కు సంబంధించిన కోచింగ్ పుస్తకాలను కొనుగోలు చేయడానికి 45 వేల రూపాయల చెక్కును అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించినప్పుడు కళాశాల విద్యార్థులు ఐఐటి- జేఈఈ, ఎన్ ఈ ఈ టి, సి ఎల్ ఏ టి, హోటల్ మేనేజ్‌మెంట్ ప్రవేశ పరీక్షలతో సహా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి రిఫరెన్స్ పుస్తకాల కోసం అభ్యర్థించారని అన్నారు. పోటీపరీక్షలకే కాకుండా, విద్యార్థులలో నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలు, వివిధ రకాల పెయింటింగ్ చిత్రాలలో నైపుణ్యం తెచ్చుకునేలా అవగాహన కల్పించి క్రమశిక్షణతో కూడిన అధ్యయన పద్ధతులను అవలంబించేలా సంబంధిత లెక్చరర్లు వారిలో స్ఫూర్తి నింపుతూ ఉండాలని, అలాగే కెరీర్ గైడెన్స్ కు సంబంధించిన అంశాలు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను పిలిపించి వారి చేత విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని, అలాగే విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి, విద్యార్థులు వారి విద్యా, కెరీర్ లక్ష్యాలలో రాణించడానికి అవసరమైన మద్దతును ప్రిన్సిపాల్, లెక్చరర్లు అందిస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ రజిని తదితరులు పాల్గొన్నారు.




**ఒకప్పుడు స్వాతంత్రం రాక ముందు ఆదాయపు పన్ను చట్టం 1922, స్వాతంత్రం వచ్చిన తరువాత చట్టం 1961 అమలులోకి వచ్చింది. మధ్యలో ఎన్నో మార్పులు, చేర్పులు, కూర్పులు, నాలుగైదు సార్లు పెనుమార్పులు.తీసివేతలు, కలిపివేతలు, 65 సార్లు 4,000 మార్పులు చేశారు. ఈ సంవత్సరం కొత్త చట్టాన్ని అమల్లోకి తెస్తున్నారు.**

### కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025..

# నూతన సంవత్సరంలో అమల్లోకి..!




ఆదాయపు పన్ను చట్టం 2025.. 47 చాప్టర్లను 23కు కుదించారు. 819 సెక్షన్లను 536కి తగ్గించారు. ఇప్పుడు షెడ్యూళ్లు లేవు. ఇప్పుడు వాటి సంఖ్య 16. ప్రస్తుతం అంకెలకు ఇంగ్లీషు అక్షరాలు తగిలించి.. మూడు అక్షరాల రైలుబండిలా పెట్టి వ్యవహారం నడుపుతున్నారు. ఇకపై అలా ఉండదు. కేవలం నంబర్లే... సెక్షన్ 10లో ఉండే అన్ని మినహాయింపులను షెడ్యూల్స్‌లో అమర్చారు. క్లారిటీ కోసం కొన్ని టేబుల్స్, ఫార్ములాలు ప్రవేశపెట్టారు.

**సరళీకృతంగా ఉంటుంది.**

వాడుకలో లేనివాటిని తీసివేశారు కొన్ని అంశాలను నెంబరింగ్ ఇచ్చి క్రమబద్ధీకరించారు.
కొన్ని అంశాలను పునర్‌నిర్మాణం చేశారు. రాబోయే పదం "పన్ను సంవత్సరం". ప్రస్తుత అకౌంటింగ్ సంవత్సరం, ఫైనాన్షియల్ సంవత్సరం, ఆదాయపు సంవత్సరం, గత సంవత్సరం, ఇవన్నీ మనకు అర్థం అయ్యేలా చెప్పాలంటే మనం ఆదాయం సంపాదించిన సంవత్సరం. ఈ ఆదాయాన్ని సంవత్సరం తరువాత అస్సెస్సుమెంట్ సంవత్సరం అంటే ఆ తరువాత సంవత్సరంలో అస్సెస్సు చేస్తారు. కాబట్టి ఈ సంవత్సరం అస్సెస్సుమెంట్ సంవత్సరం అని అంటారు. రామాయణం అంతా విని రాముడికి సీత ఏమి అవుతుందని అడిగినట్లు... 64 ఏళ్ల దాటినా టాక్స్ ప్లేయర్‌కి ఈ రెండు సంవత్సరాల మధ్య తేడా తెలియదు. కన్ఫ్యూజన్ పోలేదు. ఎన్నో పొరపాట్లు జరిగేవి. ఇన్‌కం టాక్స్ చెల్లించేటప్పుడు చలాన్‌లో సంవత్సరానికి సంబంధించిన కాలమ్ నింపేటప్పుడు తికమక అయ్యేవారు. ఇకపై తికమక అవసరం ఉండదు. 1.4.2026 నుంచి నుంచి ఒకే పదం వాడుకలోకి వస్తుంది. అదే "పన్ను సంవత్సరం".టీడీఎస్‌కి సంబంధించిన అంశాలను చాలా పద్ధతి ప్రకారం ఎటువంటి తికమక రాకుండా చేశారు. ఒక సెక్షన్ ద్వారా జీతాలకు సంబంధించిన అంశాలు పొందుబరిచారు. ఒకే ఒక సెక్షన్ ద్వారా మిగతా అన్ని టీడీయస్ అంశాలు పొందుబరిచారు. ఈ పట్టిక సమగ్రం.., సంపూర్ణం. క్రమసంఖ్య ఏ ఆదాయం మీద చేయాలి? ఎవరికి వర్తిస్తుంది? పరిమితులు... ఇలా ఉంటాయి వివరాలు... రెసిడెంట్లకు, నాన్ రెసిడెంట్లకు, టీసీఎస్.. ఎవరికి అక్కర్లేదు.? ఇలా అన్నీ టేబుల్స్ ద్వారా చక్కగా వివరించారు. పాతకాలపు పదజాలానికి స్వస్తి పలికారు. పాతవాటికి మంగళం పలికి, ప్రపంచంలో ఆచరించే మంచి పద్ధతులకు చట్టంలో చోటిచ్చారు. వర్చువల్, డిజిటల్ ఆస్తులను నిర్వచించారు. క్రిప్టో కరెన్సీ, టోకనైజ్డ్ ఆస్తులు, టెక్నాలజీ ద్వారా ఏర్పడే హక్కులు మొదలైనవి వివరించారు.వివాదాలకు ఆస్కారం లేకుండా పరిష్కారం చేస్తారు. టెక్నాలజీని ఆసరా తీసుకొని అధికార్లకువిస్తృత అధికారాలు కల్పించారు. ఇన్నాళ్లు సెర్చ్‌లు అంటే ఇంటినో, ఆఫీసునో, ఫిజికల్ ఏరియా మాత్రమే ఉండేవి. ఇక నుంచి మీ ఈ-మెయిల్స్, క్లౌడ్ సర్వర్లు, సోషల్ మీడియా అకౌంట్లు, వెబ్‌సైట్లు అన్నింట్లోనూ చొరబడతారు ఎగబడతారు. ఇకపై బుకాయించలేము. ఈ నగదు నాది కాదు మా మామగారిది అనలేము. అధికారులకు విస్తృత సమాచారం ఇవ్వడం వల్ల మీకు సంబంధించిన సమాచారం వారి చెంతనే ఉంటుంది. కాబట్టి కొత్త చట్టంలోని అంశాలకు అనుగుణంగా నడుచుకుందాం. చట్ట ప్రకారం మీ విధులను సక్రమంగా నిర్వర్తించండి. ఫిబ్రవరిలో బడ్జెటుకు కసరత్తు జరుగుతోంది. అందులో శ్లాబులు, రేట్లు మారవచ్చు. మారకపోవచ్చు. ఈ రాబోయే మార్పులు తప్ప, మిగతా అంతా కొత్త చట్టం మనకు అందుబాటులో ఉంటుంది.

## నష్టాల్లో మొదలై.. ఫ్లాట్‌గా ముగిసి...

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత కాస్త కోలుకున్నాయి. ఆటో, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించగా.. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ సూచీలను నిలబెట్టాయి. అంతర్జాతీయంగా మార్కెట్‌లో క్రూడాయిల్ ధర కాస్త తగ్గుముఖం పట్టడం మనకు కలిసొచ్చే అంశం.సెన్సెక్స్ ఉదయం 84,891.75 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,840.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత కోలుకుని చివరికి 54.30 పాయింట్ల నష్టంతో 85,213.36 వద్ద స్థిరప డింది. నిఫ్టీ 19.65 పాయింట్ల నష్టంతో 26,027.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్ టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4344 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


# వెండి కొండ

- **రూ.2.40 లక్షలకు వెండి..**
- **కొత్త ఏడాదిలో కష్టమే!**



**ముంబై:**బంగారం ధర రూ. 1.30 లక్షలు (24 క్యారెట్స్ 10 గ్రామ్స్) దాటితే.. కేజీ వెండి రేటు రూ. 2.13 లక్షలకు చేరింది. సిల్వర్ రేటు మరింత పెరిగి 2026కు సుమారు రూ.2.40 లక్షలకు చేరుకుంటుందని స్టాక్ బ్రోకర్ అండ్ ఇన్వెస్ట్మెంట్ సర్వీస్ కంపెనీ 'యాక్సిస్ సెక్యూరిటీస్' వెల్లడించింది.యాక్సిస్ సెక్యూరిటీస్ ప్రకారం.. వెండి రేటు మునుపెన్నడూ లేనంతగా పెరుగుతూనే ఉంది. 2025 ప్రారంభంలో రూ. 80వేలు వద్ద ఉన్న సిల్వర్ రేటు.. ఇప్పుడు గణనీయంగా పెరిగి, రెండు లక్షల రూపాయలు దాటేసింది. దీనికి కారణం మార్కెట్లో వెండికి పెరుగుతున్న డిమాండ్ అని స్పష్టమవుతుంది. ఆభరణాలు గా మాత్రమే కాకుండా.. పారిశ్రామిక రంగంలో వెండి వినియోగం పెరగడం, దీంతో డిమాండ్ ఎక్కువ కావడం వల్ల కూడా సిల్వర్ రేటు ఊహకందని విధంగా పెరిగింది. సోలార్ ఫోటోవోల్టాయిక్ రంగంలో మాత్రమే వెండి వినియోగం నాలుగేళ్లలో రెండింతలు పెరిగింది. రాబోయే రోజుల్లో కూడా వెండికి డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. డిసెంబర్ 14న రూ. 2.10 లక్షల వద్ద ఉన్న కేజీ వెండి రేటు.. ఈ రోజు రూ. 2.13 లక్షలకు చేరింది. అంటే ఈ ఒక్క రోజులోనే సిల్వర్ టు రూ. 3000 పెరిగిందన్నమాట. హైదరాబాద్, విజయవాడ, ముంబై, బెంగళూరులో సిల్వర్ రేటు ఒకేలా ఉన్నా.. ఢిల్లీలో మాత్రం కొంత తక్కువగా ఉంది. ఇక్కడ కేజీ వెండి రేటు రూ. 2,00,900. దీన్నిబట్టి చూస్తే.. దేశంలో ఢిల్లీలోనే సిల్వర్ రేటు కొంత తక్కువని స్పష్టమవుతోంది.

# డిజిటల్ మోసాలను ముందుగానే పసిగట్టాలి



**న్యూఢిల్లీ:**చీఫ్ రిస్క్ ఆఫీసర్ చిట్కాలు డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్నాయి, ఇవి భారతదేశాన్ని డిజిటల్-ఫస్ట్ ఆర్థిక వ్యవస్థ వైపు తీసుకెళ్తున్నాయి. ఇవి భద్రతతో పాటు, వినియోగదారులకు చెల్లింపుల్లో సౌకర్యాన్ని అందిస్తాయి.అయితే, డిజిటల్ పేమెంట్లను సురక్షితంగా ఉపయోగించడం, ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా ఉండటం ఈరోజుల్లో అత్యంత కీలకం. సంభవించే మోసాలను ముందుగానే గుర్తించగలిగితే అది మీతోపాటు మీ కుటుంబ సభ్యులను కూడా ఆన్ లైన్ మోసాల నుంచి కాపాడడమే కాకుండా అందరికీ సురక్షితమైన, తక్కువ నగదు వినియోగంతో కూడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో సహాయపడుతుంది. ఆధునిక టెక్నాలజీ చెల్లింపులను వేగంగా జరిపేలా, సులభతరంగా మార్చినప్పటికీ, ఆన్‌లైన్ మోసాల నుండి పూర్తి స్థాయి రక్షణ అవగాహనతోనే సాధ్య పడుతుంది. ఆన్‌లైన్ మోసాలు, ముఖ్యంగా సామాజిక ఇంజినీరింగ్ ద్వారా జరిగేవి ఇటీవలి కాలంలో చాలా ఆందోళనగా కలిగిస్తున్నాయి. దురాశ, భయం, అత్యవసరం వంటి భావోద్వేగాలను సాధనాలుగా ఉపయోగించి ఆన్‌లైన్ మోసగాళ్లు వినియోగదారులను వంచిస్తారు.ఇటీవలి కాలంలో వేగంగా పెరుగుతున్న ధోరణుల్లో ఒకటి "డిజిటల్ అరెస్టు' తమను పోలీసులమని చెప్పుకుంటూ ఎవరో కాల్ చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. మీ బ్యాంక్ ఖాతా దర్యాప్తులో ఉందని, డబ్బును 'సురక్షిత' ఖాతాకు మార్చాలని వారు చెబుతారు. వెంటనే మానసిక ఒత్తిడికి గురైన వినియోగదారులు వారి ట్రాప్‌లో పడి అంతా పోగొట్టుకుని చాలా ఆలస్యంగా అది మోసమని గ్రహిస్తారు. నిజమైన ప్రభుత్వ సంస్థలు, నియంత్రణ సంస్థలు ఎప్పుడూ ఫోన్లు, వీడియో కాల్ ద్వారా డబ్బు అడగవు, కేసులను దర్యాప్తు చేయవు. డబ్బు విషయంలో నిర్ణయం తీసుకునే ముందు కాల్ చేసిన వ్యక్తి నిజస్వరూపాన్ని నిర్ధారించుకోవడం, నమ్మకమైన ప్రభుత్వ సంస్థలను సంప్రదించడం చాలా ముఖ్యం. వేగంగా పెరుగుతున్న పెట్టుబడి మోసాలు ఆర్థిక నిపుణులుగా పరిచయం చేసుకుని మోసంచేసే వారు ఇటీవలి బాగా పెరిగారు. పేరున్న సంస్థలను, నకిలీ రిఫరెన్సులను అమాయక, ఔత్సాహిక ఇన్వెస్టర్లను మోసగించేందుకు వీరు ఉపయోగిస్తారు.అసాధారణ లాభాలు , ప్రత్యేక పెట్టుబడి అవకాశాలను అందిస్తామని వాగ్దానం చేస్తారు. బదులుగా డబ్బు అందుకున్న వెంటనే అదృశ్యమైపోతారు. అందుకే ఎల్లప్పుడూ సెబీ, ఆర్‌బీఐ ఇతర అధికారిక నియంత్రణ సంస్థల వెబ్‌సైట్లలో నమోదైన సంస్థల జాబితాలను తనిఖీ చేస్తుండాలి. డిజిటల్ పేమెంట్‌లను ఆమోదించే ముందు వినియోగదారులు ఎల్లవేళలా యాప్ నోటిఫికేషన్‌లను జాగ్రత్తగా పరిశీలించాలి, మోసం జరిగితే వెంటనే తమ బ్యాంకుకు తెలియజేయాలి లేదా 1930 (సైబర్ సెక్యూరిటీ హెల్ప్‌లైన్)కు కాల్ చేయాలి

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.66 | ₹ 6.68 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,24,100 (22 క్యారెట్లు) | ₹ 1,35,380 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,15,000

# సామ్రాజ్యవాదానికి మూల్యం తప్పదా?

## వలస దోపిడీపై ఏకమైన దేశాలు

## బ్రిటన్‌పై 180 ట్రిలియన్ డాలర్ల పరిహారం డిమాండ్



**బ్రిటన్ సామ్రాజ్యవాద చరిత్రలో కనీవినీ ఎరగని పరిణామం చోటుచేసుకుంది. వలస పాలనలో జరిగిన దోపిడీకి పరిహారం చెల్లించాలని మాజీ వలస దేశాలన్నీ డిమాండ్ చేస్తున్నాయి. బ్రిటన్ వలసలలో మగ్గిన దేశాలన్నీ ఏకమయ్యాయి. క్షమాపణలతో సరిపెట్టే రోజులు పోయా యని, జరిగిన నష్టానికి ఆర్థిక మూల్యం చెల్లించాలని పట్టుబడుతున్నాయి. ఈ వలస రాజ్యాలన్నీ 180 ట్రిలియన్ డాలర్లు పరిహారంగా డిమాండ్ చేయడం చరిత్రలో ఎన్నడూ లేని పరిణామంగా నిలిచింది.**

**హైదరాబాద్(జనంసాక్షి):** వలస దోపిడీ పట్ల కొనసాగుతున్న నైతిక, న్యాయ పరమైన పోరాటం ఇప్పుడు ఆర్థిక రూపాన్ని సంతరించుకుంది. ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. ఆదివారం అల్జీర్స్‌లో సమావేశమైన ఆఫ్రికన్ నాయ కుల రెండో సదస్సులో బ్రిటన్‌పై ఒకే గొంతుకతో పరిహారం డిమాండ్‌ను ఖరారు చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆఫ్రికన్ యూనియన్ ప్రాథమిక అంచనాల ప్రకారం.. బ్రిటిష్ వలస పాలన వల్ల ఆఫ్రికా ఖండానికి జరిగిన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నష్టం 100 నుంచి 120 ట్రిలియన్ డాలర్ల మధ్యలో ఉంటుందని పేర్కొంది. అయితే, నైజీరియా ఇప్పటికే ఐదు ట్రిలియన్ డాలర్లు విలువైన ప్రత్యేక పరిహార క్లెయిమ్‌ను బ్రిటన్‌పై దాఖలు చేసింది. కరేబియన్ కమ్యూనిటీ (సీఏఆర్ఐసీఓఎం) నుంచి వస్తున్న తీవ్ర దౌత్య ఒత్తిడితో ఈ పరిణామాలు వేగం పుంజుకున్నా యి. నవంబర్ మధ్యలో లండన్ సందర్శించినప్పుడు ఈ ప్రతినిధులు బ్రిటన్ ప్రధాని సర్ కేర్ స్టార్మర్‌ను ప్రత్యక్షంగా పరిహారం విషయంపై ఒత్తిడి చేశారు. కరేబియన్ తో కలిపి చేసిన డిమాండ్ల మొత్తం 24 ట్రిలియన్ డాలర్లు, అందులో బార్బడోస్ ఒక్కటే 4.9 ట్రిలియన్ డాలర్లు డిమాండ్ చేస్తోంది. దీనికి మరింత బలాన్ని ఇచ్చేది భారతదేశం. 2024లో ప్రచురితమైన ఒక్స్ఫామ్ విశేష అధ్యయనం ప్రకారం.. బ్రిటిష్ వలస పాలన కాలంలో భారత్ నుంచి దోచుకున్న వనరుల విలువ 65 ట్రిలియన్ డాలర్లుగా లెక్కించబడింది. ఇది ప్రపంచ వేదికలపై చర్చను మరింత వేగవంతం చేసింది.

ఈ పరిహారం డిమాండ్లకు న్యాయపరమైన మార్గం ఇంకా వివాదాస్పదంగానే ఉంది. లండన్‌లోని న్యాయ నిపుణులు చెప్తున్నదే మి టంటే, సంఖ్యలు ఎంతో భారీగా ఉన్నప్పటికీ, ఇవి ఒక్స్ఫామ్ వంటి ప్రతిష్ఠా త్మక సంస్థలు, ప్రముఖ శాస్త్రవేత్తలు సమర్పించిన డేటా ఆధారంగా ఉండ టం వల్ల అంతర్జాతీయ కోర్టులు, దౌత్య వేదికలలో కొత్త గంభీరత ఉంది. ఇటీవల విడుదలైన 'ఫ్రం స్లేవ్స్ టు బాండ్' డాక్యుమెంటరీ కూడా ఈ పోరాటానికి మరింత బలాన్నిచ్చింది. దాస్య యుగం నుంచి ఆధునిక ఆర్థిక బంధనాల వరకు కొనసాగుతున్న దోపిడీ పద్ధతులను చూపిస్తూ తరతరాలుగా వచ్చిన మానసిక, సామాజిక, ఆర్థిక నష్టాలను కొలవడంలో ఉన్న సంక్లిష్టతను ఈ చిత్రం స్పష్టంగా చూపించింది.
బ్రిటన్ రాజకీయ పరిసరాల్లో ఈ పరిహారం డిమాండ్లు అత్యంత క్లిష్టమైన నేపథ్యాన్ని సృష్టిస్తున్నాయి. 2024లో సర్ కేర్ స్టార్మర్, ఇతర 55 కామన్వెల్త్ నాయకులు సంతకం చేసిన పత్రంలో దాస్య వ్యవస్థకు సంబంధించి 'రీపరేటరీ జస్టిస్‌పై చర్చలు అవసరం' అని స్వయగా అంగీకరించారు. ఇప్పుడు ప్రధాని స్థానంలో ఉన్న స్టార్మర్ ఆ చర్చల ప్రత్యక్ష రూపమైన ఈ విపరీతమైన ఆర్థిక డిమాండ్లను ఎదుర్కొంటున్నారు. స్టార్మర్ ప్రభుత్వం ఇప్పటికీ పాత బ్రిటిష్ విధానాన్నే కొనసాగిస్తోంది. చారిత్రక అన్యాయాలపై విచారం వ్యక్తం చేస్తూనే ప్రత్యక్ష ఆర్థిక పరిహారానికి వ్యతిరేకంగా నిలుస్తోంది. ప్రస్తుత తరానికి మేలు చేసే అభివృద్ధి సహకారం, ఆర్థిక భాగస్వామ్యంపై దృష్టి పెట్టాలని బ్రిటన్ వాదిస్తోంది. ఇప్పుడు 180 ట్రిలియన్ డాలర్ల పరిహారాన్ని ప్రపంచం ముందు ఉంచడంతో బ్రిటన్ కేవలం చరిత్రకు క్షమాపణ చెప్పే దశను దాటి ఒక సంక్లిష్ట దశను ఎదుర్కొంటోంది. ఈ ఏకీకృత ప్రపంచ వేదిక తమ ఆర్థిక అంచనాలను న్యాయపరమైన, రాజకీయపరమైన ఒప్పందాలుగా మార్చగలదా?, లేకపోతే ఇది ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద పరిహార క్లెయిమ్‌గా నిలిచిపోయి, ఎప్పటికీ వసూలు కాని ఋణంగా మిగిలిపోతుందా? అనేది సమీప భవిష్యత్తులో తేలాల్సి ఉంది.



# శీతాకాలం పొగమంచు.. అప్రమత్తతే మందు..

**న్యూఢిల్లీ:**శీతాకాలంలో పొగమంచు సర్వసాధారణం. ఇది చూడటానికి ఆహ్లాదంగా ఉంటుంది. కానీ వాహనదారులు మాత్రం ఒకింత జాగ్రత్త వహించాలి. లేకుంటే అనుకోని ప్రమాదంలో చిక్కుకోవాల్సి ఉంటుంది. ఈ కథనంలో శీతాకాలం పొగమంచులో డ్రైవింగ్ టిప్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

**పొగమంచులో డ్రైవింగ్ టిప్స్**

నెమ్మదిగా డ్రైవ్ చేయండి: పొగమంచు ఉన్నప్పుడు మీ వాహనాలను నెమ్మదిగా నడపాలి. అకస్మాత్తుగా బ్రేక్స్ వేయడం మానుకోవాలి. ముందున్న వాహనాలను జాగ్రత్తగా గమనించాలి.
ఫాగ్ లైట్స్ ఉపయోగించండి: ప్రయాణించేటప్పుడు.. తప్పకుండా ఫాగ్ లైట్స్ ఉపయోగించాలి. లో బీమ్ హెడ్లైట్ మాత్రం ఆన్ చేయడం మర్చిపోవద్దు. హైబీమ్ లైట్ ఆన్ చేస్తే.. ఎక్కువ లైటింగ్ వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కొంత ఇబ్బందికి గురవుతాయి.
**సేఫ్ డిస్టెన్స్ పాటించండి:** మీకు ప్రయాణించే సమయంలో తప్పకుండా.. ముందు వెళ్తున్న వాహనానికి డిస్టెన్స్ పాటించండి. ముందు వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా ఆగినా.. మీరు ప్రమాదంలో చిక్కుకుండా ఉంటారు. ఈ విషయం తప్పకుండా గుర్తుంచుకోవాలి.
**లేన్ డిసిప్లిన్ పాటించండి:** వాహనదారులు తప్పకుండా.. రోడ్డు మధ్య లైన్ లేదా ఎడ్జ్ మార్కింగ్‌ని గమనిస్తూ డ్రైవ్ చేయాలి. ఒకవేళా లేన్ మార్చాల్సి వస్తే.. జాగ్రత్తగా ఉండాలి. అవసరమైనప్పుడు హారన్ మోగించడం మర్చిపోవద్దు. అనవసరంగా హారన్ మోగించవద్దు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వాహనం ముందే చెక్ చేయండి: ప్రయాణించే వాహనం కండిషన్ ఎలా ఉందనే విషయాన్ని.. ముందుగానే గమనించాలి. లైట్స్, బ్రేక్స్, వైపర్స్ సరిగ్గా ఉన్నాయా.. పనిచేస్తున్నాయా అనే విషయం కూడా తెలుసుకోవాలి. విండ్‌షీల్డ్ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
**హజార్డ్ లైట్స్ ఆన్ చేసుకోండి:** ఫాగ్ లైట్ కాంతి ఎక్కువ అనిపిస్తే.. హజార్డ్ లైట్స్ ఆన్ చేసుకోవాలి. ఈ లైట్స్ వెనుక వచ్చే వాహనాలకు.. ముందు ఒక వాహనం వెళ్తోందని చూపిస్తాయి.
**మొబైల్ వాడకండి:** పొగమంచుతో డ్రైవింగ్ చేసేటప్పుడు మాత్రమే కాకుండా.. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ వాడకుండా ఉండాలి. వాహనం డ్రైవింగ్ మీదనే మీ పూర్తి దృష్టి పెట్టాలి. మొబైల్ వాడాలంటే.. వాహనం ఆపి ఉపయోగించుకోవడం మంచిది.
**ఉదయం, రాత్రి వేళల్లో జాగ్రత్త:** ప్రత్యేకింగ్ పొగమంచు ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో అత్యవసరమైతే.. తప్పా ప్రయాణం వాయిదా వేసుకోవడం మంచిది. ఒకవేళా ప్రయాణం తప్పనిసరి అయితే.. కొంత జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.

## తినడానికి వెళ్తా అన్నాడు..

### బీచ్ అటాక్..

### ఉగ్రవాది తల్లి సంచలన విషయాలు

ఆస్ట్రేలియా బీచ్‌లో ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడి 16మంది అమాయక ప్రజలను పొట్టన బెట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటనపై కాల్పులు జరిపిన ఉగ్రవాది తల్లి ఆసక్తికర విషయాలు తెలిపింది. కాల్పులు జరిపే కొద్ది సేపటి ముందు తన కుమారుడితో ఫోన్ మాట్లాడినట్లు పేర్కొంది. తన కుమారుడు తనతో ఎప్పటిలాగానే సాధారణంగా మాట్లాడాడని కొద్దిసేపటి తర్వాత తినడానికి వెళ్తానన్నాడని తెలిపింది. ఆస్ట్రేలియా సిడ్నీలోని బాండీ బీచ్‌లో ఆదివారం ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన సంగతి తెలిసిందే. హనుక్కా పండుగ జరుపుకుంటున్న యూదులపై సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్ అనే తండ్రికొడుకులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో 16మంది మరణించగా 40 మందికి గాయాలయ్యాయి. దాడి చేసిన వారు పాకిస్థాన్ దేశానికి చెందిన వారని కొద్దికాలం క్రితమే ఆస్ట్రేలియాకు వలస వచ్చారని అధికారులు తెలిపారు. ?అయితే తాజాగా ఈకాల్పుల ఘటనపై ఉగ్రవాది నవీద్ అక్రమ్ తల్లి స్పందించింది. కాల్పుల ఘటన జరగడానికి కొద్దిసేపటి ముందే అక్రమ్ తనతో మాట్లాడరని తెలిపింది. ఉగ్రవాది తల్లి వెరినా మాట్లాడుతూ "ఘటన జరగడానికి కొద్ది సేపు మందు నా కొడుకుతో మాట్లాడా అక్రమ్ చాలా సాధారణంగా మాట్లాడారు. కొద్దిసేపటి క్రితమే స్కూబా డ్రైవింగ్‌కు, స్విమ్మింగ్‌కు వెళ్లివచ్చాను. ఈ రోజు చాలా వేడిగా ఉంది హోటల్‌లోనే ఉంటాను. కొద్దిసేపు తర్వాత తింటాను " అని అక్రమ్ అన్నారని తన తల్లి పేర్కొంది. తన కొడుకు చాలా మంచివాడని అతనికి ఏలాంటి దురలవాట్లు లేవని,స్నేహితులతో కూడా ఎక్కువ తిరగడని తనకు పనికి వెళ్లడం ఇంటికి రావడం తప్ప మరేది తెలియదని ఆమె అంది. ? అయితే తన కుమారుడి చిత్రాలను ప్రస్తుతం చూపిస్తున్న చిత్రాలతో సరిపోల్చలేమని తెలిపింది.



### గ్రామీణ ఉపాధి పథకం..

## కొత్త పేరు ఇదే..


ఢిల్లీ, సాక్షి: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం మారుస్తున్న సంగతి తెలిసిందే. ఆ పథకానికి వికసిత్ భారత్ - జీ- రామ్- జీ (గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్)) పేరును పెట్టింది. దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటులో సోమవారం ప్రవేశపెడుతోంది. ఇక నుంచి గ్రామ పంచాయతీల ద్వారా పనులకు ప్రణాళికలు.వికసిత భారత్ లక్ష్యాలకనుగుణంగా రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిలో పనుల ప్రణాళికలు. ఏబీసీ కేటగిరీలుగా గ్రామ పంచాయతీల విభజన.కేంద్రం నిర్ధారించిన పారామీటర్స్ ఆధారంగా రాష్ట్రాల వారీగా ఉపాధి హామీ నిధులు కేటాయింపు.

## వణుకుతున్న ఉత్తరాది

రద్దు చేసినట్లు తెలుస్తుంది. అంతేకాదు 300 విమానాలు ఆలస్యంగా నడుస్తు న్నట్లు సమాచారం. మరోవైపు పొగమంచు కారణంగా సుమారు వంద రైళు ఆలస్యంగా నడుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఢిల్లీలో పొగమంచు పరిస్థిసి నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్ట్ ప్రయాణికులకు కీలక సూచన జారీ చేసింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానాల స్టేటస్ చెక్ చేసుకోవాలని తెలిపింది. ఎయిర్‌లైన్ సిబ్బంది వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, ఢిల్లీ విమానాశ్రయ అధికారులతో సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపింది. భద్రతా ప్రోటోకాల్ కు అనుగుణంగా పనిచేస్తున్నాయని ఎయిర్‌లైన్స్ పేర్కొంది. మరోవైపు ఇండిగో, ఎయిర్ ఇండియా వాతావరణ పరిస్థితులు దృష్ట్యా పలు విమానాలు రద్దు కాగా, మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపింది. విమానాల స్టేటస్ గురించి తెలుసుకోవాలంటే వెబ్ సైట్స్ కి వెళ్లి చెక్ చేసుకోవాల్సిందిగా సూచించింది. దిల్లీలో తీవ్రమైన పొగమంచు కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ మూడు దేశాల పర్యటనలో జాప్యం నెలకొంది. జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటనకు సోమవారం ఉదయం 8.30 గంటలకు ప్రధాని మోదీ బయల్దేరాల్సి ఉంది. అయితే దిల్లీ విమానాశ్రయంలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో ప్రధాని విమానం ఆలస్యమయినట్లు జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

## చాట్‌జీపీటీ 'అడల్ట్ మోడ్'..

**న్యూఢిల్లీ:**దాదాపు అన్ని రంగాల్లోనూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా కొన సాగుతోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ఈ తరుణంలో ఓపెన్‌ఏఐ పెద్దలకోసం 'అడల్ట్ మోడ్' అందించడానికి సిద్ధమైంది.ఇది ఎప్పటి నుంచి అంబాటులోకి వస్తుందనే విషయాన్ని ఆ సంస్థ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.అడల్ట్ మోడ్ ఫర్



చాట్‌జీపీటీ 2026 మొదటి త్రైమాసికంలో లాంచ్ కానుంది. కొత్త 5.2 మోడల్‌పై బ్రీఫింగ్ సందర్భంగా ఓపెన్‌ఏఐ అప్లికేషన్స్ సీఈఓ ఫిడ్జీ సిమో ప్రకటించారు. ఇది కేవలం వెరిఫైడ్ అడల్ట్స్ కోసం మాత్రమే. వయసు నిర్ధారణతోనే ఈ ఫీచర్స్ యాక్సెస్ లభిస్తుందని వెల్లడించారు.చాట్‌జీపీటీ అడల్ట్ మోడ్.. వినియోగం కేవలం పెద్దలకు మాత్రమే. దీనిని మైనర్లు ఉపయోగించుకుండా ఉండేందుకు సంస్థ తగిన ఏర్పాట్లు చేస్తోంది. కంపెనీ ప్రస్తుతం ఎంపిక చేసిన దేశాలలో వయస్సు అంచనాకు సంబంధించిన విషయాలను ధృవీకరించడానికి టెస్టింగ్ జరుగుతోందని సిమో పేర్కొన్నారు.అడల్ట్ మోడ్ ఖచ్చితంగా ఆప్ట్-ఇన్ అయి ఉంటుంది. డిఫాల్ట్‌గా స్విచ్ ఆఫ్ చేయబడి ఉంటుంది.

## బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం

- ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి
- జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడి



**ఆర్మూర్, డిసెంబర్ 15 ( జనంసాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికలు మూడవ విడత నిర్వహణలో భాగంగా బందోబస్తు ఏర్పాట్లపై ఆర్మూర్ డివిజన్ పోలీస్ అధికారులతో ఆర్మూర్ ఏసిపి కార్యాలయంలో జిల్లా పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు.ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని తెలియజేశారు.ప్రధానంగా ఆర్మూర్ డివిజన్ పరిధిలో గల సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైనటువంటి పోలింగ్ స్టేషను గుర్తించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.ఎన్నికల సమయం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ప్రతీ పోలింగ్ కేంద్రానికి నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి ప్రచారం,గుర్తులను ప్రదర్శించడం నివారించాలని అన్నారు. అవసరాన్ని బట్టి స్ట్రైకింగ్ ఫోర్స్ సేవలను వినియోగించుకొని గుంపులను చెదర గొట్టాలని అన్నారు.ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం, మరే ఇతరములు అక్రమ రవాణా జరగడానికి విలులేకుండా అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.విలేజ్ పోలీసు అధికారులు ఆయా గ్రామలపై నిఘా ఉంచి, ముందస్తు సమాచారాన్ని సేకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని అధికారులకు తెలియజేసారు.ఎన్నికల రోజు సిబ్బంది తెల్లవారుజామునే తమకు కేటాయించి నటువంటి పోలింగ్ బూతు యందు సక్రమమైన విధులు నిర్వహించాలని,ఎన్నికల తర్వాత ఓట్ల లెక్కింపు కార్యక్రమం మొత్తము పూర్తి అయ్యేవరకు ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని,ఎన్నికల నియమావళిని తూ.చా తప్పకుండా పాటించే విధంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని విధినిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్న అట్టి సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో ఆర్మూర్ ఏసిపి జె. వెంకటేశ్వర్ రెడ్డి. ఆర్మూర్ ఎస్.హెచ్.ఓ పి. సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ రూరల్ సిఐ కె. శ్రీధర్ రెడ్డి,భీంగల్ సిఐ పి. సత్యనారాయణ గౌడ్,బాల్కొండ ఎస్ఐ కె. శైలేందర్,నందిపేట్ ఎస్ఐ జి. శ్యామ్ రాజ్,వేల్పూర్ ఎస్ఐ బి.సంజీవ్, ఎస్ఐ ముప్కాల్ కిరణ్ పాల్, మెండోరా ఎస్ఐ సుహాసిని, భీంగల్ ఎస్ఐ కె. సందీప్,మోర్తాడ్ ఎస్ఐ బి.రాము,కమర్పల్లి ఎస్ఐ జి.అనీల్ రెడ్డి,ఏర్గట్ల ఎస్ఐ పి.రాజేశ్వర్, మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

- నూతన సర్పంచులకు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి హితవు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 15(జనంసాక్షి):** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచులు అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ హితవు పలికారు. మానకొండూర్ నియోజకవర్గవ్యాప్తంగా జరిగిన రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యులు సోమవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చినప్పుడు వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రజల మద్దతుతో గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యులు ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడాలన్నారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీరు, విద్యుత్ వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. గ్రామాభివృద్ధితోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించినప్పుడు వారి అభిమానాన్ని చూరగొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు రెండు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే కైవసం చేసుకున్నారని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లబ్ధిపొందడం వల్లనే ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పట్టంగట్టారన్నారు. ఇదే హవా మూడో విడత ఎన్నికల్లోనూ కొనసాగుతోందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం మెండని, అందుకే పలు గ్రామాల్లో ఇద్దరు, ముగ్గురు కాంగ్రెస్ మద్దతుదారులు పోటీ పడ్డారని, ఈ కారణంగానే ఆయా గ్రామాల్లో గెలుపు చేజారిపోయిందని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, ఇల్లంతకుంట, బెజ్జంకి, మానకొండూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, నందగిరి రవీంద్రచారి, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు శ్రీగిరి రంగారావు, ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె అయిలయ్య, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గోపు మల్లారెడ్డి, కుంట రాజేందర్ రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాలు అభివృద్ధి కావాలంటే
## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

**సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాంతారావు**



**బిచ్కుంద, డిసెంబర్ (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. మద్నూర్ మండల కేంద్రము, జుక్కల్ మండలం పెద్ద గుల్ల మరియు తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికార పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేరును ఉపయోగించి కొంత మంది వ్యక్తులు ఓట్లు అడుగుతున్నారని, అటువంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ అధికారికంగా బలపర్చిన అభ్యర్థికే మద్దతీవ్వాలని కోరారు.

## మురళి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 15 (జనంసాక్షి) :** వేములవాడ అర్బన్ మండలం చింతల్ తానా సర్పంచ్‌గా ఎన్నికై, గుండెపోటుతో చనిపోయిన బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి చెర్ల మురళి కుటుంబాన్ని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం పరామర్శించారు. మురళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడుతూ మురళి కుమారుడు దుబాయిలో పనిచేస్తున్నారని ఆయనకు దుబాయిలో అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మృతుని కుమార్తె బీఫార్మసీ చేస్తుందని, ఆమెపై చదువుల కోసం తమ పార్టీ అండగా నిలబడుతుందని, ఎం ఫార్మసీ చదివితే తమ మెడికల్ కాలేజీలో చదివించనున్నట్లు వేములవాడ బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్, చల్మెడ లక్ష్మీనరసింహారావు తెలిపారు. మురళి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమకు అన్ని విధాల ఆదుకుంటానని చెప్పిన కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అర్బన్ మండల సెస్ డైరెక్టర్ హరి చరణ్ రావు, మాజీ వైస్ ఎంపీపీ ఆర్సి రావు,నాయకులు మనోహర్ రెడ్డి, కొండూరు రవీందర్రావు, రాఘవరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## రెండేళ్ల రేవంత్ పాలన శూన్యం

### హామీల అమలులో పూర్తిగా విఫలం

- కాంగ్రెస్‌కు సర్పంచ్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- కుల సంఘ భవనాలు కట్టించామని అబద్ధాలు చెబుతుండ్రు
- ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నాయకులు



**నిజామాబాద్ బ్యూరో, డిసెంబర్ 15 (జనంసాక్షి):** రెండేళ్ల పరిపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసింది శూన్యమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. వేల్పూర్‌లోని తన నివాసంలో మానాల గ్రామం, వివిధ తండాల నుంచి నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హామీల అమలులో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. రెండేళ్లలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మానాలను స్ఫూర్తిగా తీసుకుని బాల్కొండ నియోజకవర్గంలోని మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఓడించి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్యారంటీ కార్డులు తీసుకుని ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగిన కాంగ్రెస్ నాయకులే ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లో ఓట్లు వేయమని మళ్లీ ఇంటికి వస్తున్నారని అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, ఆసరా పెన్షన్‌ను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచుతామని, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15,000 రైతు భరోసా, వడ్లకు రూ.500 బోనస్, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇలా అనేక హామీలు ఇచ్చి, ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఇప్పుడు మళ్లీ అదే నాయకులు సర్పంచ్ ఎన్నికల్లో ఓట్ల కోసం ముందుకు వస్తున్నారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, చేసిన మోసాన్ని గుర్తుచేసుకుని ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. రాష్ట్రంలో అధికారంలో మేమే ఉన్నాం, మాకు ఓటు వేయకుంటే మీ గ్రామ పంచాయతీలకు నిధులు రావని కాంగ్రెస్ నాయకులు భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి 14వ ఫైనాన్స్ ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 15వ ఫైనాన్స్ ద్వారా నేరుగా నిధులు వస్తాయని, ఏ పార్టీ సర్పంచ్ అయినా వాటిని ఆపడానికి ఎవరికీ అధికారం లేదని, ప్రజలు దీన్ని గమనించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరుగుతూ తమ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించండి, నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని చెబుతున్నారని, కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులు ఏమిటని, కనీసం ఒక్క పనైనా చేశారా అని ప్రశ్నించారు. కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు చేస్తామని చెబుతూ ఎన్నికల కోసం కుల సంఘ సభ్యులను మభ్యపెట్టాలని కాంగ్రెస్ చూస్తోందని విమర్శించారు. గడిచిన రెండేళ్లలో నియోజకవర్గంలో ఎన్ని కుల సంఘ భవనాలు కట్టించారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో బాల్కొండలో వందలాది కుల సంఘ భవనాలు కట్టించామని, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మంజూరైనవాటిని ఈ ప్రభుత్వం క్యాన్సిల్ చేసిందని అన్నారు. అనేక సార్లు కోరినా పట్టించుకోలేదని, మా హయాంలో కట్టి పూర్తైనవాటికి కూడా బిల్లులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇప్పుడు కుల సంఘ భవనాలు ఇస్తామని సర్పంచ్ ఎన్నికల కోసం మాత్రమే ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు నమ్మి మరోసారి మోసపోవద్దని బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మానాలా గ్రామం, దేగవతాండాలో ప్రజలు హామీలు అమలు చేయని కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఓడించి, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించిన స్ఫూర్తిని మిగతా గ్రామాల ప్రజలు కూడా చూపాలని, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చేతులెత్తి నమస్కరిస్తూ విజ్ఞప్తి చేశారు.



### లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సీనియర్ సిటిజన్‌లు సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సిటిజన్‌ల లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించిన జిల్లా జడ్జి సునీత కుంచాల

**పెద్దపల్లి,డిసెంబర్ 15(జనంసాక్షి) :** లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సీనియర్ సిటిజన్ లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ పెద్దపల్లి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ప్రతి సోమవారం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ప్యానల్ న్యాయవాదులు ఎస్.అశోక్ కుమార్, లీగల్ వాలంటరీ ఎస్.మల్లేష్ అందుబాటులో ఉంటారని, పిల్లలతో సమస్యలు ఎదుర్కొంటున్న వృద్ధ తల్లిదండ్రులు ఇక్కడ తమ ఫిర్యాదులు నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, ఎఫ్ఆర్ఓ స్వర్ణలత, న్యాయ సేవ ప్రాధిక సంస్థ అధికారు లు శేఖర్, అశోక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**జీహెచ్ఎంసీలో డివిజన్ల పెంపును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైదరాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన వినయ్ కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీన్ని అత్యవసరంగా విచారించాలని న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని వినయ్‌కుమార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.**

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే ఎన్నుకోండి

- కాంగ్రెస్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యం
- సన్న బియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్‌కే



**పెద్దపల్లి,డిసెంబర్ 15(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలంలోని నిట్టూరు, పెద్దకల్వల, అప్పన్నపేట గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించి గడపగడపకు వెళ్తూ బ్యాలెట్ నమూనాను చూపిస్తూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ తోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు మరింత అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చునని దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకేదక్కుతుందన్నారు. పెద్దపల్లి మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు ఆర్థికంగా వొడిదుడుకులను ఎదుర్కొంటూనే అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు ఉచిత కరెంటు, రెండు లక్షల రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పథకం 10 లక్షలకు పెంపు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ, సన్నవడ్లపై బోనస్, కటింగ్ లు లేకుండా వడ్ల కొనుగోలు, మానేరు నుండి ఇసుక పంపిణీ సులభతరం, లారీలో ఇసుక తరలింపు నిలిపివేసి భూగర్భజలాల పెంపుకు రైతులకు పరోక్ష సహాయం వంటి ఎన్నో ప్రజా ఉపయోగ పనులను తాము అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించి ఎన్నికల్లో తాము బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. బస్సు డిపో ఏర్పాటు పెద్దపల్లి ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన యువ వికాస పబ్లిక్ మీటింగ్‌కు వచ్చిన సందర్భంగా పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటుకు జీవో ఇచ్చారని తెలిపారు. బస్సు డిపో నిర్మాణం కోసం భూమి పూజ చేసి పనులు ప్రారంభించుకోవడం జరిగింది. 6 నుండి 8 నెలల్లో డిపో పూర్తి చేసి, ఇక్కడి నుండే బస్సులు నడిచే విధంగా ప్రణాళిక చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్లు, గ్రామ ప్రజలు, మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రేపు మూడో విడత పోలింగ్

- సమన్వయము తో నిర్వహించండి
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 15 (జనం సాక్షి):** మొదటి, రెండవ విడత ఎన్నికలను ప్రశాంతం గా నిర్వహించినట్లే. మూడవ విడత ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులు సమన్వయముగా పని చేసి పూర్తి చేయాలనీ.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.ఈ నెల 17 వ తేదీన మూడవ విడత ఎన్నికలు జరిగే పరిగిమండలం కుల్కచర్ల, పూడూర్, చౌడాపూర్, దోమ, మండలాల్లో.చేయాల్సిన ఏర్పాట్ల పైన అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్,సుధీర్‌నీ కలెక్టర్ హర్ష్ చౌదరి మండల స్పెషల్ అధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్‌ల తోలి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాలునుండి మీటింగ్ ద్వారా రివ్యూ చేసి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పోలింగ్, కౌంటింగ్ మొదలగు అంశాల మీద దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో మెటీరియల్ పంపిణి ప్రణాళిక ప్రకారం సరిగ్గా జరగాలన్నారు. పిఎస్ వారీగా మెటీరియల్ నెంబర్ ప్రకారం ఉండాలని,పోలింగ్ అధికారులకు నాణ్యమైన ఆహారం, తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. కౌంటింగ్ వేగవంతం అయ్యేందుకు సరిపడే సిబ్బందిని ఏర్పాటుచేసుకోవాలన్నారు.ఉదయమే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకోవాలని, పోలింగ్ స్టేషన్ వారీగా మెటీరియల్ చెక్ చేసుకొని తీసుకోవాలని, మధ్యాహ్నం భోజనం అనంతరం పోలింగ్ స్టేషన్ లకు చేరుకోవాలన్నారు.పోలింగ్ రోజేఉప సర్పంచ్ ఎన్నిక కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.పోలింగ్, కౌంటింగ్ కి సంబంధించిన రిపోర్ట్ లన్ని నిర్దేశిత సమయంలో ఫార్మాట్ లకు తగ్గట్టుగా టి పోల్‌లో సబ్మిట్ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితిలో రీ కౌంటింగ్ చేయరాదని, సరియైన పద్ధతి లో కౌంటింగ్ జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.నోడల్ అధికారులు, ఆర్డీఓ, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులు, మండల స్పెషల్ అధికారులు, జోనల్ ఆఫీసర్‌లు, ఆర్వోలు, పిఓలు, ఓపిఓ లు, మైక్రో అబ్జర్వర్‌లు, వివిధ శాఖలకి చెందిన అధికారులు సమన్వయ ముగా పని చేసి మూడవ విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఓ శ్రీనివాస్, డిఆర్ఓ మంగీ లాల్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, నోడల్ అధికారులు ఉన్నారు.

## రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని "పొర్లు దండాలు"

- కిసాన్ నగర్ డివిజన్లోని సమస్యలు పరిష్కరించాలని ఎన్నోమార్లు వినతిపత్రం ఇచ్చిన చలనం లేదు.
- బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్




**కరీంనగర్, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** కరీంనగర్ స్మార్ట్ సిటీ పరిధిలోని మూడో డివిజన్ కిసాన్ నగర్ ప్రాంత అభివృద్ధి కోసం, డివిజన్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ ల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజున స్థానిక బిజెపి నేత, కంటెస్టెడ్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ నిరసన కార్యక్రమం చేపట్టారు. కిసాన్ నగర్ బీడీ కంపెనీ నుండి మీ సేవ వరకు సోమిడి వేణు మా ప్రాంతాన్ని అభివృద్ధి చేయండి అని పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమిడి వేణు మాట్లాడుతూ... కిసాన్ నగర్ ప్రాంత అభివృద్ధి విషయంలో గత ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. జిల్లా అధికారులకు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేకమార్లు ఇక్కడి ప్రాంత అభివృద్ధి కోసం వినతి పత్రాలు సమర్పించిన సమస్యలను పరిష్కరించుదా మన్న ఆలోచన చేయలేదన్నారు. డివిజన్ ప్రాంత ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. డివిజన్లో కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. వర్షాకాలంలో ఇక్కడి ప్రాంతంలోని రోడ్లు, మురికి కాలువల పరిస్థితి దారుణంగా మారి, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారవుతున్నాయన్నారు. ఎన్నోమార్లు వినతి పత్రాలు సమర్పించిన ఫలితం లేకపోవడంతోనే , బిజెపి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలు తీవ్రంగా ఇక్కడి ప్రాంతంలో ఎదుర్కొంటున్న ప్రధాన రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించి డివిజన్ ప్రజలకు న్యాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి నాయకులు మెంగని రాజయ్య, బండిపల్లి సంజీవ్, గాలి సురేష్, కళ్యాణ్, సుమన్ చాడ ఆనంద్ మేకల సాయి, కార్యకర్తలు, స్థానిక డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా ఎరువులు

- ఎరువుల గిడ్డంగి ఆకస్మికంగా తనిఖీ : కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ బ్యూరో, జనంసాక్షి డిసెంబర్ 15 :** జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. డిచ్పల్లి మండలం సుద్దులం సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిడ్డంగిలో అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలుకరించి, సరిపడా ఎరువులు అందుతున్నాయా అని ఆరా తీశారు. యాసంగి సీజన్ కు సంబంధించి జిల్లాకు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని, క్రమం తప్పకుండా ఎరువుల స్టాక్ జిల్లాకు వస్తోందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో ఎరువుల కొరత తలెత్తకుండా చూస్తామని భరోసా కల్పించారు. ఈ మేరకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. రైతులు ఒకేసారి ఎరువులను కొనుగోలు చేసి అట్టిపెట్టుకోకుండా, విడతల వారీగా తమ అవసరాలకు అనుగుణంగా ఎరువులు తీసుకోవాలని హితవు పలికారు. దీనివల్ల ఇతర రైతులకు కూడా ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు. నానో యూరియా వాడకం పై రైతులకు అవగాహన కల్పించాలని, డ్రోన్ వినియోగం ద్వారా ఎరువుల వాడకం గురించి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎరువులు పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలని, ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు తావు కల్పించే వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కాగా, ఖరీఫ్ సీజన్ లో తమకు పూర్తి స్థాయిలో ఎరువులు లభించాయని, ఎలాంటి కొరత తలెత్తలేదని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, తహసిల్దార్ సతీష్, స్థానిక అధికారులు ఉన్నారు.

# ప్రియుడితో భర్తను హత్య చేయించిన భార్య

- ప్రమాదంలో చనిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం
- ఇంట్లోకి భర్త శవాన్ని తీసుకురావడానికి నిరాకరించిన భార్య
- చౌడపూర్‌లో భార్యను అనుమానించిన గ్రామస్తులు
- ఆడబిడ్డలు నిలదీయడంతో బయటపడిన హత్యనిజం
- ప్రియుడి ఇంటి ముందు శవంతో బైఠాయించిన బంధువులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 15 (జనం సాక్షి):** వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన సంఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో జరిగింది. పరిగి సీఐ శ్రీనివాస్ రెడ్డి కుల్కచర్ల పోలీసులు గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చౌడపూర్ గ్రామానికి చెందిన కర్నే రత్నయ్యను అదే గ్రామానికి చెందిన దాసరి రామకృష్ణ ట్రాక్టర్ తో ఢీ కొట్టి హత్య చేశాడు. ఈ హత్యను రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఈ మేరకు కుల్కచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్నే కవితతో దాసరి రామకృష్ణ కు వివాహేతర సంబంధం ఉంది. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని ప్రియుడు రామకృష్ణతో కవిత హత్యకు పతకరచన చేశారు. దాసరి రామకృష్ణ బంధువుల దగ్గర ఉన్న ట్రాక్టర్ ను అవసరం ఉందని తీసుకొని వచ్చి హతుడు కర్నే రత్నయ్య పొలం పనికి వెళుతుండగా దారి మధ్యలో ట్రాక్టర్ తో వెంబడించి ఢీ కొట్టి హత్య చేశాడు. ఈ విషయం ప్రియురాలు కవితకి చెప్పి యాద ప్రకారం ప్రైవేట్ కంపెనీలో పనిచేయడానికి వెళ్లారు. ఈ నోట ఆ నోట గ్రామస్తులకు కవితకు తెలియడంతో తన భర్త ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు తెలుస్తుందని పోస్టుమార్టం పూర్తి చేసి ఇస్తే అంత్యక్రియలు చేసుకుంటామని పోలీసులు గ్రామస్తుల ముందు కవిత నమ్మ బలికిది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని పంచనామ నిర్వహించి పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించారు. అయితే కవిత భర్త కర్నే రత్నయ్య శవాన్ని ఇంటిముందు పెట్టడానికి నిరాకరించింది. వాకిట్లో నుంచి శవాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేయాలని పట్టుబట్టింది. దీంతో కవితపై అనుమానం ఉన్న ఆడబిడ్డలు గ్రామస్తులు నిలదీశారు. ఆడబిడ్డలు కవితపై చేయి చేసుకోవడంతో హత్యనిజం బయటికి వచ్చింది. తన భర్త కర్నే రత్నయ్యను ప్రియుడు దాసరి రామకృష్ణ ట్రాక్టర్ తో ఢీ కొట్టి హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు బంధువులు కలిసి కర్నే రత్నయ్యను హత్య చేసిన నిందితుడు దాసరి రామకృష్ణ ఇంటి ముందు శవాన్ని పెట్టి ఆందోళనకు దిగారు. ఈ విషయం కుల్కచర్ల పోలీసులకు తెలియడంతో పరిగి సిఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చౌడపూర్ గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమక్షించారు. కవిత రామకృష్ణులు కలిసి పథకం ప్రకారం హత్య చేశారని నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. పరిగి సీఐ శ్రీనివాసరెడ్డి బాధితుడు బంధువులకు నచ్చజెప్పి అంత్యక్రియలు పూర్తి చేసే ప్రయత్నం చేశారు. కర్నే రత్నాయన హత్య చేసిన నిందితులపై చర్య తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గొడవ సర్దుమనిగింది. హతుడు కి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కర్ని రత్నయ్య తమ్ముడు దేవయ్య ఫిర్యాదు మేరకు కుల్కచర్ల పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు రామకృష్ణను పోలీసుల రిమాండ్ కు తరలించారు.

## రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో డ్రోన్ల నిషేధం

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదిని పురస్కరించుకొని ఈ నెల 17న నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆంక్షలు విధించడం జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని సైబరాబాద్ పోలీస్ బాస్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ మాసంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరానికి వచ్చి కొద్ది రోజులు బస చేయడం విధితమే. ఈ నేపథ్యంలో ఈ నెల 17 నుండి 22వ తేదీ వరకు బొల్లారం అల్వాల్ పరిధి రాష్ట్రపతి నిలయానికి ఆమె విచ్చేస్తున్నారని సిపి పేర్కొన్నారు. ఈ క్రమంలో అల్వాల్ పోలీస్ స్టేషన్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో రిమోట్ కంట్రోల్ డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ ఎయిర్ క్రాఫ్టులు ఆకాశం లో ఎగురవేయడానికి, అనుమానాస్పదంగా వ్యవహరించడానికి ఎట్టి పరిస్థితులలోనూ అవకాశం లేదని సిపి అవినాష్ మహంతి స్పష్టం చేశారు. కాబట్టి అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధి, గజబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలు పోలీస్ అధికారుల సూచనలను గమనంలో పెట్టుకొని వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.



## జిల్లాలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై కఠిన చర్యలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 15 (జనం సాక్షి) :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ (పీసీపీఎన్‌డీటీ) సమావేశంలో ప్రైవేట్ వైద్య సంస్థల్లో గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ నిర్ధారణ చట్టం (పీసీపీఎన్‌డీటీ) నిబంధనల అమలుపై సమగ్రంగా చర్చ జరిగింది. జిల్లాలో స్కాన్లు నిర్వహిస్తున్న ప్రతి ప్రైవేట్ వైద్య సంస్థ తప్పనిసరిగా నమోదు, పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ లేదా పీసీపీఎన్‌డీటీ చట్టం ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులు, సంస్థలపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సమావేశంలో హెచ్చరించారు. రికార్డుల నిర్వహణ, ప్రమాణాలు, పరికరాలు, మానవ వనరులు, నమోదు కోసం అవసరమైన పత్రాలపై వైద్య సంస్థలకు ఇవ్వాల్సిన సూచనలను కమిటీ నిర్ణయించింది. సమావేశంలో కొత్తగా వచ్చినవి, పునరుద్ధరణకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి ఆమోదించి తదుపరి ఆదేశాల కోసం జిల్లా కలెక్టర్‌కు పంపారు. అలాగే పీసీపీఎన్‌డీటీ, సరోగసి, గర్భస్రావానికి సంబంధించిన చట్టపరమైన అంశాలపై కూడా విస్తృతంగా చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సూచనలు చేసింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఉమా గౌరి, కమిటీ కన్వీనర్‌గా పాల్గొనగా, డా. స్వర్ణలత (గైనకాలజిస్ట్), జన్యు నిపుణులు, కార్యక్రమాధికారులు డా. గీత, డా. పవన్, డిప్యూటీ డెమో వసంత రెడ్డి, సంబంధిత విభాగాల సిబ్బంది హాజరయ్యారు.

# అనుమతులు లేకుండా మట్టి దందా

- నమిశ్రీ అక్రమాలను అడ్డుకోవాలి
- మైనింగ్ అధికారుల తీరుపై మండిపాటు
- అధికారులు కుమ్మక్కై మట్టి మాఫియాకు సహకరిస్తున్నారు
- తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి



**హయత్ నగర్, డిసెంబర్ 15 (జనం సాక్షి)** ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్ సర్వే నంబర్ 38లో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా "నమిశ్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ సంస్థ చేస్తున్న అక్రమ మట్టి త్రవ్వకాలపై భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ సమితి భగ్గుమంది. అక్రమాలను అరికట్టాలని మైనింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ, ఆటోనగర్‌లోని నిర్మాణ స్థలం వద్ద సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి అధ్యక్షతన భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి హాజరైనారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ నిర్మాణ సంస్థ, అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మన్సూరాబాద్ రెవెన్యూ పరిధిలోని ఆటోనగర్ సర్వే నంబర్ 38లో సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఈ నిర్మాణ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ త్రవ్వకాలు చేపట్టిందని దాదాపు 88,191 మెట్రిక్ టన్నుల మట్టిని అక్రమం గా త్రవ్వినట్లు సాక్షాత్తు మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్లే నిర్ధారించినా ఇప్పటి వరకు కఠిన చర్యలు లేకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ జిహెచ్ఎంసి అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యం వల్లే ఈ మట్టి మాఫియా రెచ్చిపోతోందని వారు ఆరోపించారు. మైనింగ్ అధికారులు నోటీసులు ఇచ్చామంటూ కాలయాపన చేస్తున్నారని 15 రోజుల తర్వాత డిమాండ్ నోటీసు ఇస్తామని చెబుతూ, ఈలోగా దొంగచాటుగా మట్టిని తరలించుకోవడానికి పరోక్షంగా సహకరిస్తున్నారని వారు అన్నారు. గతంలో విధించిన లక్షల రూపాయల జరిమానాను కూడా వసూలు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదంటే, దీని వెనుక ఎంత పెద్ద లాబీయింగ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. మైనింగ్ వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని పోలీసులు, నోటీసుల పేరుతో మైనింగ్ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలం వెల్లదీస్తున్నారని వారు మండిపడ్డారు. తక్షణమే సర్వే నంబర్ 38లో జరుగుతున్న అక్రమ త్రవ్వకాలను నిలిపివేయాలని, అక్రమ మట్టి రవాణాకు పాల్పడుతున్న వాహనాలను సీజ్ చేయాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన "నమిశ్రీ" సంస్థ నుండి రావాల్సిన జరిమానాను వడ్డీతో సహా వసూలు చేయాలని, బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నిర్మాణ సంస్థ యాజమాన్యంపై, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేసి మైనింగ్ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు తెలిపారు. అక్రమ రవాణాను మా కార్యకర్తలే అడ్డుకుంటారని శాంతియుతంగా చేస్తున్న ఈ నిరసనను అలుసుగా తీసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, ఏఐటీయూసీ ఎల్ బి నగర్ నియోజకవర్గ అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్, ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, కర్నె సుజాత, జిల్లా కార్యవర్గ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, హయత్నగర్ మండల ఏఐటీయూసీ కార్యదర్శి గోల్కొండ నాగరాజు, వివిధ శాఖ కార్యదర్శులు పారిజాత, అరుణ, యమున, సౌజన్య, కళ్యాణి, సౌజన్య, అంకన్న, ఉపేందర్, సీపీఐ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు తెలంగాణ ఉద్యమం

# తరహాలో ముందుకు సాగుతాం

- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర




ఖమ్మం (జనం సాక్షి) బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని తమ పార్టీ గట్టిగా పోరాడుతున్నదని, ఇందుకోసం ప్రైవేట్ మెంబర్ బిల్లు కూడా ప్రవేశపెట్టడం జరిగిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.అన్ని రంగాలలో వెనుకబడిన బీసీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు తన పదేళ్ల పాలనలో చిత్తశుద్ధితో కృషి చేశారని,రిజర్వేషన్స్ పెంపుదలకు కట్టుబడి ఉన్నారన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే 2014 జూన్ 14వ తేదీన చట్టసభల్లో మహిళలు,ఓబీసీలకు 33 శాతం చొప్పున రిజర్వేషన్స్ కల్పించాలని కోరుతూ కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి సిఫార్సు చేయడాన్ని ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం,బీసీ జేఏసీల ఆధ్వర్యాన సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం ఏర్పాటైంది.దీనికి సంఘీభావం ప్రకటిస్తూ ఎంపీ రవిచంద్ర,మాజీ వీ.శ్రీనివాస్ గౌడ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ నాయకత్వాన జరిగిన మహోద్యమం మాదిరిగానే బీసీల న్యాయమైన హక్కులు, రాజ్యాధికారంలో సముచితమైన వాటా కోసం బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు.కుల గణనలో బీసీల జనాభాను తక్కువ చేసి చూపడం, కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడం,ఇతర 56 అంశాల గురించి ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ తమ పార్టీ ఉద్యమించిందన్నారు.దీనిని మరింత ఉధృతం చేయడంలో భాగంగానే కేసీఆర్ మార్గనిర్దేశనంలో పార్లమెంటులో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.కాంగ్రెస్ నాయకులు, రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన 432 హామీలను నెరవేర్చకుండా "డైవర్షన్ పాలిటిక్స్"కు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు.తమ పార్టీ ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్,అటు కేంద్రంలోని బీజేపీ పాలకులు మద్దతు ప్రకటించడం అనివార్యమని,లేనిపక్షంలో వారు ద్రోహులుగా మిగిలిపోక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి "ఓట్ చోర్"అంశంపై ఉన్న ఆసక్తి బీసీ రిజర్వేషన్లు పెంచే విషయంలో ఇసుమంత కూడా చూపకపోవడం శోచనీయమన్నారు.కాంగ్రెస్, బీజేపీలు తల్చుకుంటే బీసీ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందడం సునాయాసంగా జరుగుతుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.ఆ పార్టీలకు బీసీలంటే చులకన భావం ఉన్నందునే తాము అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి గురవుతున్నామని ఎంపీ వద్దిరాజు ఆవేదన చెందారు.బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన బిల్లు పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు వారి అధి నాయకత్వాలపై వత్తిడి పెంచి ఆమోదం పొందేలా చూడాలని ఎంపీ రవిచంద్ర కోరారు.దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారంలో తమకు న్యాయమైన వాటా దక్కడం లేదన్న కడుపు మంటతో ఉన్నారని,కోపంతో రగిలిపోతున్నారని ఆయన చెప్పారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో 42%, చట్టసభల్లో మహిళలతో పాటు 33 శాతం చొప్పున రిజర్వేషన్స్ అమలునకు కాంగ్రెస్, బీజేపీలు ముందుకు రానట్టయితే ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని,మాడిమసైపోవడం ఖాయమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.

# జీహెచ్ఎంసీలో విలీనమైన మేడ్చల్‌లో డివిజన్లను పెంచాలి





### మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

**బోడుప్పల్-జనంసాక్షి :** జీహెచ్ఎంసీలో విలీనమైన మేడ్చల్ నియోజకవర్గం లో జనాభా విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు డివిజన్ల సంఖ్యను పెంచాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు వి.నరేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్నన్‌లకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. డివిజన్ల సంఖ్య పెరిగితే ప్రజాసమస్యలపై త్వరిత స్పందన, సమర్థవంత పాలన సాధ్యమవుతుందని వజ్రేష్ యాదవ్ తెలిపారు. మేడ్చల్ ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్ రెడ్డి, మేడ్చల్ మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మాజీ మేయర్లు తోటకూర అజయ్ యాదవ్, అమర్ సింగ్, పలువురు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూరగాయల సాగులో ఆధునిక మెళకువలపై మూడు రోజుల శిక్షణ

- ఇండో-ఇజ్రాయిల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఉద్యానశాఖ ప్రత్యేక కార్యక్రమం




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 15 (జనం సాక్షి) :** వాతావరణానికి అనుగుణమైన వంగడాల పెంపకం, కూరగాయల నిల్వ కాలం పెంపు, పంట కోత అనంతర నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో "కూరగాయల సాగులో మెళకువలు" అనే శిక్షణ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉద్యానశాఖ సంయుక్త సంచాలకులు రామలక్ష్మి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం సోమవారం నుంచి ఇండో%-%ఇజ్రాయిల్ వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని చెప్పారు.జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ వెజిటెబుల్స్ అండ్ ఫ్లవర్స్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కూరగాయల సాగులో నిపుణులైన ఇజ్రాయిల్ రాయబార కార్యాలయ వ్యవసాయ అటాచ్ మాషావ్ ఉరి రాబిన్ స్టీన్, డానియల్ హదాద్ (ఎంబసీ ఆఫ్ ఇజ్రాయిల్), జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీధర్‌తో పాటు దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి వచ్చిన 40 మంది ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంయుక్త సంచాలకులు రామలక్ష్మి మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం కూరగాయలు, పూలు సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మట్టిరహిత కూరగాయల సాగు, బిందు సేద్యం ప్రాముఖ్యత, నీటిలో కరిగే ఎరువుల వినియోగ విధానాలు, వాతావరణానికి తగిన వంగడాల ఎంపిక, కూరగాయలు ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట కోత అనంతర నిర్వహణ పద్ధతులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సుబ్బారావు, శేష్‌నాథ్‌లు పంట అనంతర యాజమాన్య పద్ధతులపై వివరించగా, కూరగాయల్లో నులిపురుగుల నివారణపై పీ.డి. మాణిక్యరావు సూచనలు చేశారు. భారత ప్రభుత్వ వ్యవసాయ ప్రాజెక్టు సంచాలకులు బ్రహ్మదేవ్ మాట్లాడుతూ కూరగాయల అంటుకట్టుట సూత్రాలు, కూరగాయలు-పూల సాగులో వివిధ రకాల వినియోగాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఉద్యానశాఖ సంచాలకులు శ్రీమతి యాస్మిన్ బాషా, ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని, ఈ శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ప్రజా అవసరాలకు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి


**నిజాంపేట్ డిసెంబర్ 15( జనం సాక్షి):** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ పరిధిలోని సర్వేనెంబర్ 191లో ప్రభుత్వ స్థలాలను ఇటీవల హైడ్రా చేపట్టిన చర్యల లోని స్థలం లో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా అందులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సోమవారం ఆకుల సతీష్ నేతృత్వంలో ఆంజనేయులుతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ప్రజావాణి నందు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా సర్వేనెంబర్ 329 గాజులరామారం ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 454 బాచుపల్లి 80,82,83,91,95 బాచుపల్లి ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగింది.

# ప్రజావాణి వినతులకు ప్రథమ ప్రాధాన్యం

### చందానగర్ డిసి శశిరేఖ




**శేరిలింగంపల్లి, డిసెంబర్ 15 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో నమోదయ్యే ఫిర్యాదుల విషయంలో ప్రథమ ప్రాధాన్యతతో వ్యవహరిస్తామని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ డి. శశిరేఖ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంపరిధి చందానగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా ఆయా విభాగాల అధికారులతో కలిసి ఆమె అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, యూబిడి, వెటర్నరీ, సానిటేషన్ విభాగాల అధికారులంతా ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదుల విషయంలో అప్రమత్తత ఉంటారని, వాటికి ప్రథమ ప్రాధాన్యతను కేటాయిస్తూ పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు ప్రజావాణి అత్యంత కీలకమైన వేదికగా ఆమె అభివర్ణించారు. ప్రజావాణి సందర్భంగా అర్జీదారులనుండి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణను నిర్వహించి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి వినతిని విధిగా ఆయా సర్కిళ్లలోని రికార్డులలో నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలాన ఉప కమిషనర్ అధికారులను ఆదేశించారు. కాగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 05 ఫిర్యాదులు, ఇంజనీరింగ్ విభాగం నుండి 04 ఫిర్యాదులు, రెవెన్యూ విభాగంనుండి ఒక ఫిర్యాదు అందిందని డిసి తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ విభాగం ఏఎంసి మణికరన్, చందానగర్ ఏసిపి నాగిరెడ్డి, వైద్యాధికారి రవి, ఎంటమాలజీ విభాగం నుండి ఇందిరాబాయి, యూబిడి విభాగం నుండి సమీరా, ఎలక్ట్రికల్ విభాగం నుండి లక్ష్మీ ప్రియ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# ప్రజలకు చేరువగా ఐఓబీ సేవలు

### తెల్లాపూర్‌లో నూతన బ్రాంచీ ప్రారంభం

**అమీన్‌పూర్ (జనంసాక్షి) :** బ్యాంకు వినియోగదారులకు, ప్రజలకు చేరువగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) సేవలు కొనసాగుతున్నాయని హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఐఏఎస్ అన్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ఐఓబీ నూతన బ్రాంచీని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్ఫరాజ్ అహ్మద్ ఐఏఎస్ మాట్లాడుతూ.. కస్టమర్లకు అనుకూలమైన సేవల్లో ఐఓబీ ముందుందని కొనియాడారు. తెల్లాపూర్‌లో బ్రాంచీ ప్రారంభం కావడంతో స్థానికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఓబీ చీఫ్ జనరల్ మేనేజర్, హైదరాబాద్ రీజయన్ ఎస్ గోపాల్, తెల్లాపూర్ బ్రాంచీ మేనేజర్ బి హరీశ్, బ్రాంచి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
16 డిసెంబర్ 2025

# క్రైస్తవ సోదరుల సమస్యలు పరిష్కరిస్తా

- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహ్మద్ అజారుద్దీన్
- వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకున్న మంత్రి



హైదరాబాద్ (జనంసాక్షి) : క్రైస్తవ సోదరుల సమస్యలను పరిష్కరిస్తానని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహ్మద్ అజారుద్దీన్ అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తాను క్రైస్తవ విద్యాసంస్థలో చదువుకున్నానని, అక్కడ ప్రతి సంవత్సరం క్రిస్మస్‌ను ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకునే అవకాశం లభించిందని గుర్తు చేశారు. స్నేహితులు, ఉపాధ్యాయులతో కలిసి ఐక్యత, స్నేహభావం నిండిన వాతావరణంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్న రోజులను ఆయన స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రిస్మస్ అనేది ఆనందం, సంతోషం, ఐక్యతతో పాటు ప్రేమ, శాంతి, కరుణ సందేశాలను సమాజానికి చాటి చెప్పే పవిత్ర పండుగ అని అన్నారు. బాక్సింగ్ డే సందర్భంగా క్రికెట్ మ్యాచ్‌లు ఆడటం తమ విద్యార్థి దశలో ఒక మధురమైన సంప్రదాయమని పేర్కొంటూ, అవి క్రమశిక్షణ, జట్టు సమన్వయం, క్రీడాస్ఫూర్తి, పరస్పర గౌరవం వంటి విలువలను నేర్పాయని తెలిపారు. క్రిస్మస్ పండుగ పేదల పట్ల సహానుభూతి, పంచుకునే స్వభావం, సమాజంలో పరస్పర సంబంధాలను బలపరచుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుందని మంత్రి అజారుద్దీన్ అన్నారు. ఇటువంటి పండుగలు సామాజిక సామరస్యతను పెంపొందిస్తూ, భారతదేశపు "వైవిధ్యంలో ఏకత్వం" అనే మహత్తర సంప్రదాయాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ, శాంతియుతంగా, సమగ్రంగా, ఆనందోత్సాహాలతో జరుపుకునేలా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. క్రైస్తవ సోదరసమాజానికి హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగ ప్రతి ఇంటికి శాంతి, సమృద్ధి, ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సమాజానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా రేవ్. డా. జాన్ వెస్లీ ప్రేరణాత్మక క్రైస్తవ సందేశాన్ని అందిస్తూ, ప్రేమ, శాంతి, కరుణ, సేవాభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, సమాజంలో సౌహార్దం, సద్భావాన్ని విస్తరించాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ సబిత, సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల సంఘ సభ్యులు లాల్ బహదూర్ శాస్త్రి, చిట్టి బాబు, శశిభూషణ్, మనోహరమ్మ, జాకబ్ రాస్ తదితరులు పాల్గొన్నారు. సెక్రటరియేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి ప్రేమ్, సెక్రటరీ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు రామ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సర్పంచ్‌లకు ప్రత్యేక న్యాయవిభాగం

- నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో కెటిఆర్



రాజన్నసిరిసిల్ల, డిసెంబర్ 15 (జనంసాక్షి) : రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని, వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన అభ్యర్థులను అభినందిస్తూ, వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. 'మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. వీరి కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం వీరికు అండగా నిలుస్తుంది, కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన్న ÷నాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేవలం రెండేళ్ల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రజల వ్యతిరేకత నుంచి కాంగ్రెస్‌ని కాపాడలేకపోయారని కేటీఆర్ అన్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు బెదరకుండా భయపడకుండా ప్రజలు మా పార్టీ నేతలు నిలబడ్డారని.. అందుకే అత్యధిక స్థానాల్లో ప్రతిపక్షంలో ఉన్న మా పార్టీని గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల నెలకొన్న తీవ్రమైన అసంతృప్తికి వ్యతిరేకతకు పంచాయతీరాజ్ ఎన్నికల ఫలితాలు నిదర్శనం అన్నారు. సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని 'ఏపూర్' గ్రామాన్ని ఉదాహరణగా తీసుకుంటూ.. అక్కడ చెక్ డ్యాంలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో ఆ గ్రామం దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిందని గుర్తుచేశారు. మనం చేసిన పనే మనకు శ్రీరామరక్ష అని హితవు పలికారు.

# బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబిన్

- పార్టీ కార్యాలయంలో బాధ్యత స్వీకరణ



న్యూఢిల్లీ, డిసెంబర్ 15 (జనంసాక్షి) : బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బీహార్ మంత్రి నితిన్ నబిన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర పార్టీ నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న తర్వాత నితిన్ నబిన్‌కు ఘన స్వాగతం లభించింది. అమిత్ షా, నడ్డా, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, రవిశంకర్ ప్రసాద్, ఢిల్లీ సీఎం రేఖ గుప్తా సహా వివిధ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి నబిన్ మాట్లాడుతూ.. నాలాంటి చిన్న కార్యకర్తకు పార్టీ చాలా పెద్ద బాధ్యత అప్పగించిందన్నారు. కార్యకర్తల నిబద్ధత, కృషిని పార్టీ గుర్తిస్తుందనడానికి ఇదే నిదర్శమని చెప్పారు. దివంగత నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కొడుకే నితిన్ నబీన్. కాయస్త కమ్యూనిటీకి చెందిన ఆయన.. ఇప్పటివరకూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో ఆయన తండ్రి నవీన్ కిశోర్ మరణంతో పాట్నా వెస్ట్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు బీజేపీ అధిష్టానం నితిన్‌ను నిలబెట్టింది. అప్పటి నుంచి గత రెండు దశాబ్దాల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తోన్న నబిన్ బీహార్ ప్రజా పనుల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్‌ను నియమించింది. త్వరలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగానూ ఆయనకు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు బీజేపీ వర్గాల సమాచారం.

# గాయకుడు బాలు అందరివాడు

- మన తెలుగువాడు కావడం గర్వకారణం
- స్వరసరస్వతిని స్మరించుకోవడం అదృష్టం
- బాలు విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు



హైదరాబాద్, డిసెంబర్ 15 (జనంసాక్షి) : ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమని, బాలును అభిమానింగా గౌరవించుకోవడం తెలుగువారిగా మనకంతా గర్వకారణమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతి లో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాల సుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. తన తండ్రి, ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం రాజకీయాలకు అతీతంగా ఉండేవారని ఎస్పీ చరణ్ గుర్తుచేసుకున్నారు. ఆయనకు అందరూ ఒకటే అని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ఆవరణలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చరణ్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, తెలుగు ప్రజలు, బాలు విగ్రహం ఏర్పాటుకు నాలుగేళ్లుగా కృషి చేసిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి అందరితో ఎంత స్నేహపూర్వకంగా ఉండేవారన్న దానికి ఈ కార్యక్రమం ఓ నిదర్శనమన్నారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

# వాసాలమర్రిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం

- అధికారుల తీరుపై బిఆర్ఎస్ అభ్యర్థి ఫిర్యాదు

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 15 (జనంసాక్షి) : తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో ఎన్నికల అధికారుల తీరుతో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఓడిపోయారు. వాసాలమర్రిలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఓటు మిస్ అయ్యింది. దీంతో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి సమాన ఓట్లు పోలయ్యాయి. దీంతో ఎన్నికల అధికారులు టాస్ వేసి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని విజేతగా ప్రకటించారు. వాసాలమర్రి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 1236 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 14 చెల్లనివి పోగా 3 నోటాకు పడ్డాయి. దీంతో పోటీలో నిలిచిన ఇద్దరు అభ్యర్థులకు చెరో 609 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండో వార్డులో 119 ఓట్లు పోలయ్యాయి. కానీ కౌంటింగ్ సమయంలో 118 బ్యాలెట్ పేపర్లను మాత్రమే ఎన్నికల అధికారులు చూపించారు. దీంతో ఆ ఓటు గురించి అడగ్గా ఎన్నికల అధికారులు పట్టించుకోలేదు. ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చాయని చెబుతూ.. టాస్ వేసి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని విజేతగా నిర్ణయించారు. అయితే మరుసటి రోజు కౌంటింగ్ జరిగిన రూమ్ దగ్గరకు వెళ్లి చూడగా.. గది కిటికీ బయట మిస్సైన ఓటు లభించింది. అందులో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి ఓటు నమోదు కావడం గమనార్హం. దీంతో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఉషారాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలని.. లభించిన ఓటు, అన్ని ఆధారాలతో జిల్లా కలెక్టర్,రాష్ట్ర ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదుచేశారు.

# వేధింపులపై కమిటీతో విచారణ

- మహిళా వర్సిటీ ప్రిన్సిపల్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 15 (జనంసాక్షి) : కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో లైంగిక వేధింపుల వ్యవహారం కలకలం రేపింది. అయితే ఈ ఆరోపణలపై వర్సిటీ ప్రిన్సిపాల్ లోక పావని స్పందించారు.మెస్ ఇంచార్జ్ వినోద్ తప్పు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసులతో పాటు యూనివర్సిటీ నుంచి ప్రత్యేక కమిటీని వేసి విచారిస్తున్నామన్నారు. విద్యార్థులపై వేధింపులు జరిగాయని స్థానిక పోలీసులు ఇప్పటికే సమాచారం అందించారని.. వేధింపులపై హాస్టల్ వార్డెన్‌కు, ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు గతంలో ఎలాంటి ఫిర్యాదులు చేయలేదని తెలిపారు. మెస్ ఇంచార్జ్ వినోద్‌పై గతంలో ఎలాంటి ఆరోపణలు లేవని అన్నారు. లైంగిక వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థులు ఎవరో తెలియదని చెప్పారు. ఫిర్యాదు చేసిన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోని టార్గెట్ చెయ్యమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సమస్యలుంటే మొదటగా తమకు చెప్పాలని కోరారు. విద్యార్థులు అభద్రతా భావానికి గురి కావద్దని సూచించారు. యూనివర్సిటీ, హాస్టల్ మెస్‌లో విద్యార్థుల వసతులకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. హాస్టల్‌లో తక్కువ స్థలంలో ఎక్కువ మంది విద్యార్థులు వసతి ఉంటున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు కొరత వేధిస్తోందని చెప్పారు. ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా వర్సిటీ ప్రిన్సిపాల్ లోక పావని కోరారు.

# బిజెపి నుంచి కూతురు సర్పంచ్

- బిఆర్ఎస్ నుంచి తండ్రి ఉప సర్పంచ్

జనగామ, డిసెంబరు15 (జనంసాక్షి) : రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో పలు ఆసక్తికర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా జనగామ జిల్లా వెంకిర్యాల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వెంకిర్యాలలో బీజేపీ బలపరిచిన గొల్లపల్లి అలేఖ్య సర్పంచ్‌గా విజయం సాధించగా, ఆమె తండ్రి గొల్లపల్లి పర్శయ్య ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నికల్లో వార్డు సభ్యులు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు సమానంగా మద్దతు పలకడంతో సర్పంచ్ అలేఖ్య తన ఓటును బీఆర్ఎస్ మద్దతుదారుడైన తన తండ్రి గొల్లపల్లి పర్శయ్యకు వేయడంతో బీఆర్ఎస్ ఉప సర్పంచ్‌గా తండ్రి, సర్పంచ్‌గా కుమార్తె గెలుపొందడం విశేషం.

# సర్పంచ్‌గా 140 ఓట్లతో గెలుపు

- వార్డు మెంబర్‌గా ఏకగ్రీవం
- ఉప్పుమడుగులో కొత్తకొంత రోజా రికార్డు



జగిత్యాల, డిసెంబరు15 (జనంసాక్షి) : రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్‌గా, వార్డు మెంబర్‌గా ఓ మహిళ విజయం సాధించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఉప్పుమడుగు సర్పంచ్‌గా, ఆరో వార్డు సభ్యురాలిగా కొత్తకొండ రోజా నవీన్ పోటీచేశారు. ఆరో వార్డుకు నామినేషన్లు రాకపోవడంతో రోజా ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆమె ఏకగ్రీవమయ్యారు. మరోవైపు ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో రోజా సర్పంచ్‌గానూ గెలుపొందారు. తన సమీప అభ్యర్థిపై 140 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. దీంతో అటు వార్డు మెంబర్‌గా, ఇటు సర్పంచిగా ఎన్నికై డబుల్ విక్టరీ సొంతం చేసుకున్నారు. అయితే ఆమె వార్డు మెంబర్ పదవికి రాజీనామా చేయనున్నారు. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్తా, మామలతో కోడళ్లు సవాల్ విసిరి విజయం సాధించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం శ్రీరామ్‌నగర్ సర్పంచ్ స్థానం బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. సర్పంచ్ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు, కోడలు నామినేషన్ వేయగా, కొడుకు తాళ్లపెల్లి శ్రీరామ్‌గౌడ్ విత్‌డ్రా చేసుకున్నారు. కోడలు తాళ్లపెల్లి రాధిక మాత్రం ఉపసంహరించుకోలేదు. బరిలో మామ తాళ్లపల్లి సత్యనారాయణగౌడ్, కోడలు రాధిక నిలిచారు. ఆదివారం ఎన్నికల్లో మామపై రాధిక 14 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం గన్‌శ్యాందాస్‌నగర్ గ్రామ సర్పంచ్ స్థానానికి అత్తాకోడళ్లు పోటీపడ్డారు. అత్త సూర నర్సమ్మపై కోడలు సూర రమ 18 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. గ్రామంలో మొత్తం 1906 ఓట్లు పోలవగా, సూర రమకు 874, సూర నర్సమ్మకు 856 ఓట్లు పోలయ్యాయి.

# టిమ్స్ హాస్పిటల్స్ పనుల్లో వేగం పెంచాలి

- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్




హైదరాబాద్, డిసెంబర్ 15 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు,రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సూచనల మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సోమవారం అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణం కలియ తిరిగిన స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ ఇంజనీర్లను, వర్క్ ఏజెన్సీని పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులకు, నిర్మాణ సంస్థకు పలు కీలక ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర ప్రభుత్వం టిమ్స్ హాస్పిటల్స్ నిర్మాణం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కృత నిశ్చయంతో ఉందని అన్నారు. అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ 12,14,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో సుమారు 1196 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని, ముఖ్యమంత్రి ఆర్ అండ్ బి శాఖ మంత్రి రెగ్యులర్ గా నిర్మాణ పురోగతిపై మానిటరింగ్ చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పూర్తి నాణ్యతతో స్ట్రక్చరల్ వర్క్ పూర్తయిందని, 95శాతం బ్రిక్ వర్క్, ప్లాస్టరింగ్ పూర్తయిందని, 60శాతం , ఫ్లోరింగ్, పెయింటింగ్ వర్క్స్ 50శాతం మేర పూర్తయి వేగంగా పనులు జరుగుతున్నాయని అన్నారు. మొత్తంగా టిమ్స్ అల్వాల్ పనులు 70శాతం శాతం పూర్తయ్యాయని చెప్పారు. 2026 మార్చి చివరి నాటికి అన్ని రకాల పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లను, వర్క్ ఏజెన్సీని స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్ ఆదేశించారు. ఆరోగ్య శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అన్నారు. రెగ్యులర్‌గా ఫీల్డ్ విజిట్ చేస్తానని అందరూ అలెర్ట్‌గా పనిచేస్తూ..ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బి సిఈలు రాజేశ్వర్ రెడ్డి,లింగారెడ్డి,పలువురు ఈ.ఈ, డి.ఈ లు ఫీల్డ్ ఇంజనీర్లు, ఏఈఏ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

# కామారెడ్డి జిల్లాలో దారుణం

- గెలిచిన సర్పంచ్ తమ్ముడి దాష్టీకం
- ఓడిన సర్పంచ్ అభ్యర్థి తదితరులపై ట్రాక్టర్‌తో దాడి
- దాడిలో పలువురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు



కామారెడ్డి, డిసెంబర్ 15 (జనంసాక్షి) : తెలంగాణలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. అప్పుడే కక్షలు కార్పణ్యాలు బయటపడుతున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమాతో బరిలోకి దిగిన అనేక మంది ఆశలు అడియాశలుగా మిగిలిపోయాయి. సర్పంచ్ ఎన్నికల కోసం భారీగా డబ్బులు వెచ్చించి ప్రచారాలు నిర్వహించారు. ఓటర్లను ఆకర్షించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఇంత చేసినా కూడా కొంతమందిని మాత్రమే సర్పంచ్ పీఠం వరించింది. మరికొందరు గెలుస్తామని ధీమాగా ఉన్నవారు సైతం ఓటమి చెందారు. ఇదిలా ఉండగా కొన్ని ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు కక్షలకు దారి తీశాయి. గెలిచిన అభ్యర్థులపై ఓడిన అభ్యర్థులు దాడులకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. అయితే కామారెడ్డిలో మాత్రం అంతా రివర్స్ అయ్యింది. గెలిచిన అభ్యర్థికి చెందిన బంధువులు.. ఓడిపోయిన అభ్యర్థిపై కక్ష తీర్చుకునే ప్రయత్నం చేయడం సంచలనంగా మారింది. జిల్లాలోని సోమార్‌పేటలో ఎన్నికల కక్షలు భగ్గుమన్నాయి. ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి బాలరాజును గెలిచిన సర్పంచ్ తమ్ముడు ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఐదుగురుకు గాయపడ్డారు. వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గెలిచిన అభ్యర్థి పాపయ్య తమ్ముడు చిరంజీవికి, ప్రత్యర్థి బాలరాజు వర్గంతో గొడవ జరిగింది. చిన్న గొడవ కాస్తా చిలికి చిలికి గాలివానగా మారింది. ఆవేశంతో ఊగిపోయిన గెలిచిన అభ్యర్థి తమ్ముడు.. బాలరాజును ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఓడిన అభ్యర్థి బాలరాజుతో పాటు గంజి భారతి, బాలమణి, స్వరూప, పద్మ సత్యవ్వలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370